


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

లడ్డూకు తగ్గని డిమాండ్



వారం రోజుల్లో 23 లక్షల మేర విక్రయం

రోజుకు 3 లక్షలకు తగ్గకుండా అమ్మకం

ఫలితమిస్తున్న దిద్దుబాటు చర్యలు

ఈవోతో 'నందిని' ప్రతినిధుల భేటీ

నాణ్యతలో తేడా రావడానికి వీల్లేదు

భక్తుల మనోభావాలతో కూడిన అంశమిది: ఈవో 11

శుక్రవారం | 27-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 163 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: దశమి మ. 1.21 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పుష్యమి రా. 1.20 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 8.09-9.52; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.18, మ. 12.29-1.17; అమృతఘడియలు: రా. 6.27-8.10; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.03 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జాతీయ క్రీడలకు బీ రెడీ

2027లో రాష్ట్రంలో నిర్వహణకు సిద్ధం కావాలి

తదనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన

అమరావతిలో అతిపెద్ద స్టేడియం.. త్వరలో క్రీడా పాలసీ

క్రీడా హబ్‌గా తిరుపతి, అమరావతి, విశాఖపట్నం

ఆటలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు



12

'హైబ్రిడ్' ఉద్యోగాలకు

ప్రాధాన్యం

నైపుణ్యాలు పెంపొందిస్తే ప్రైవేటులో భారీగా ఉపాధి అవకాశాలు 12

బహుళజాతి కంపెనీలతో శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రైవేటులో అవకాశాలపై సీఎం సమీక్ష

ఎన్నికల హామీ అమలుకు కసరత్తు



వెంకటరెడ్డి అరెస్ట్!

ఏసీబీకి చిక్కిన గనుల తిమింగలం

హైదరాబాద్‌లో అదుపులోకి..

ధ్రువీకరించిన ఏసీబీ అధికారులు

నేడు బెజవాడ కోర్టుకు మాజీ డైరెక్టర్

లొంగుబాటా.. అరెస్టా? అనే అనుమానాలు

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి అరెస్టయ్యారు. కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి వచ్చి రాష్ట్ర సంపదను నాడు తాడేపల్లి పెద్దలకు దోచిపెట్టిన వెంకటరెడ్డిని ఎట్టకేలకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. అయితే,

మిగతా 2వ పేజీలో...

జగన్ గో బ్యాక్



తిరుమల పర్యటనపై జనాగ్రహం

రెచ్చగొట్టొద్దు.. బాధపెట్టొద్దు

హిందూ సంఘాల హెచ్చరిక

జగన్‌ను అడ్డుకుంటామని ప్రకటన

మా శరీరాలపై నుంచే తిరుమలకు వెళ్లాలి

శాంతి భద్రతల సమస్య వస్తే బాధ్యత మీదే

జగన్‌ను హెచ్చరించిన పలువురు స్వామీజీలు

తిరుపతిలో 30 పోలీస్ యాక్ట్ విధింపు

డిక్లరేషన్ ఇస్తే తప్పేంటి?

జగన్‌పై పెరుగుతున్న ఒత్తిడి!

ఆలయ నిబంధనలపైనా భేషజాలేనా?

సీఎంగా ఉన్నప్పుడు బేఖాతరు

లడ్డూ వివాదంతో 'పోటీ' పర్యటన

నేడు తిరుమలకు జగన్.. రేపు దర్శనం



తిరుపతిలో గరుడ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న శ్రీనివాసానంద స్వామి తదితరులు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన వ్యవహారం కాక రేపుతుండగానే.. మాజీ సీఎం జగన్ తిరుమలకు వస్తుండటం మరింత మంట రాజేస్తోంది. ఐదేళ్లుగా తన చేష్టలు, లడ్డూ కల్తీపై తన మాటలతో హిందూ భక్తుల మనోభావాలు గాయపరిచిన జగన్‌ను తిరుపతిలో అడుగు పెట్టనీయబోమని హిందూ సంఘాలు హెచ్చరికలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తిరుపతి పరిధిలో

మిగతా 11వ పేజీలో...



జనసేనలో చేరిన బాలినేని

సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య కూడా..

కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన పవన్

మరికొందరు వైసీపీ నేతలూ చేరిక 11



పార్టీలో చేరిన బాలినేని, కిలారు, సామినేని తదితరులతో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల



రెడ్ బుక్ అమలు మొదలైంది!

ఐపీఎస్‌లు సస్పెండయ్యారు

చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలేది లేదు: లోకేశ్

శ్రీకాకుళంలో పర్యటన.. విశాఖలో ప్రజా దర్బార్ 11

అక్రమాల ఫైళ్ల గుట్టలు!

మద్యం స్కాంలో సీఐడీ స్వాధీనం

కంప్యూటర్లు, ఇతర ఆధారాలూ

మూడో రోజూ తనిఖీలు 2

డిజిటల్, ఫోరెన్సిక్, ఆర్థిక నిపుణులతో ఆడిట్‌కు నిర్ణయం

ధరలు, ముడుపులు, వాటాల గుట్టు విప్పే దిశగా విచారణ

4 కేటగిరీల్లో మద్యం షాపులు

జనాభా ఆధారంగా శ్లాబుల వర్గీకరణ 3

ఫీజుగా రూ.50 లక్షలు, 55, 65, 85 లక్షలు

50 లక్షల శ్లాబు పరిధిలో ఎక్కువ షాపులు

తిరుపతి జిల్లాలో అత్యధికంగా 264.. మొత్తం షాపులు 3,736

ఇందులో గీత కార్మికులకు 340

ఏఐ పండించిన పంట

ప్రపంచంలోనే తొలి ఇండోర్, ఏఐ ఆధారిత వర్టికల్ బెర్రీ ఫామ్
వర్జీనియాలో ఏర్పాటు.. కృత్రిమ మేధ పర్యవేక్షణతో 90% నీరు ఆదా





న్యూయార్క్, సెప్టెంబరు 26: వర్టికల్ ఫార్మింగ్ గురించి మనకు తెలుసు! నియంత్రిత వాతావరణంలో మొక్కలను పెంచడమూ కొత్త కాదు!! కానీ.. ఈ రెండింటికీ కృత్రిమ మేధను కూడా జోడిస్తే? పసిపాపల్లా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన మొక్కలను ఏఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఫొటోలు తీసి వాటికి ఏం కావాలో విశ్లేషిస్తూ, కావాల్సిన పోషకాలు ఎప్పటికప్పుడు అందేలా చేస్తే? అదుగో.. అలాంటి ఆలోచనకు ప్రతిఫలమే ఇక్కడ కనిపిస్తున్న స్ట్రాబెరీ పంట. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రం రిచ్‌మండ్‌లో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఇండోర్, ఏఐ-ఆధారిత వర్టికల్ బెర్రీ ఫామ్.. 'ద ప్లెంటీ రిచ్‌మండ్ ఫామ్' ఈ సరికొత్త వ్యవసాయ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. కేవలం 0.91 ఎకరా విస్తీర్ణంలో ఏడాదికి 18 లక్షల కిలోల స్ట్రాబెరీలను పండించడమే లక్ష్యంగా 30 అడుగుల ఎత్తున్న టవర్లను నిర్మించింది. ఆ టవర్లలో నాటిన మొక్కలకు కావాల్సిన వేడి, వెలుతురు, తేమ వంటివాటిని ఏఐ సాయంతో నియంత్రించింది. దానివల్ల మొక్కలు చాలా ఆరోగ్యంగా పెరగడమే కాక.. అత్యుత్తమ నాణ్యతతో కూడిన స్ట్రాబెరీలు పండుతున్నాయి. మామూలుగా అయితే స్ట్రాబెరీ పంట వేయాలంటే ఎకరానికి దాదాపుగా 22 వేల మొక్కలు నాటుతారు. ఎకరాకు దాదాపు 8 టన్నుల దిగుబడి వస్తుంది! కానీ.. కృత్రిమ మేధ పర్యవేక్షణ, వర్టికల్ విధానంలో సాగు చేయడం వల్ల.. సంప్రదాయ విధానంలో పండించే పంట కన్నా 90 శాతం తక్కువ నీటిని, 97 శాతం తక్కువ భూమిని ఈ ఫామ్ వినియోగించుకుంటోంది. భవిష్యత్తు ఆహారోత్పత్తికి కొత్త భరోసానిస్తోంది. కాగా.. ఈ ఆలోచనను అమల్లోకి తేవడానికి ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఆరేళ్లపాటు కృషి చేశారు. 200కు పైగా ట్రయల్స్ చేసి.. చివరికి అత్యుత్తమ విధానాన్ని రూపొందించారు. పర్యావరణానికి ఎలాంటి హానీ కలిగించకుండా మానవాళికి తగినంత ఆహారాన్ని సరఫరా చేయడానికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు.

కళ్లజోడు కాదు.. కంప్యూటర్!

బ్రెయిన్ సిగ్నల్స్‌తో, కంటిచూపుతో,
చేతి కదలికతో నియంత్రించగలిగే
ఏఆర్ గ్లాసెస్ 'ఓరియన్'ను ఆవిష్కరించిన
మెటా సీఈవో జుకెర్‌బెర్గ్



న్యూయార్క్, సెప్టెంబరు 26: రేడియో, టేప్‌రికార్డర్, కాలుక్యులేటర్.. ఇలా ఎన్నో ఉపకరణాలను కాలగర్భంలో కలిపేసిన స్మార్ట్‌ఫోన్‌ను మరిపించే 'అగ్‌మెంటెడ్ రియాలిటీ గ్లాసెస్'ను మెటా సీఈవో మార్క్ జుకెర్‌బెర్గ్ ప్రపంచానికి ప్రదర్శించారు. 'ఓరియన్' పేరుతో రూపొందించిన ఈ ఏఆర్ గ్లాసెస్‌ను.. మన మెదడు సంకేతాలతో, కంటి చూపుతో, చేతికదలికలతో నియంత్రించవచ్చు (అలా నియంత్రించడానికి మన చేతి మణికట్టుకు ఒక బ్యాండ్‌ను ధరించాల్సి ఉంటుంది). డిజిటల్ కంటెంట్‌ను నిరంతరాయంగా వీక్షించవచ్చు. కంప్యూటర్ల తరహాలోనే.. ఒకేసారి పలు వర్చువల్ విండోలు ఓపెన్ చేసి.. మల్టీ టాస్కింగ్ చేయొచ్చు. ఆ విండోల్లో మనకు కనిపించేవాటిలో ఒకదాన్ని ఎంచుకోవడానికి.. మన కళ్లే 'మౌస్ పాయింటర్'లా పనిచేస్తాయి. దాన్ని క్లిక్ చేయడానికి మన చేతి వేళ్ల కదలికలే సంకేతాలవుతాయి. దీంతో వీడియో గేమ్స్ ఆడొచ్చు. వీడియో కాల్స్ కూడా చేసుకోవచ్చు. వీడియోకాల్ చేసినప్పుడు అవతలి వ్యక్తుల లైఫ్ సైజ్ హోలోగ్రామ్‌లను మన ముందు ప్రదర్శిస్తాయి. ఈ కళ్లజోడును ధరించి మన ముందున్న వస్తువులను చూస్తే.. ఇందులో ఉండే ఏఐ వాటిని గుర్తించి, వాటి పేర్లను డిస్‌ప్లే చేస్తుంది. అక్కడున్న పదార్థాలతో ఏ వంటకాన్ని తయారుచేయొచ్చో అడిగితే సలహాలిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. కళ్లజోడును కాదు.. ఒక కంప్యూటర్‌ని కళ్లకు ధరించినట్టే ఉంటుందన్నమాట!! ఈ కళ్లజోడు తయారీలో వినియోగించిన అద్దాలు గాజువి కావు. సిలికాన్ కార్బైడ్ మెటీరియల్‌తో తయారుచేసినవి. ఫ్రేమ్‌ని మెగ్నీషియంతో తయారుచేశారు. ఇందులో ఉండే మైక్రో ఎల్ఈడీ ప్రొజెక్టర్లు.. 70 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూ ఉండే హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేను మన కళ్ల ముందు ఆవిష్కరిస్తాయి. అందుకే దీన్ని "ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన కళ్లజోడు"గా దీన్ని జుకెర్‌బెర్గ్ అభివర్ణించారు. నిజానికి మెటా సంస్థ దశాబ్దకాలంగా వీటిపై కృషి చేస్తోంది. మెటాతోపాటు ఇంకా చాలా కంపెనీలు ఈ తరహా ఏఆర్ గ్లాసెస్‌ను తయారుచేయడంలో బిజీగా ఉన్నాయి. వాటిలో.. 'స్నాప్' అనే కంపెనీ 'స్పెక్టకిల్స్ 5' పేరుతో ఇటీవలే ఒక కళ్లజోడును మార్కెట్లోకి తేనున్నట్టు ప్రకటించింది. దాంతో పోలిస్తే 'ఓరియన్' గ్లాసెస్ చాలా చిన్నగా.. మామూలు కళ్లద్దాల్లా కనిపించడం గమనార్హం. అయితే, ఈ కళ్లజోళ్ల ఉత్పత్తి ఖర్చు ఒక్కొక్కదానికీ 10 వేల డాలర్లు అవుతోంది. అంత ధర పెడితే కొనే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి.. ప్రజలకు అందుబాటు ధరల్లోకి తెచ్చేందుకు మెటా కృషి చేస్తోంది. ప్రస్తుతం ప్రపంచమంతా వినియోగిస్తున్న స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల ధరకే ఏఆర్ గ్లాసెస్ కూడా మరికొన్నేళ్లలో ప్రజలకు అందుబాటు ధరల్లోకి వస్తాయని జుకెర్‌బెర్గ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే దీని బరువు 98గ్రాములు. దీన్ని కూడా తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

లెబనాన్‌పై భూతల దాడులకు సర్వం సిద్ధం!

సిరియా-లెబనాన్ సరిహద్దులపై భీకర దాడులు

- కుప్పకూలిన అపార్ట్‌మెంట్.. 23 మంది మృతి
- హిజ్బుల్లా వైమానిక దళ కమాండర్ సోరౌర్ కూడా
- ఆయుధాల స్మగ్లింగ్ టన్నెల్స్ ధ్వంసం
- హిజ్బుల్లా అంతమే మా లక్ష్యం: నెతన్యాహు
- భారతీయులు వెనక్కి రండి: విదేశాంగ శాఖ


లెబనాన్ భూభాగంలో ఇజ్రాయెల్ జెండా

టెల్‌అవీవ్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: ఇజ్రాయెల్ పదాతి దళాలు లెబనాన్‌లోకి చొచ్చుకుపోయి.. భూతల దాడులకు సర్వం సిద్ధం చేస్తున్నాయి. సరిహద్దుల్లో వైమానిక దళాలు, పారాట్రూపర్లతోపాటు.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పదాతి దళాలు యుద్ధ ట్యాంకర్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఓ దశలో అమెరికా, ఫ్రాన్స్ చొరవతో చర్చల ప్రతిపాదన తెరపైకి వచ్చినా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తమ దాడులు కొనసాగుతాయని గురువారం తేల్చిచెప్పారు. ఆ వెంటనే ఐడీఎఫ్ 7వ బ్రిగేడ్ భూతల దాడులపై సరిహద్దుల వద్ద విన్యాసాలు చేసింది. 'నేషనల్ ల్యాండ్ ట్రైనింగ్ సెంటర్' నేతృత్వంలో ఈ విన్యాసాలను జరిగాయి. మరోవైపు బీరుట్, ఇతర ప్రాంతాలపై ఐడీఎఫ్ వైమానిక దళం వరుసగా నాలుగో రోజు-- గురువారం కూడా గగనతల దాడులను కొనసాగించింది. బీరుట్‌లోని అల్-ఖైమ్, పశ్చిమ అల్-బెక, మష్రా, మిదౌన్, అల్-మయాదీన్ పట్టణాలపై దాడులు జరిగాయి. అల్-ఖైమ్‌లో జరిపిన దాడుల్లో ఓ అపార్ట్‌మెంట్ నేలమట్టమవ్వగా.. పలు దుకాణాలు, భవనాలు దెబ్బతిన్నట్లు లెబనాన్ వార్తాసంస్థలు తెలిపాయి. హిజ్బుల్లా ఎయిర్ యూనిట్ కమాండర్ మహమ్మద్ హుస్సేన్ సోరౌర్ లక్ష్యంగా ఈ దాడుల్లో.. ఆయనతోపాటు నలుగురు మృతి చెందినట్లు పేర్కొన్నాయి. సిరియా-లెబనాన్ సరిహద్దుల్లోని బాల్బెక్‌పై జరిగిన దాడుల్లో 23 మంది సిరియా శరణార్థులు చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మృతుల్లో ప్రముఖ సిరియా గాయకుడు అహ్మద్ అల్-ఖాన్సా కుమారుడు ఉన్నట్లు తెలిపింది. ఈ పరిసరాల్లో.. ముఖ్యంగా బెకా లోయలో సిరియాకు చెందిన 7.8 లక్షల మంది శరణార్థులు ఆశ్రయం పొందుతున్నట్లు వివరించింది. గడిచిన నాలుగు రోజుల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణాల సంఖ్య 630కి చేరినట్లు వెల్లడించింది. కాగా.. అల్-అరబీ టీవీ చానల్ ప్రతినిధి రమీజ్ అల్-ఖాదీ గురువారం లైవ్‌లో ఉండగా.. అతని పైనుంచి ఓ క్షిపణి దూసుకెళ్లి దృశ్యం నెట్టింట వైరల్‌గా మారింది. తాజా దాడుల్లో లెబనాన్-సిరియా మధ్య ఆయుధాల స్మగ్లింగ్ కోసం ఉగ్రవాదులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశాలకు న్యూయార్క్ బయలు దేరిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హిజ్బుల్లా అంతమే తమ ధ్యేయమని పునరుద్ఘాటించారు. నెతన్యాహుకు మద్దతిస్తున్న విపక్ష నేతలు కూడా.. కాల్పుల విరమణకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించకూడదని డిమాండ్ చేశారు. ఒకవేళ అదే జరిగితే.. తాము సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలగుతామని జేపీపీ చీఫ్ ఇతమార్ బెన్-గ్విర్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఇంకోవైపు.. లెబనాన్‌లోని భారతీయులు వెనక్కి రావాలని విదేశాంగ శాఖ కోరింది. లెబనాన్‌లోని భారతీయ దౌత్య కార్యాలయం ఈ మేరకు వరుస ట్వీట్లు చేసింది. లెబనాన్‌లో 4 వేల మంది వరకు భారతీయులున్నట్లు వెల్లడించింది. గాజాలో వెంటనే కాల్పుల విరమణను పాటించాలని భారత్‌కు చెందిన ఏడు వామపక్ష పార్టీలు-- సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్‌పీ డిమాండ్ చేశాయి. గురువారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయా పార్టీల ముఖ్య నేతలు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు.

డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్ర ప్రయోగం!

- ప్రత్యర్థులు భారీ వైమానిక, క్షిపణి దాడులు చేసినా..
- రష్యా అణు విధానంలో అత్యంత కీలకమైన మార్పులు
- పాశ్చాత్య దేశాలకు ఇది హెచ్చరికగా పేర్కొన్న క్రెమ్లిన్



మాస్కో, సెప్టెంబరు 26: ఉక్రెయిన్ నుంచి డ్రోన్ దాడులు భయపెడుతున్న వేళ.. రెండున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధం కొలిక్కిరాని సమయంలో.. పాశ్చాత్య దేశాలు మరిన్ని ఆయుధాలిస్తే ప్రత్యర్థిని ఓడిస్తామని జెలెన్‌స్కీ కోరుతున్న సందర్భంలో రష్యా అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. తమ అణ్వస్త్ర స్పందన విధానంలో అత్యంత కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు రష్యా లేదా దాని మిత్ర దేశాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తే.. అణ్వాయుధాలను వాడేందుకు రష్యా సిద్ధపడుతుంది. కొత్తగా చేపట్టిన సవరణల ప్రకారం.. వ్యూహాత్మక ఆయుధాలు, వైమానిక, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పాటు డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్రాలను వాడేందుకు తగిన నిర్ణయం తీసుకుంటుంది. సన్నిహిత దేశమైన బెలారస్‌పై దాడికి దిగినా రష్యా అణ్వాయుధాలను ప్రయోగిస్తుంది. ఇది ఉక్రెయిన్‌కు సాయం చేస్తున్న పాశ్చాత్య దేశాలకు ఓ గట్టి హెచ్చరిక అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రకటించింది. అణ్వాయుధాలే కాక.. ఇతర మార్గాల్లో దాడులకు దిగినా స్పందన ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ మార్పులు చేసినట్లు వివరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశ భద్రతా మండలి సమావేశంలోనూ కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్ర విధానంలో మార్పుల గురించి ప్రస్తావించారు. తమపై దాడి చేస్తోన్న అణ్వస్త్రాలు లేని దేశానికి (ఉక్రెయిన్).. అణ్వస్త్రాలున్న మరో దేశం అండగా నిలుస్తోందంటూ మండిపడ్డారు. దీనిని ఆ రెండు దేశాలు కలిపి చేస్తున్న దాడిగానే చూస్తామన్నారు. పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన దీర్ఘశ్రేణి ఆయుధాలతో తమ మీద దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అనుమతిస్తే.. నాటో కూటమి కూడా యుద్ధంలో చేరినట్లేనని భావిస్తామని స్పష్టం చేశారు.

21 మంది పిల్లలపై అత్యాచారం

హాస్టల్ వార్డెన్‌కు మరణశిక్ష


- మరో టీచరు, హెడ్మాస్టర్‌కు 20 ఏళ్ల వంతున జైలు
- బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు
- అరుణాచల్ ప్రదేశ్ పోక్సో కోర్టు తీర్పు

ఇటానగర్, సెప్టెంబరు 26: నైతిక విలువలు మరిచిన గురువులకు న్యాయస్థానం కఠిన శిక్షలు విధించింది. 21 మంది పిల్లలపై అత్యాచారం చేసిన హాస్టల్ వార్డెన్ యుమ్‌కెన్ బగ్రాకు మరణశిక్ష విధిస్తూ అరుణాచల్ ప్రదేశ్‌లోని యుపియాకు చెందిన ప్రత్యేక పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఇందుకు సహకరించిన మరో ఇద్దరికి 20 ఏళ్ల వంతున జైలు శిక్ష విధించింది. బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారు. వారంతా 6-15 ఏళ్లలోపు ఉన్నవారే. షియోమీ జిల్లాలోని కారో గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పనిచేసిన ఆ వార్డెన్ 2019-2022 మధ్య ఈ దారుణానికి పాల్పడినట్టు కేసు నమోదయింది. ఈ సంగతి తెలిసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా సహకరించినందుకు అప్పటి హెడ్మాస్టర్ సింగుటున్ యోర్పెన్, హిందీ టీచరు మార్‌బోమ్ నగోమ్‌దిర్‌లకు 20 ఏళ్ల వంతున కఠిన కారాగార శిక్ష విధించింది. పిల్లలకు మత్తుమందు ఇచ్చి, వారు నిద్రలోకి జారుకున్న తరువాత అత్యాచారం చేసినట్టు 'సిట్' దర్యాప్తులో తేలింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో ఎవరూ నోరు మెదపలేకపోయారు. కానీ గత ఏడాది నవంబరులో కవలలైన తన ఇద్దరు కుమార్తె(12 ఏళ్లు)లపై అత్యాచారం చేసినట్టు ఓ తండ్రి ఫిర్యాదు చేయడంతో జరిగిన నేరం వెలుగులోకి వచ్చింది. అనంతరం మరికొందరు ఫిర్యాదు చేయడంతో మొత్తం 21 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. వీటిని చూసి వార్డెన్ యుమ్‌కెన్ బగ్రా పరారవగా, పోలీసులు గాలించి ఆ నెల చివర్లో అరెస్టు చేశారు. అనంతరం కోర్టు నిందితునికి బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన నేరాలు ఉన్నా బెయిల్ ఇవ్వడంపై గౌహతి హైకోర్టు ఇటానగర్ బెంచ్ సుమోటోగా విచారణ జరిపింది. నేర తీవ్రత దృష్ట్యా ఈ ఏడాది జూలైలో బెయిల్‌ను రద్దు చేసింది. పోక్సో కోర్టు విచారణ జరిపి కఠినాతికఠిన శిక్షలు విధించింది. దీనిపై ఎస్పీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదన్న ఉద్దేశంతో కోర్టు గరిష్ఠ శిక్షలు విధించిందని తెలిపారు.

పథకం ప్రకారమే హసీనాకు ఉద్వాసన

అది యాదృచ్ఛికంగా వచ్చిన తిరుగుబాటు కాదు.. పక్కా ప్రణాళికతోనే బంగ్లాదేశ్ ఆందోళనలు

- సూత్రధారులను పరిచయం చేసిన తాత్కాలిక ప్రభుత్వ సారథి యూనుస్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి కారణమైన ఇటీవలి ఆందోళనల వెనుక ఉన్న 'సూత్రధారుల'ను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనుస్ ప్రపంచానికి పరిచయం చేశారు. అవి పక్కా ప్రణాళికతో నిర్వహించిన ఆందోళనలని, అదో క్రమశిక్షణతో కూడిన తిరుగుబాటు అని యూనుస్ వెల్లడించారు. ఏ ఒక్కరినో నాయకుడిగా గుర్తించడానికి లేదా అరెస్టు చేయడానికి అవకాశమే లేకుండా నిర్వహించడం వల్ల ఆ ఆందోళనలు మరింత శక్తిమంతంగా మారాయని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన అక్కడ క్లింటన్ గ్లోబల్ ఇనీషియేటివ్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఇటీవలి బంగ్లాదేశ్ ఆందోళనలను ఆయన ఆ కార్యక్రమంలో ప్రస్తావించారు. అవి యాదృచ్ఛికంగా జరిగిన ఆందోళనలు కావని, అవి ఎంతో జాగ్రత్తగా రూపొందించిన ఆందోళనలని యూనుస్ తెలిపారు. ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం మేరకు తన ప్రత్యేక సహాయకుడు మహఫూజ్ ఆలంను ఆ కార్యక్రమంలో యూనుస్ పరిచయం చేశారు. 'మేం సంయుక్తంగా తీసుకున్న బాధ్యత ఇది. ఆ ఆందోళనల్లో వారు ఇతర యువకుల్లాగే కనిపిస్తారు. మీరు వారిని గుర్తించలేరు. అయితే, వారు కార్యాచరణకు దిగినప్పుడు మీరు గనుక చూశారంటే, వారు మాట్లాడినప్పుడు మీరు విన్నారంటే షాక్‌కు గురవుతారు. వారు తమ ప్రసంగాలు, అంకితభావం, నిబద్ధత ద్వారా దేశం మొత్తాన్ని కదిలించారు. ఈయననే ఆ మొత్తం ఆందోళనల వెనుక సూత్రధారిగా భావిస్తున్నారు. ఈయన మాత్రం తాను కాదని, వేరే చాలా మంది ఉన్నారనే పదేపదే అంటున్నారు. ఆ విధంగా ఆయన అంతా పకడ్బందీగా నిర్వహించారు. అది అకస్మాత్తుగా వచ్చిన ఆందోళన కాదు. పక్కాగా, చాలా జాగ్రత్తగా రూపొందించిన ఆందోళన. నాయకత్వ బాధ్యతల్లో ఉన్నవారికి కూడా నాయకుడెవరూ తెలియలేదు. అదో అద్భుతం. ప్రపంచంలో ఎక్కడనా సరే, వారు మాట్లాడే భాష ఏ ప్రాంతంలోనైనా, ఏ యువతకైనా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. వారే వీరు. వీరిని చప్పట్లతో అభినందించండి. వీరు కొత్త బంగ్లాదేశ్‌ను సృష్టిస్తున్నారు. వీరి ప్రయత్నం విజయవంతమవ్వాలని ఆకాంక్షిద్దాం' అని యూనుస్ తెలిపారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో నాటి ప్రధాన మంత్రి హసీనా ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత దేశానికి పరారైన విషయం తెలిసిందే.

సీనియర్ జర్నలిస్టు ఆదినారాయణ మృతి

- సీఎంలు చంద్రబాబు, రేవంత్ సంతాపం



హైదరాబాద్, అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, ఈటీవీ హైదరాబాద్ బ్యూరోచీఫ్‌గా పని చేస్తున్న తన్నీరు ఆదినారాయణ (48) గురువారం ఉదయం మృతి చెందారు. తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో వాకింగ్ చేస్తూ కళ్లు తిరగడంతో అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారిపడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను కుటుంబసభ్యులు మియాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మియాపూర్ వినాయక్‌నగర్‌లోని విండ్‌ఫర్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న ఆదినారాయణ, రమాదేవి దంపతులకు ఇద్దరు పిల్లలు. ఒకరు బీటెక్, మరొకరు ఏడో తరగతి చదువుతున్నారు. ఆయన 25 ఏళ్లుగా ఈటీవీలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జర్నలిస్టు ఆదినారాయణ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఆదినారాయణ చురుకైన అంకిత భావం కలిగిన పాత్రికేయుడని, సమాజంలో మార్పు కోసం నిరంతరం తన వృత్తిలో శ్రమించారని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. ఆదినారాయణ మృతి వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అని సంతాపం వ్యక్తం చేశారు. టీవీ మీడియాలో అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టు టీ.ఆదినారాయణ మరణించారని తెలిసి చింతించినట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తనకు ఆయన ఈటీవీ నారాయణగా పరిచితులని గుర్తుచేశారు.

అక్రమాల ఫైళ్ల గుట్టలు!

- మద్యం కుంభకోణంలో సీఐడీ స్వాధీనం
- విజయవాడలో మూడో రోజూ తనిఖీలు
- డిజిటల్, ఫోరెన్సిక్, నిపుణులతో ఆడిట్ చేయించాలని నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన వేలకోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించి సీఐడీ బృందాలు భారీగా ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నాయి. వాటిని విశ్లేషించేందుకు కనీసం మూడు నెలలు పట్టవచ్చని అంచనా వేస్తున్నాయి. విజయవాడలోని ప్రసాదంపాడులో ఉన్న ఏపీ బ్రూవరీస్ కార్యాలయంలో మూడు రోజుల పాటు సీఐడీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాలు గురువారం ముగిశాయి. మొత్తం ఆధారాలను మూడు విభాగాలుగా విభజించి డిజిటల్, ఫోరెన్సిక్, ఫైనాన్షియల్ ఆడిట్ చేయించాలని నిర్ణయం తీసుకుంది. జగన్ రెడ్డి పాలనలో నాసిరకం మద్యంతో ఐదేళ్ల పాటు కొనసాగించిన అవినీతి, అక్రమాల గుట్టను తవ్వి వెలికి తీయనుంది. డిజిటల్, ఫోరెన్సిక్, ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఆయా రంగాల నిపుణులకు ఆధారాలు అప్పగించి సమగ్ర విశ్లేషణ చేయబోతోంది. కుంభకోణం ఎలా జరిగింది? ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి? మద్యం ఎంత ధరకు కొన్నారు? బేవరేజెస్ నుంచి బయటికి ఎంతకు విక్రయించారు? వంటి లావాదేవీల వెనకున్న అక్రమాలను వెలికి తీసేందుకు సీఐడీ సిద్ధమైంది. మద్యం ముడుపుల బాగోతం, నాసిరకం మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ప్రతిఫలాలు ఎవరెవరికి చేరాయి? వాటాల్లో ఎవరి వాటా ఎంత? అనేది క్షుణ్ణంగా తేల్చేందుకు నడుం బిగించింది. ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా సీఐడీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఏ చిన్న ఆధారాన్ని కూడా వదిలి పెట్టకుండా స్వాధీనం చేసుకున్నారు. పూర్తి ఆడిట్ జరిగిన తర్వాత పేదల రక్తాన్ని మద్యం కమీషన్ల రూపంలో తాగేసిన అసలు వ్యక్తులు బయటికి వస్తారని భావిస్తున్నారు. సీఐడీ వద్ద ఇమేజినరీ టెక్నికల్ టూల్స్ నాలుగు మాత్రమే ఉన్నాయని, డిజిటల్ ఆధారాలు కాపీ చేసుకోవడానికి చాలా టూల్స్ అవసరం అయ్యాయని ఒక అధికారి తెలిపారు.

వెంకటరెడ్డి అరెస్ట్!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పట్టుబడ్డారా లేక లొంగిపోయారా.? తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడిదే పెద్ద ప్రశ్న. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు...వెంకట రెడ్డిని శుక్రవారం వేకువజామున బెజవాడకు తీసుకొచ్చారు. శుక్రవారం మధ్యాహ్నంలోపు కోర్టులో ప్రవేశపెట్టి విచారణ నిమిత్తం ఆ తర్వాత కస్టడీకి తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం. కడప జిల్లాకు చెందిన వెంకటరెడ్డి కేంద్ర సర్వీసులకు చెందిన స్టాఫ్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి. రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడ అడుగు పెట్టారు. పంచభూతాల్లో ఒకటైన ఇసుక, మైనింగ్ జగన్ అనుయాయులకు దోచిపెట్టారు. ఇసుక టెండర్లు పాడుకున్న జేపీ వెంచర్స్‌తో కుమ్మక్కై, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు 800కోట్లు ప్రత్యక్షంగా నష్టం చేకూర్చారు. బయటికి కనిపించకుండా వేలకోట్ల రూపాయల సంపద దోపిడీకి సహకరించిన వెంకట రెడ్డి, అందులో సింహ భాగం తాడేపల్లి ప్యాలెస్‌కు చేర్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి ఎన్డీఏ సర్కారు ఏర్పడటంతో అక్రమాల నిగ్గు తేల్చే ప్రక్రియ ప్రారంభమైంది. చంద్రబాబు ప్రభుత్వం ప్రాథమిక నివేదిక తెప్పించుకుని ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించింది. ఆగస్టు 31న కేసు నమోదు చేసిన ఏసీబీ...కడప, తిరుపతి, విజయవాడతోపాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల్లో గాలించింది. అయితే ప్రభుత్వం మారగానే విదేశాలకు పారిపోయినట్లు వార్తలు రావడంతో ఆదిశగా ఏసీబీ నిఘా పెట్టింది. ఇదే సమయంలో వెంకట రెడ్డి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించగా అప్రమత్తమైన ఏసీబీ... ఆయనకు బెయిల్ రాకుండా అడ్డుపడింది. దిక్కుతోచని వెంకట రెడ్డి మధ్యవర్తుల ద్వారా ఏసీబీ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. మర్యాదగా లొంగిపోయి విచారణకు సహకరిస్తే తాము కఠినంగా వ్యవహరించబోమని, అలా కాకుండా వ్యతిరేకంగా వ్యవహరిస్తే తమదైన శైలిలో చర్యలుంటాయని వారు హెచ్చరించారు. దీంతో వెంకటరెడ్డి ఎట్టకేలకు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి లొంగిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

57 మంది ఆర్డీవోల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 57 మంది ఆర్డీఓలను ప్రభుత్వం బదిలీ చేస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు(జీఓ-1661) ఇచ్చారు. మొత్తం 77 రెవెన్యూ డివిజన్లు ఉండగా, ఇప్పుడు 57 మంది ఆర్డీవోలను బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి వారం రోజుల్లోనే బదిలీలు ఉంటాయని వార్తలు వచ్చినా శ్వేతపత్రాలు, ఆ తర్వాత వరదలు, ఇతర కారణాలతో ఆలస్యం జరిగింది. విశాఖపట్నం ఆర్డీఓగా పోలూరి శ్రీలేఖ, భీమిలికి కానాల సంగీత్ మధూర్, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి-భీమవరం, జీవీ. సత్యవాణి-చీపురుపల్లి, దాళ్ల కీర్తి-విజయనగరం, కిరణ్మయి-సూళ్లూరుపేట, భానుప్రకాశ్‌రెడ్డి-శ్రీకాళహస్తి, మడక కృష్ణమూర్తి-టెక్కలి, కె.సాయి ప్రత్యూష-శ్రీకాకుళం, పారపాటి సువర్ణ-పుట్టపర్తి, మహేశ్ ఆలకటూర్-ధర్మవరం, టి.ఆనంద్‌కుమార్-పెనుకొండ, కావూరి చైతన్య-విజయవాడ, నాగ సంతోష్ అనూష-నెల్లూరు, బాల సుబ్రహ్మణ్యం-గుడివాడ, ఎస్. మల్లిబాబు-కాకినాడ, గణేషన భాను శ్రీలక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష-పులివెందుల, జాన్ ఇర్విన్ పాలపర్తి-కడప, కె.శ్రీనివాసరావు-గుంటూరు, కె.స్వాతి మచిలీపట్నం, రామావత్ కృష్ణానాయక్-రాజమహేంద్రవరం. ఎం.శ్రీనివాసులు-చిత్తూరు, కేశవనాయుడు-అనంతపురం ఆర్డీఓగా నియమితులయ్యారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పుడున్న వారిని జీఏడీకి రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.

లోకం తీరు



బృందావనం ఆలయాల్లో పురాతన ప్రసాదాలు

మధుర: తిరుమల లడ్డూ ప్రసాదంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో బృందావనంలోని ఆలయాల్లో భక్తులకు మార్కెట్‌లో లభించే మిఠాయిలు పంపిణీ చేయకూడదని ధర్మ రక్షా సంఘం నిర్ణయించింది. దీనికి బదులు కాలానుగుణంగా లభించే పండ్లు, పూలు, డ్రైఫ్రూట్స్, యాలకులు, పంచదారతో తయారుచేసిన పురాతన ప్రసాదాలను అందించాలని ప్రతిపాదించింది. దేశవ్యాప్తంగా దేవాలయాల్లో అనుసరిస్తున్న ప్రసాదాల పంపిణీ విధానంలో సంస్కరణలు అవసరమని సంఘం జాతీయ అధ్యక్షుడు సౌరభ్ గౌర్ అన్నారు.

రేపు తిరుమలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్ శనివారం తిరుమలకు రానున్నారు. శనివారం సాయంత్రం తిరుమలకు చేరుకుని రాత్రి బస చేస్తారు. ఆదివారం ఉదయం 8.15 గంటలకు శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

4 కేటగిరీల్లో మద్యం షాపులు!



- జనాభా ఆధారంగా శ్లాబుల వర్గీకరణ
- నేడో, రేపో పాలసీ విడుదల

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ విడుదలకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. నేడో రేపో నోటిఫికేషన్ జారీ చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,736 షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో 340 షాపులను కల్లు గీత కార్మికులకు కేటాయించింది. మిగిలిన 3,396 షాపులను లాటరీ విధానంలో కేటాయిస్తారు. జనాభా ఆధారంగా లైసెన్స్ ఫీజులకు నాలుగు శ్లాబులను ఎక్సైజ్ శాఖ రూపొందించింది. 10 వేల మంది లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాలి. 10 వేలు దాటి 50 వేల మంది వరకు రూ.55 లక్షలు.. 50 వేలు పైబడి 5 లక్షల మంది వరకు ఉన్న చోట్ల రూ.65 లక్షలు.. 5 లక్షల మందికిపైగా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలను ఫీజుగా నిర్ణయించారు. ఈ ఫీజులను ఏడాదిలో ఆరు విడతల్లో చెల్లించే వెసులుబాటు వ్యాపారులకు కల్పిస్తున్నారు. ఏటా 10 శాతం పెంచుతారు. రూ.50 లక్షల శ్లాబు పరిధిలోనే ఎక్కువ షాపులు (1,310) ఉన్నాయి. రూ.55 లక్షల శ్లాబులో 1,032, రూ.65లక్షల పరిధిలో 1,119, రూ.85 లక్షల పరిధిలో 275 దుకాణాలు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే తిరుపతి జిల్లాలో అత్యధికంగా 264 షాపులున్నాయి. వాటిలో 24 గీత కార్మికులకు కేటాయించారు. తర్వాతి స్థానం పశ్చిమ గోదావరి జిల్లాది (225). అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 37 షాపులు, పార్వతీపురం మన్యంలో 58 షాపులు ఉన్నాయి. మద్యం షాపుల పనివేళలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయి. అలాగే మొత్తం షాపులను ప్రభుత్వం రెండు విధాలుగా వర్గీకరించింది. 3,736లో గీత కులాలకు కేటాయించిన 340 షాపులకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. మిగిలిన 3,396 షాపులకు శుక్రవారం నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. వచ్చే నెల మొదటివారంలోగా ఈ పాలసీని అమల్లోకి తీసుకురావాలని ఎక్సైజ్ శాఖ సంకల్పించింది. అప్పటివరకూ ప్రభుత్వ మద్యం షాపులు కొనసాగుతాయి. ఆ తర్వాత గీత కార్మికులకు కేటాయించిన 340 షాపులకు మరో నోటిఫికేషన్ ఇస్తారు. ఎలైట్ షాపులకు కూడా ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

మూడు సవరణలు

మద్యం పాలసీపై నియమించిన కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసుల్లో ప్రభుత్వం మూడు సవరణలు చేసింది. క్వార్టర్ సీసా కనీస ధరను రూ.వందకు సిఫారసు చేయగా దానిని రూ.99కి మార్చింది. ఎలైట్ షాపులను నగరాల్లో ఏర్పాటుచేయాలని సిఫారసు చేయగా తిరుపతిని మినహాయించింది. గీత కార్మికులకు 10 శాతం షాపులను సిఫారసు చేయగా దానిని గీత కులాలుగా మార్చింది.

సెబ్ రద్దుపై ఆర్డినెన్స్ జారీ

గత ప్రభుత్వం కొత్తగా సృష్టించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను పూర్తిగా రద్దుచేస్తూ గవర్నర్ గురువారం ఆర్డినెన్స్ జారీచేశారు. సెబ్ ఏర్పాటుచేసిన గత ప్రభుత్వం.. కొన్ని అధికారాలను ఎక్సైజ్‌తో పాటు సెబ్‌కు కూడా ఇచ్చింది. ఇటీవల ఎక్సైజ్ శాఖను పునర్ వ్యవస్థీకరించడంతో ఎక్సైజ్ చట్టంలో సెబ్‌కు అధికారాలు, సెబ్ అనే పేరును తాజా ఆర్డినెన్స్‌లో తొలగించారు. కాగా.. మద్యం షాపులకు సంబంధించి మరో ఆర్డినెన్స్ జారీ కావలసి ఉంది. గతంలో మద్యం వ్యాపారం ప్రభుత్వ లేదా ప్రైవేటు అని చట్టంలో ఉండేది. వైసీపీ ప్రభుత్వం ప్రైవేటును పూర్తిగా తొలగించింది. దీంతో ఇప్పుడు కొత్త పాలసీ ఇవ్వాలంటే చట్టంలో మళ్లీ ప్రైవేటును చేర్చాలి. ఈ ఆర్డినెన్స్ కోసం ఇటీవల రాజ్‌భవన్‌కు పంపిన ఫైలులో కొన్ని పొరపాట్లు ఉండడంతో గురువారం వాటిని సవరించి మళ్లీ పంపారు. ఆ ఆర్డినెన్స్ జారీ కాగానే పాలసీకి నోటిఫికేషన్ ఇస్తారు.

ఉద్యోగాల కోసం దళారులను నమ్మొద్దు

- సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) బి.శ్రీనివాసరావు సూచించారు. కేజీబీవీల్లో 507 బోధన పోస్టులు, 97 బోధనేతర పోస్టులు భర్తీ చేస్తున్నామని.. ఈ ప్రక్రియ కలెక్టర్ల ఆధ్వర్యంలో మెరిట్ ఆధారంగా జరుగుతుందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో పార్వతమ్మకు తుది వీడ్కోలు

- తరలివచ్చిన ప్రముఖులు, అభిమానులు



మాగుంట పార్వతమ్మ పార్థివదేహం వద్ద గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి సతీమణి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మను కడసారి చూసేందుకు ప్రముఖులు, అభిమానులు భారీగా నెల్లూరుకు తరలివచ్చారు. నగరంలోని సరస్వతీనగర్‌లోని మాగుంట నివాసంలో ఉంచిన ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పార్వతమ్మ అంతిమయాత్ర ప్రారంభమైంది. ఈ అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు పాల్గొన్నారు. బోడిగాడితోటలో దహన సంస్కారాలు జరిగాయి. పార్వతమ్మ చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, దామచర్ల జనార్దన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పార్వతమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరాం, కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డి, కంభంపాటి విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి పార్వతమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

దేశ సేవకు ముందుండాలి

- విద్యార్థులకు వెంకయ్యనాయుడు పిలుపు



సైనిక పాఠశాల అధికారులు, విద్యార్థులతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/విజయనగరం టౌన్, సెప్టెంబరు 26: ప్రతి విద్యార్థి దేశ సేవకు ముందుండాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. విజయనగరం జిల్లా కోరుకొండలో రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రితో పాఠశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు. అలాగే కల్నల్ సంతోష్‌బాబు మెమోరియల్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆడిటోరియంలో విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాల గొప్పతనాన్ని వివరించారు. కోరుకొండ సైనిక పాఠశాల పచ్చటి పరిసరాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో నడుస్తోందని, విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా బోధన అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులంతా ఏ దేశమేగినా మాతృభూమిని, మాతృభాషను మరువొద్దని సూచించారు. ప్రాథమిక విద్య మాతృభాషలో సాగాలని, ప్రతి ఒక్కరూ దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని చెప్పారు. భవిష్యత్తులో భారత సైన్యంలో చేరి సేవలందించాలనుకునే విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న శిక్షణ అత్యుత్తమమైనదని వెంకయ్యనాయుడు తెలిపారు.

తాడికొండ ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- వీఐటీలోకి వెళ్లకుండా అడ్డుకున్న సెక్యూరిటీ



విద్యార్థిని మృతి విషయమై వీఐటీ వీసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 26: అమరావతి రాజధాని ఐనవోలు పరిధిలో ఉన్న వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) విద్యార్థిని సాయిశ్రీయ ఆత్మహత్య విషయం గురించి తెలుసుకోవడానికి వెళ్లిన తాడికొండ శాసన సభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్‌కు గురువారం సాయంత్రం చేదు అనుభవం ఎదురైంది. వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది గేటు వద్ద ఆయన్ను అడ్డుకున్నారు. ఎవరైనా సరే లోపలికి వెళ్లడానికి అనుమతుల్లేవని చెప్పడంతో ఎమ్మెల్యే కంగుతిన్నారు. ఎమ్మెల్యేకే లోపలికి వెళ్లడానికి అవకాశం లేదంటే ఇక సామాన్యులు పరిస్థితి ఏమిటని యాజమాన్యంపై శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులను ఎందుకు లోపలికి అనుమతించడం లేదని ప్రశ్నించారు. అనంతరం వర్సిటీ లోపలికి వెళ్లిన శ్రావణ్ కుమార్ విద్యార్థిని మృతికి గల కారణాలను వైస్ చాన్సలర్ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీశ్ ముదిగంటిని అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

'దేవర' పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్'



దేవర పోస్టర్లపై 'సేవ్ వైజాగ్' అని రాసి ఉన్న కరపత్రాలు అంటిస్తున్న జన జాగరణ సమితి కన్వీనర్ వాసు

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం కార్మికులు 1300 రోజులుగా చేస్తున్న దీక్షకు జూనియర్ ఎన్‌టీఆర్ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జనజాగరణ సమితి ప్రతినిధులు గురువారం విశాఖ నగరంలో 'దేవర' సినిమా పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్' అని రాసి ఉన్న కరపత్రాలు అంటించారు. కోట్లాది మంది అభిమానులు ఉన్న ఎన్‌టీఆర్ విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతుగా నిలిస్తే ప్రభుత్వాల్లో తప్పకుండా చలనం వస్తుందని ఈ సందర్భంగా జన జాగరణ సమితి కన్వీనర్ వాసు అభిప్రాయపడ్డారు. విశాఖలో శ్రీరామా టాకీస్ వద్ద స్లోగన్లు అతికించిన తరువాత ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ అభిమాన సంఘాలు కూడా విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో గాజా దిశగా...!

మీరు ఈ వీడియో చూడటం హిజ్బొల్లాకు ఇష్టం లేదు, ఇతరులకు షేర్ చేయడం దానికి అస్సలు నచ్చదు అంటూ ట్విటర్‌లో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) దానిని పోస్టు చేసింది. దక్షిణ లెబనాన్‌మీద ఇజ్రాయెల్ సాగిస్తున్న భయానకదాడుల్లో ఇప్పటికే లక్షమంది నిరాశ్రయులైన నేపథ్యంలో, తన చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ఈ వీడియో విడుదల చేసింది. హిజ్బొల్లా ఎంత దుర్మార్గమైనదో, భయానకమైనదో తెలియచెప్పడం దీని లక్ష్యం. దక్షిణ లెబనాన్ అంతటా హిజ్బొల్లా తన ఉగ్రవాద వ్యవస్థను విస్తరించిందని, భూగర్భంలో సొరంగాలు నిర్మించిందని, మారణాయుధాలను దాచిందని, సామాన్యుల ఇళ్ళను ఆయుధాగారాలుగా మార్చేసిందని ఇజ్రాయెల్ వాదన. కొన్ని చిత్రాలు, మరికొన్ని గ్రాఫిక్స్‌తో తయారైన ఈ వీడియోలో ఇజ్రాయెల్ తాను మిగతా ప్రపంచానికి చెప్పదల్చుకున్నదీ, ఆరోపించదల్చుకున్నదీ ఉంది. ఇదంతా ఆత్మరక్షణలో భాగమేననీ, లెబనాన్‌మీద దాడిచేయకపోతే తాను నాశనమైపోతాయని ఇజ్రాయెల్ చెప్పుకుంటోంది. హిజ్బొల్లాతో చర్చలు, కాల్పుల విరమణ వంటి ప్రతిపాదనలను తిరస్కరించడమే కాక, లెబనాన్‌లోకి చొరబడటానికి సిద్ధంగా ఉండమని తన సైన్యాన్ని ఇజ్రాయెల్ ఆదేశించడంతో గాజాయుద్ధం కొత్త మలుపు తీసుకుంది.

మరో పదిరోజుల్లో అక్టోబర్ 7 ఘటనకు ఏడాది అవుతుంది. ఇజ్రాయెల్ మీద హమాస్ అమానుష దాడికి ప్రతీకారంగా, గాజామీద యుద్ధానికి దిగుతూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ రెండు ప్రధాన లక్ష్యాలు ప్రకటించారు. హమాస్ అపహరించుకుపోయిన వారిని భద్రంగా వెనక్కుతెచ్చి కుటుంబీకులకు అప్పగించడం, ఇజ్రాయెల్ ఉనికికి ప్రమాదకరంగా పరిణమించిన ఉగ్రవాద హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేయడం. మధ్యలో కొద్దిమందిని హమాస్ తనకు తానుగా అప్పగించడం, మరికొందరు చనిపోవడం కాక ఇంకా చాలామంది ఇజ్రాయెలీలు హమాస్ నిర్బంధంలోనే ఉన్నారు. అమెరికా ఆర్థిక, ఆయుధ సాయంతో ఏడాదిగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధంలో గాజా పూర్తిగా నేలమట్టమై, దాదాపు యాభైవేలమంది మరణించి, లక్షలమంది నిరాశ్రయులైన నేపథ్యంలో, హమాస్ సైతం బాగా దెబ్బతిన్నమాట నిజం. కానీ, అది నాశనమైందని ఐడీఎఫ్ ఉన్నతాధికారులు కూడా అనడం లేదు. హమాస్‌తో అవగాహనకు వచ్చి మిగిలిన బందీలను సైతం విడిపించనందుకు నెతన్యాహూమీద ప్రజాగ్రహం అధికంగా ఉంది. ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు, ర్యాలీల దశదాటి ఇటీవల దేశవ్యాప్త సమ్మె కూడా జరిగింది. కాలు ఎలా వెనక్కుతీసుకోవాలో తెలియని స్థితిలో, ఇప్పుడు నెతన్యాహూ తన యుద్ధక్షేత్రాన్ని మరింత విస్తరించుకుంటూ పోతున్నారు. హమాస్ మాదిరిగానే హిజ్బొల్లాను కూడా కూకటివేళ్ళతో సహా పెకిలించివేస్తానని, అప్పుడు మాత్రమే ఇజ్రాయెలీలు నిశ్చింతగా ఉండగలరని చెబుతున్నాడు.

హిజ్బొల్లాతో యుద్ధం ఇప్పటికిప్పుడు ఆరంభమైందేమీ కాదు కానీ, అమీతుమీ తేల్చుకొనే పని జరుగుతోంది. ఎప్పటిలాగానే అమెరికా సహా ఇజ్రాయెల్ మిత్ర, ఆప్తదేశాలన్నీ ఏవేవో సుద్దులు చెబుతూ, యుద్ధానికి హద్దులు గీస్తూంటే ఇజ్రాయెల్ మాత్రం తాను అనుకున్నది చేసుకుపోతోంది. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుగా పేజర్లు, ఆ తరువాత వాకీటాకీల పేల్చివేతతో వందలాదిమంది ఫైటర్లని క్షణాల్లో ఎందుకూ కొరగానివారిని చేసి, హిజ్బొల్లా పునాదులను ఇజ్రాయెల్ కుదిపేసింది. ఆ తరువాత క్షిపణిదాడుల్లో అగ్రశ్రేణి నాయకత్వాన్ని వరుసపెట్టి హతమారుస్తోంది. లెబనాన్ పౌరుల మొబైల్‌ఫోన్లలోకి నేరుగా మెసేజ్‌లు పంపి ఇజ్రాయెల్ వారికి హితవులు చెబుతోంది, హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇప్పుడు నేరుగా పొరుగుదేశంలోకి చొచ్చి, భూతల దాడులతో యుద్ధాన్ని పైదశకు తీసుకుపోవాలన్నది నెతన్యాహూ కోరిక. ఇజ్రాయెల్ వరుస దెబ్బలకు హిజ్బొల్లా గిలగిల్లాడుతున్నమాట నిజం. రెండు దశాబ్దాల తరువాత ఇజ్రాయెల్ చేతిలో ఈ స్థాయిలో చావుదెబ్బతిన్నప్పటికీ, మళ్ళీ కోలుకోదన్న హామీ ఏమీ లేదు. కానీ, హిజ్బొల్లాను నాశనం చేసే పేరిట లెబనాన్‌లోకి చొరబడి, అక్కడ మరో గాజాని సృష్టించే ఇజ్రాయెల్ విధానం ఏమాత్రం సరికాదు. ప్రస్తుతానికి హెచ్చరికలతో సరిపెడుతున్న ఇరాన్‌ను యుద్ధబరిలోకి లాగడానికి ఇటువంటి చర్యలు తోడ్పడతాయి. నెతన్యాహూ నిజంగానే ఇజ్రాయెలీల క్షేమాన్ని కాంక్షిస్తున్నపక్షంలో ఇప్పటికైనా యుద్ధానికి కాక, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

ఎన్నికల వ్యవస్థకు ఈ 'శస్త్రచికిత్స' అవసరమా?

ఒక నిజమైన ప్రశ్న కోసం ఎదురు చూస్తున్న తెలివైన సమాధానాలు ప్రపంచంలో సమృద్ధిగా ఉంటాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి చర్చ ప్రారంభమయినప్పుడు, అది విధాన సంబంధమైన ఒక అసాధారణ పరిష్కారం ఒక అసలైన సమస్యను వెతుకుతున్నట్టుగా కనిపించింది. ఒక రుగ్మతను అన్వేషిస్తున్న ఒక గోసాయి చిట్కా లేదా రోగం కంటే ప్రమాదకరమైన మందుగా అది కనిపించింది. అంతేనా? అది, నోట్ల రద్దు (డిమానిటైజేషన్)కు కొనసాగింపుగా ఉన్నది. అవును మరి, ఒక దార్శనికత లేదా ఒక విపుల ప్రణాళిక లేకుండా ఏదో ఒక మహత్కార్యాన్ని నిర్వహించడానికి పూనుకునే ఆధునిక తుగ్లక్ ప్రవృత్తిని ప్రతిబింబించిన ఆలోచనే ఒకే దేశం ఒకే ఎన్నిక.



పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం శాసన వ్యవస్థకు జవాబుదారీగా ఉండాలనే మౌలిక సూత్రాన్ని ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన తలకిందులు చేస్తుంది. శాసనసభల, మునిసిపల్, పంచాయత్ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి నిర్వహించడమనేది మన సమాఖ్య పాలనా విధానానికి విరుద్ధం. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ అనేది మన రాజ్యాంగ 'మౌలిక నిర్మాణాన్ని' ఉల్లంఘించడమే అవుతుంది.

ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి దేశ పాలకులు ఎంత చలాకీగా చర్చిస్తున్నారో కదా. వారి ఉత్సాహాన్ని గమనించి 'ఏక కాలంలో ఎన్నికల నిర్వహణపై అత్యున్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సి) రూపొందించిన నివేదికను చదివాను. చదివిన తరువాత నాకు అనిపించిందేమిటంటే ఒకే దేశం ఒకే ఎన్నిక ఒక విడ్డూరమైనదే అయినప్పటికీ, ఒక నిరపాయకరమైన ప్రతిపాదన అనే భావన కలిగింది. చాలా కాలంగా ప్రత్యక్షంగానో పరోక్షంగానో అమలవుతున్న ఒక విస్తృత రాజకీయ ప్రణాళికలో భాగమే ఆ ప్రతిపాదన. జనసమ్మతమైన అంశాలకు తావు లేనిదిగా ప్రజాస్వామ్యాన్ని మిగిల్చి మన ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాలనే మధ్యతరగతి ప్రజల కాల్పనిక భావనల ఆ ప్రతిపాదన అంకురించింది. ఇప్పుడది, ప్రజాస్వామ్యాన్ని వశపరచుకుని దాన్ని శక్తి హీనం చేయాలనే ప్రస్తుత పాలకుల ఆకాంక్షతో జత కట్టింది.

281 పేజీల (అనుబంధాలతో కలుపుకుంటే మొత్తం 18,345 పేజీల) హెచ్‌ఎల్‌సి నివేదిక తమను నియమించిన వారి అభీష్టాల ప్రకారం రూపొందించిన పత్రం. ఆ కమిటీ నిర్ణయాలు, సిఫారసులు దానికి నిర్దేశించిన పరిశీలనాంశాలలోనే ఉన్నాయి సుమా! నోట్ల రద్దు నిర్ణయ సుగుణాలను సృష్టించాలని రిజర్వ్ బ్యాంక్‌ను ఆదేశించినట్టుగానే ఒకే దేశం ఒకే ఎన్నిక సహేతుకతను ఆవిష్కరించేందుకు హెచ్‌ఎల్‌సిని ఉద్దేశించారు. ప్రభుత్వ అనుకూల, ఒకే దేశం ఒకే ఎన్నిక భావనను సమర్థించేవారితో నిండిపోయిన హెచ్‌ఎల్‌సి విధేయపూర్వకంగా, దాన్ని అమలుపరిచేందుకు అవసరమైన శాసన, రాజ్యాంగ పరమైన లాంఛనాలు, పరిపాలనా పరమైన ఏర్పాట్ల వివరాలతో నివేదికను నింపివేసింది.

ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన సహేతుకతను ఆవిష్కరించాల్సిన అనివార్యత వల్ల ఆ నివేదిక ఒక విచిత్రమైన పఠనానుభవాన్ని కలిగిస్తోంది. నిరంతర ఎన్నికల వల్ల మహారాష్ట్ర లాంటి కొన్ని రాష్ట్రాలలో 300 రోజులు వృథా అయిపోతున్నాయని విచారం వ్యక్తం చేసింది. ఒకే నాయకుడు ఎమ్మెల్యే, ఎంపి స్థానాలకు ఏక కాలంలో పోటీ చేసేందుకు వీలు కాదు కనుక ఒకే దేశం ఒకే ఎన్నికతో రాజకీయ కార్యకర్తలు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని హెచ్‌ఎల్‌సి నివేదిక ముక్తాయించింది. అంతేకాదు విద్వేష ప్రసంగాల సందర్భాలను గణనీయంగా తగ్గిస్తుందని కూడా పేర్కొంది. మరీ ముఖ్యంగా 'ఓటరు అలసట' సమస్యను పరిష్కరిస్తుందని ఉద్ఘాటించింది. భారతదేశంలో ఎన్నికలపై రెండు దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్న నేను ఈ సమస్య గురించి ఎప్పుడూ వినని లేదు!

హెచ్‌ఎల్‌సిలో 'రాజ్యాంగ నిపుణుడు' అయిన సభ్యుడి రాజ్యాంగ విజ్ఞత ఏమిటో చూడండి: భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థ అధ్యక్ష తరహా, పార్లమెంటరీ విధాన ప్రభుత్వాల కలయిక అట! ఈ ఆలోచనా రీతి ఇంకా ఎలా ఉన్నదో చూడండి! 'కేంద్ర, రాష్ట్ర స్థాయి, స్థానిక పాలనా సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల పౌర సంలగ్నత, జాతీయ సమైక్యత పెంపొందుతాయి. ప్రజాస్వామ్య పండుగలో దేశ పౌరులు అందరూ సమష్టిగా పాల్గొనడం వల్ల పౌరసత్వ బంధాలు, సౌభ్రాతృత్వం బలోపేతమవుతాయి'. పాఠశాల బాలలు ఒక సైన్స్ ప్రాజెక్ట్‌లో తమ 'నవకల్పన' ప్రయోజనాలు ఎంత అపారంగా ఉంటాయో వివరించినట్టుగా లేదూ ఇది?



▪ యోగేంద్ర యాదవ్

ఈ శబ్దాడంబరం మాటకేమిగానీ నివేదిక కీలక వాదన ఇది. ఏక కాలంలో ఎన్నికల నిర్వహణ పాలనా నాణ్యతను మెరుగుపరుస్తుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎన్నికల విధులకు మళ్లించడాన్ని తగ్గించడం, ప్రభుత్వ నిధులను ఆదా చేయడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంపై ప్రభావాన్ని తగ్గించడం మొదలైనవి ఏక కాలంలో ఎన్నికల నిర్వహణతో ఒనగూరుతాయి. ఇవన్నీ యుక్తియుక్తమైన వాదనలు, సందేహం లేదు. అయితే వాటిని చాలా జాగ్రత్తగా అంచనా వేయవలసి ఉన్నది.

మరి ప్రపంచ నాయకుల పర్యటనలు, మత పరమైన సమావేశాల వల్ల పాలనకు అంతరాయాలు కలగడం లేదా? సరే, ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ బడ్జెట్ నుంచి ఏ నిష్పత్తిలో ఖర్చు పెడుతున్నారు? అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయాలతో ప్రభుత్వం చేస్తున్న ఖర్చును సరి చూడండి. ఇక విధాన వైకల్యం అనే వాదనను చూద్దాం. ఎన్నికల వల్ల ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఐదేళ్లలో కేవలం నాలుగు నెలల పాటు మాత్రమే పాలనా వ్యవహారాలకు భంగం కలుగుతోంది. రాష్ట్ర శాసనసభల ఎన్నికలు కేంద్ర ప్రభుత్వానికి తరచూ ప్రతిబంధకమవుతున్నాయన్న వాదనలో నిజమెంత?

ఆరు నెలలలోగా అసెంబ్లీ ఎన్నికలు జరగవలసిన అన్ని రాష్ట్రాలలోను సదరు ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. మరి మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ విషయంలో ఇటువంటి నిర్ణయాన్ని ఎందుకు తీసుకోలేదు? ఈ ఆరు నెలల వ్యవధి నిబంధనను 12 నెలలకు పొడిగించడం సబబుగా ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించే ఎన్నికల సంఘం ఆ ఎన్నికల నిర్వహణ వ్యవధిని ఒక పక్షం రోజులకు, మూడుకు మించని దశలకు తప్పక కుదించగలదు. ఎన్నికల సమయంలో పరిపాలన యథావిధిగా కొనసాగేందుకు వీలుగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సవరించాలి. సాధారణ మాత్రలతో తగ్గే రుగ్మతకు శస్త్రచికిత్స చేయవలసిన అవసరం ఏమిటి?

ఏక కాలంలో ఎన్నికల నిర్వహణతో సమకూరే ప్రయోజనాలను అంగీకరించినప్పటికీ ఆ ప్రతిపాదనను అమలుపరచడం వల్ల మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక వ్యవస్థకు జరిగే తీవ్ర నష్టాన్ని విధిగా గమనంలోకి తీసుకోవాలి. ఇండియా కూటమికి చెందిన 15 రాజకీయ పక్షాలు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కొట్టివేయలేని వాస్తవమేమిటంటే ఎన్నికల కాలెండర్‌లో అది కేవలం ఒక పరిపాలనాపరమైన మార్పు కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహకవర్గం శాసన వ్యవస్థకు జవాబుదారీగా ఉండాలనే మౌలిక సూత్రాన్ని అది తలకిందులు చేస్తుంది. శాసనసభల, మునిసిపల్, పంచాయత్ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి నిర్వహించడమనేది మన సమాఖ్య పాలనా విధానానికి విరుద్ధం. ఈ విధంగా ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ అనేది మన రాజ్యాంగ 'మౌలిక నిర్మాణాన్ని' ఉల్లంఘించడమే అవుతుంది.

జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల ఓటర్ల మొగ్గు స్పష్టంగా జాతీయ పార్టీలకు అనుకూలంగాను, ప్రాంతీయ పార్టీలకు వ్యతిరేకంగాను ఉంటుంది. ఈ ఏడాది వేసవిలో ఒడిషాలో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగడం వల్లే బీజేపీకి మెజారిటీ లభించిందనేది నా అభిప్రాయం.

ప్రజాస్వామిక రాజకీయాలలోని గలాభాను తగ్గించడమే ఆ ప్రతిపాదనలో ఉన్న ఆకాంక్ష అని చెప్పవచ్చు. ఏకకాల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రాజకీయ ఆర్థికత వివరించేందుకు హెచ్‌ఎల్‌సి నివేదిక తన దృష్టిని కేంద్రీకరించడంలో ఆశ్చర్యమేమీ లేదు. నవీన గణితాత్మక ఆర్థిక నమూనాల ప్రాతిపదికన ఏకకాల ఎన్నికల నిర్వహణ రాజకీయ సుస్థిరతకు, సత్వర ఆర్థికాభివృద్ధికి, సదా సానుకూల విధాన వాతావరణానికి, జనాకర్షణీయ ఒత్తిళ్లను తగ్గించేందుకు దోహదం చేయగలదని ఆ నివేదిక వాదించింది. ఇది, నేను ఒకప్పుడు 'మధ్యతరగతి ప్రజల స్వైర కల్పన'లుగా గుర్తించిన ధోరణికి అనుకూలంగా ఉన్నది. ఈ ధోరణి మన ప్రజా జీవితంలో సుదీర్ఘకాలంగా ఉన్నది.

ఈ దేశ సామాజిక, ఆర్థిక జీవనంలో ప్రభావశీలురుగా ఉన్నవారు మన అసహ్యకరమైన రాజకీయాల పట్ల సహనం కోల్పోతున్నారు. ఈ పరిస్థితిని తొలగించేందుకు వారు వివిధ పరిష్కారాలతో ముందుకు వస్తున్నారు. రాజకీయాలను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్యను పరిమితం చేయాలని, ప్రాంతీయ పార్టీలకు విధిగా కనీస ఓట్ల నిబంధన, రాజకీయ పార్టీలు విచక్షణారహితంగా వాగ్దానం చేస్తున్న 'ఉచితాల'కు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావడం మొదలైనవి ప్రతిపాదించారు. రాజకీయ వర్గాలలో కొన్ని బీజేపీ నాయకత్వంలో– ఈ పార్టీకి మాత్రమే పరిమితమైనవి కావు– ఒకే దేశం ఒకే ఎన్నిక పట్ల సానుకూలత చూపుతున్నాయి. ఎన్నికల తలనొప్పిని తగ్గించుకునేందుకు నిరంతరం జవాబుదారీగా ఉండాల్సిన ప్రయాసను తొలగించుకునేందుకు ఒక దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదన సత్వరమే అమలు కావాలని వారు కోరుకుంటున్నారు. ఎన్నికలను పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాదు కదా. అది సాధ్యం కానప్పుడు చేయగల ఉత్తమ పని సకల ఎన్నికలను ప్రతి ఐదేళ్లకొకసారికి మాత్రమే పరిమితం చేయడం. తద్వారా పాలనా వ్యవహారాలకు ప్రజల నుంచి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలపాటు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు వారు జాగ్రత్త పడుతున్నారు. మొత్తం మీద ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదనలోని ముఖ్యాంశాలను నిశితంగా పరిశీలిస్తే అది ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధమైనది అని చెప్పక తప్పదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఈ అనుకోని 'గ్రామీణ డిమాండ్' ఎక్కడిది?

సెప్టెంబర్ 10, 2024న 'మింట్' పత్రికలో మొదటి పేజీలోనే ఒక కథనం వచ్చింది. దాని ప్రకారం– గ్రామీణ డిమాండ్ పెరగటం వల్ల ప్రైవేట్ వినియోగం తిరిగి పుంజుకుంది. ఇది నిజమా? అసలు ఈ ప్రైవేట్ వినియోగం అంటే ఏమిటి? ప్రైవేట్ వినియోగం అంటే వినియోగదారులు చేసే అన్ని రకాల కొనుగోళ్ళు. ఉదాహరణకు: ఆహారం, గృహాలు (కిరాయి లేదా అద్దె), ఇంధన అవసరాలు, దుస్తులు, ఆరోగ్యం, ఆటవిడుపు (విరామం), విద్య, మొబైల్ ఫోన్ల వంటి సమాచార అవసరాలు, రవాణా, హోటళ్ళు లేదా రెస్టారెంట్లు తదితరాలపై దేశంలోని ప్రజలు పెట్టే ఖర్చులన్నీ ఈ తరహా క్రిందకే వస్తాయి.

అంటే, ప్రస్తుతం 'మింట్' పత్రిక కథనం ఈ ప్రైవేటు వ్యక్తులూ లేదా కుటుంబాల వినియోగం పెరిగిందని చెబుతోంది. దీని ప్రకారంగా, ఈ కొనుగోళ్ళ పెరుగుదల, ఈ సంవత్సరం ఏప్రిల్–జూన్ కాలంలో జరిగింది (ఇది 2024–25 ఆర్థిక సంవత్సరం తాలూకు తొలి త్రైమాసిక కాలం). ఏడు త్రైమాసికాలుగా (21 నెలల పైబడి) నేల చూపులు చూస్తోన్న వినియోగ వ్యయాలు ఈ 2024–25 తొలి త్రైమాసికంలో ఒక్కసారిగా, అంతకు ముందరి త్రైమాసికం అయిన 2023–24 తాలూకు నాల్గవ త్రైమాసిక (జనవరి–మార్చి) కాలంలోని 4శాతం స్థాయి కంటే, అధిక స్థాయిలో 7.4శాతంగా నమోదు అయ్యింది.

ఈ విధంగా, గ్రామీణ వినియోగం పుంజుకోవడం అనేది దేశీయ ఆర్థిక వృద్ధికి భారీగా లబ్ధి చేకూర్చగలదనేది ఆ పత్రిక కథనం తాలూకు సారాంశం. గ్రామీణ డిమాండ్ పెరుగుదలకు కారణాలుగా ఉండగల మెరుగైన ఋతుపవనాలు, మంచి వ్యవసాయ ఉత్పత్తి, తగిన గిట్టుబాటు ధర లభించడం వంటివన్నీ నేడు పరిస్థితి మెరుగుదలకు కారణంగా ఉన్నాయని ఆ పత్రిక చెబుతోంది. ఫలితంగానే, ఈ మధ్యన ప్రపంచ బ్యాంకు భారతదేశపు, 2025 ఆర్థిక సంవత్సరం తాలూకు స్థూల జాతీయ ఉత్పత్తి అంచనాలను పెంచిందట. అంటే, ప్రస్తుత గ్రామీణ వినియోగం పెరుగుదల వలన దేశ స్థూల జాతి ఉత్పత్తికి ఒక్క శాతం మేరకు అదనపు ప్రయోజనం చేకూరగలదట. అదీ విషయం...! అయితే ఇదంతా వాస్తవంలో సాధ్యమయ్యేదేనా? సందేహాస్పదమే! కానీ, కారణాలు ఏవైనా నేడు 2025 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో గ్రామీణ ప్రైవేటు వినియోగం గణనీయంగా పుంజుకుందన్నది నిజం. మరి, మన గ్రామాలలో ఈ వృద్ధి ఎక్కడ నుంచి ఎలా వచ్చింది? బహుశా మనం ఇక్కడ ఏదో ఒక కీలక అంశాన్ని మిస్ అవుతున్నాం.



కేవలం గ్రామీణ ప్రైవేటు వినియోగం మాత్రమే ఒంటరిగా ఈ తొలి త్రైమాసికంలో దేశానికి మెరుగైన ఆర్థిక స్థితిని ఇవ్వగలిగిందా? నూటికి నూరు పాళ్ళు ఇది సాధ్యం అయ్యేది కాదు. మరేం జరిగింది?

మన దేశం తాలూకు, స్థూల జాతి ఉత్పత్తిలో ఈ ప్రైవేటు వినియోగం వాటా 50శాతం పైనే ఉంటుంది. కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగా ఉండడంలో ఈ అంశం తాలూకు పాత్ర చాలా కీలకమైంది. నిజానికి దేశీయ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తులూ లేదా ఇంజన్లుగా నాలుగు అంశాలను చూస్తారు: 1) ప్రైవేటు వినియోగం 2) ప్రైవేటు పెట్టుబడులు 3) ప్రభుత్వ పెట్టుబడులు 4) ఎగుమతులు. వీటిలో మొదటిది అయిన ప్రైవేటు వినియోగం గత 21 మాసాల పైబడి దిగజారుతూ వచ్చింది. అదే ఇప్పుడు 2024–25 తొలి త్రైమాసికంలో తిరిగి పుంజుకుందని మింట్ పత్రిక చెబుతోంది. కాగా రెండవది, ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులు. ఈ ఇంజన్ చాలా కాలంగా మొరాయిస్తోంది. ప్రభుత్వం, ప్రైవేట్ కార్పొరేట్ రంగానికి కార్పొరేట్ పన్నును 32శాతం నుంచి సుమారు 22శాతానికి తగ్గించినా, కార్మిక చట్టాలు తదితరాలను కార్పొరేట్‌లకు అనుకూలంగా సవరించినా, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పి.ఎల్.ఐ) పేరిట రాయితీలు ఇచ్చినా కార్పొరేట్లు మాత్రం కొత్తగా పెట్టుబడులు పెట్టడం లేదు. దేశంలో ప్రజల కొనుగోలు శక్తి దిగజారి, డిమాండ్ లేకపోవడమే దీనికి కారణం. ఇక మూడవది, ప్రభుత్వ పెట్టుబడులు, నాల్గవది, ఎగుమతులు. గత కొద్ది సంవత్సరాలుగా దేశీయ ఎగుమతులు బాగా దెబ్బతిన్నాయి. దీనికి కారణం మన దగ్గర నుంచి, దిగుమతులు చేసుకొనే అనేక దేశాలలో ఆర్థిక పరిస్థితులు దిగజారి, డిమాండ్ పతనం కావడం. అంతిమంగా, దేశంలో ప్రస్తుతం ఈ నాలుగు ఇంజన్‌లలో పూర్తి స్థాయిలో పని చేస్తోంది కేవలం, ప్రభుత్వ పెట్టుబడులే! గత కొద్ది సంవత్సరాలుగా, దేశంలో కొనుగోలు శక్తినీ, డిమాండ్‌నూ నిలిపి ఉంచుతోంది ప్రధానంగా ఈ ప్రభుత్వ పెట్టుబడులే. కాగా, ప్రస్తుతం గ్రామీణ వినియోగం పుంజుకున్న 2024–25 కాలంలోనే (పార్లమెంట్ ఎన్నిక జరిగిన కాలం) ప్రభుత్వ పెట్టుబడులు బలహీనపడ్డాయి. అంటే, స్థూలంగా ఈ కాలంలో దేశ ఆర్థిక స్థితి మెరుగుదలకు ప్రభుత్వ పెట్టుబడులు కూడా కారణం కాదు. మరి అయితే, కేవలం గ్రామీణ ప్రైవేటు వినియోగం మాత్రమే ఒంటరిగా ఈ తొలి త్రైమాసికంలో, దేశానికి మెరుగైన ఆర్థిక స్థితిని ఇవ్వగలిగిందా? నూటికి నూరు పాళ్ళు ఇది సాధ్యం అయ్యేది కాదు. మరేం జరిగింది?

ఇక్కడ గమనించవలసింది 2024 ఏప్రిల్ – జూన్ కాలం అనేది దేశంలో పార్లమెంటరీ ఎన్నికల కాలం. ఈ కాలం తాలూకు ప్రత్యేకత ఎన్నికల సంఘం, రాజకీయ పక్షాలు, పోటీ చేసే అభ్యర్థులు అటు తెల్ల డబ్బు, ఇటు నల్ల డబ్బు కలగలిపి భారీగా ఖర్చులు చేయడం. ఈ ఖర్చులు అనేక రకాలు ప్రచారానికి వచ్చినందుకు జనాలకు అభ్యర్థులు ముట్టచెప్పే 'కూలీ' డబ్బు. ఎన్నికల ప్రచారం కోసం బ్యానర్‌లు, పోస్టర్‌లు, మీడియా ప్రచారాలు, బాడుగ కార్లు వగైరా వగైరా అన్నీ కూడా జనాలకు తాత్కాలిక ఉపాధిని, ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక ఉద్దీపనను కల్పించేవే. వీటన్నింటికీ తోడుగా 'ఓటుకు నోటు' ఎటుకూడీ ఉండనే ఉంది. అదీ అసలు కథ!

ఇక్కడ మరో వాణిజ్య పత్రిక కథనం ప్రకారం 2024 పార్లమెంటరీ ఎన్నికలలో దేశం మొత్తంలో అయిన ఖర్చులు లక్ష కోట్ల రూపాయల మేరకు ఉన్నాయి. ఈ ఖర్చు 2019 పార్లమెంటరీ ఎన్నికలతో పోలిస్తే దాదాపు రెట్టింపు. ప్రస్తుతం పెరిగిన ఆర్థిక వృద్ధి రేటు తాలూకు పజిల్‌కు సమాధానం ఈ ఎన్నికల వ్యయాలలోనే ఉంది. ఈ లక్ష కోట్ల రూపాయలు, 2024 ఏప్రిల్ – జూన్ కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనగా పని చేసాయి. అందులో భాగంగానే అప్పటికి అనేక త్రైమాసికాలుగా కుదేలైవున్న, గ్రామీణ ప్రాంతాలు కూడా గణనీయంగా మెరుగుదలను చూపించాయి. కాబట్టి మనం, ఆ ఒక్క త్రైమాసికం తాలూకు ఆర్థిక మెరుగుదలను చూసి ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకుందని సంబరపడడం తొందరపాటే అవుతుంది. కనీసం ఇంకా ఒకటి రెండు త్రైమాసికాలైనా అంటే 2024 డిసెంబర్ వరకు అయినా పరిస్థితులను గమనించి మాత్రమే, దేశ వాస్తవ ఆర్థిక స్థితి గురించిన అంచనాలకు రాగలం.

◆ డి. పాపారావు

రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర మహాసభలు

తెలుగు సమాజాల్లో రాయలసీమది ఒక వ్యథార్థ గాథ. తనకంటూ ఒక పేరు లేని దశ నుంచి పోరాటం ఆరంభించింది. సుమారు నూరేళ్లుగా దగాపడుతూ, ఓడిపోతూ, నిందలకు గురవుతూ, లోపలా బైటా విద్రోహాలకు బలవుతూ అస్తిత్వాన్ని కాపాడుకోడానికి పెనుగులాడుతున్నది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రా పాలకుల చేతిలో వంచనకు గురైనప్పటి నుంచి ఈ విషాదం కొనసాగుతున్నది. రెండు తెలుగు ప్రాంతాల మధ్య సమాన అవకాశాల కోసం జరిగిన శ్రీబాగ్ ఒప్పందం అమలు కాకపోగా వంచనగా చరిత్రలో నమోదైంది. కర్నూలు తాత్కాలిక రాజధానిగా 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటే రాయలసీమకు ఆ తర్వాత కూడా జరిగిన విద్రోహాలకు పునాదిగా మారింది. అప్పటి నుంచి ఇక అంతా మోసం, నిర్లక్ష్యం, నయవంచన. ఇందులో ఇతరుల దుర్మార్గం ఎంత ఉన్నదో సీమ నాయకుల పాత్ర కూడా అంతే ఉన్నది.

ఉమ్మడి రాష్ట్ర విభజన సన్నాహక దశలోనే రాయలసీమలో ప్రాంతీయ సమస్యల మీద ఆందోళన మొదలైంది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డప్పుడు, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డప్పుడు ఒక వెనుకబడిన ప్రాంతంగా తన భయాలను వ్యక్తం చేసినట్లే 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన కూడా తన మీద ఎట్లాంటి ప్రభావం చూపుతుందో అనే సందేహానికి లోనైంది. సుదీర్ఘకాలం ఆంధ్రా పాలకుల వంచనకు గురైన అనుభవం వల్ల విభజన సందర్భంలో అనేక రాయలసీమ సంస్థలు ఈ ప్రాంత అభివృద్ధికి నిర్దిష్టమైన డిమాండ్లను ముందుకు తీసుకొని వచ్చాయి.

విభజన అనంతర రాయలసీమ భవిష్యత్తును ప్రభుత్వాల చేతిలో పెట్టి వదిలేయకుండా ఈ ప్రాంత ప్రజలు అనేక పోరాటాలు చేపట్టారు. అందులో ముఖ్యమైనది మే 31, 2016న జరిగిన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన. ఇది విభజన అనంతర రాయలసీమ ప్రజా పోరాటాలకు ఒక దారిని, స్ఫూర్తిని, అవగాహనను అందించింది. 1985లో జరిగిన రాయలసీమ ఉద్యమం కంటే ఇది గుణాత్మకంగా భిన్నమైనది. ఆధిపత్య, అధికార రాజకీయాల్లో ఉన్న నాయకుల నుంచి రాయలసీమ ఉద్యమాలు బైటపడ్డాయనడానికి ఇది ఒక సంకేతం. ఈ ఒరవడి కొనసాగుతూ ఉండటం రాయలసీమ ఉద్యమ భవిష్యత్తుకు ఒక గొప్ప భరోసా.

కృష్ణా, తుంగభద్ర జలాలపై రాయలసీమ నీటిపారుదల వ్యవస్థ, వ్యవసాయం ఆధారపడి ఉన్నాయి. కృష్ణా బేసిన్‌లో రాయలసీమకు ఇవ్వదగినన్ని నీళ్లు ఉన్నాయని స్పష్టమైంది. కానీ ప్రభుత్వం చట్టబద్ధ హక్కులు కల్పించి జలాశయాలు నిర్మించాలి. ఇటీవలి వరదల్లో కూడా రాయలసీమలో ప్రస్తుతం ఉన్న జలాశయాలు సగం కూడా నిండలేదు. గుండ్రేవుల జలాశయం, సిద్దేశ్వరం అలుగు నిర్మించి ఉంటే ఈ వరద నీరు దుర్వినియోగం అయ్యేవి కావు. ప్రభుత్వ అభివృద్ధి విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వరదల్లో అన్ని ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వరదల తర్వాత తిరిగి యథావిధిగా నీటి సమస్య, కరువు ముందుకు వస్తుంది.

ప్రభుత్వ అభివృద్ధి విధానం మీద వెనుకబడిన ప్రాంతాలు, అన్ని ప్రాంతాల్లోని రైతులు, పేదలు, నిరుద్యోగులు ఉద్యమించాల్సి ఉంది. ఈ దిశగా ప్రజలను చైతన్యపరచడమే రాయలసీమ విద్యావంతుల వేదిక లక్ష్యం. రాయలసీమ విద్యావంతుల వేదిక నాల్గవ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 29న పొద్దుటూరు శ్రీశక్తి భవన్‌లో జరుగుతాయి.

– అరుణ్

కన్వీనర్, రాయలసీమ విద్యావంతుల వేదిక

ప్రజాక్షేమమే పాలకుల పరమావధి

ఏ కాలంలోనైనా ప్రజలు పాలకుడిని బట్టే ఉంటారని మన ప్రాచీన రాజనీతి బోధిస్తున్నది. అందుకే పెద్దలు "యథా రాజా తథా ప్రజాః" అన్నారు. అంటే పాలకుడు ధర్మబద్ధంగా ఉంటే ప్రజలు కూడా ధార్మికంగా నడుచుకుంటారు. పాలకుడు అవినీతికి పాల్పడితే ప్రజలు కూడా వెధవ ఆలోచనలు చేస్తుంటారు. ప్రజలు ఎప్పుడూ పాలకుడిని గమనిస్తూనే ఉంటారు. అందుకే బాధ్యత కలిగిన పాలకుడు పాలు తాగుతున్న పిల్లి తనని ఎవరూ గమనించడం లేదనుకున్నట్లు ఉండకూడదన్నది పెద్దల మాటలోని ఆంతర్యం. అంతేకాదు కోట్లాది ప్రజల బాగోగులను పట్టించుకోవడానికి భగవంతుడే పాలకుడిలో ప్రవేశించి అధికార స్థానంలో ఉన్నట్లుగా పద్ధతి గల పాలకుడు భావిస్తూ ఉండాలి. భారతీయ ధర్మశాస్త్రాలు "నా విష్ణుః పృథివీ పతిః" అని చెప్పడంలోని ఉద్దేశం అదే. కోటానుకోట్ల ప్రజల సంక్షేమాన్ని గురించి ఆలోచించి వాళ్ళని ఆదుకునే శక్తి, బుద్ధి, అవకాశం, అధికారం అందరికీ అంత తేలిగ్గా లభించవు. లభించిందంటే, ఆ వ్యక్తిలో దైవాంశ ఉంటే తప్ప అది జరగదు. అది తెలియక తమోగుణం పేట్రేగి స్వార్థంతో రాక్షసాంశను ప్రదర్శించిన పాలకుడు అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజల సంపదను ఆస్తులను కాపాడకపోగా వాటిని దిగమింగటానికి ప్రయత్నిస్తాడు. అది చాలా దురదృష్టం.

"యేన కే నాపి కార్యేణ సతాం హి లోక స్యారాధనం వ్రతం" (సత్పురుషులైన వారు ఏదైనా ఒక మంచి పని చేసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి) అని భవభూతి ఉత్తర రామ చరిత్రలో రాముడి నోట పలికిస్తాడు. నాటి రాచరికపు వ్యవస్థలోనే ప్రజాస్వామ్య విలువలని రాముడు పాటించాడు కనుకనే ప్రజాస్వామ్య పాలన ఆదర్శంగా ఉన్నది.



ప్రాచీన భారతీయ ధర్మ శాస్త్రాల్లోని ఆలోచన, తత్వం తెలిసి వాటి మీద అపారమైన భక్తి ప్రపత్తులు, విశ్వాసం కలిగిన వాళ్ళ భగవంతుడు కల్పించిన అధికార రూప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చరిత్ర పురుషులుగా మిగిలిపోతారు. శ్రీకృష్ణదేవరాయల లాంటి వారిని ఇన్ని శతాబ్దాలు గడిచినా నేటికీ ప్రజలు మర్చిపోకుండా ఆయన పేరుతో ఉత్సవాలు జరుపుకోవడంలో ప్రధాన కారణం ఆయన తన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవడమే. అలాకాకుండా అంది వచ్చిన అవకాశాన్ని దురహంకార, దుర్నీతులతో దుర్వినియోగం చేసుకున్నవాళ్లు నియంతలుగా, నికృష్టులుగా వర్తమాన, భావితరాల ఛీత్కారాలతో కాలగర్భంలో కలిసిపోతారు. అందుకే ఏ పాలకుడైనా ఏ కాలంలోనైనా అవలంబించవలసిన విధానం మొదటిదే. నాటి రాచరికపు వ్యవస్థలో ఉన్న రాజులు గానీ, నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న పాలకులు గాని ఎల్లవేళలా ప్రజా సంక్షేమాన్ని గురించి ఆలోచిస్తూ అభివృద్ధే పరమావధిగా ప్రజాభిప్రాయాన్ని మన్నించాలి తప్ప, అధికార మదంతో కళ్ళు కనిపించకుండా, ధృతరాష్ట్రుడిలా సంతాన వ్యామోహంలో పడి అన్ని అనర్థాలకు కారకులు కాకూడదు. నిస్వార్థంతో నిజాయితీగా ఉండి నిండు మనసుతో ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే దేవుళ్ళని నమ్మిన వాళ్లని భావితరాలు ఎప్పటికీ మర్చిపోవు.

"యేన కే నాపి కార్యేణ సతాం హి లోక స్యారాధనం వ్రతం" అని భవభూతి ఉత్తర రామ చరిత్రలో రాముడి నోట పలికిస్తాడు. సత్పురుషులైన వారు ఏదైనా ఒక మంచి పని చేసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలని దాని అర్థం. నాటి రాచరికపు వ్యవస్థలోనే ప్రజాస్వామ్య విలువలని అంతగా గుర్తించాడు రాముడు. అందుకే అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారు. రాముడు లాంటి ధర్మ స్వరూపుడైన పాలకుడు ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా ఆదరింపబడతాడు. అందుకు కారణం వాల్మీకి చెప్పినట్లు రాముడు బుద్ధిమంతుడు, మృదుభాషి, పూర్వభాషి, మితభాషి, స్మితభాషి, ప్రసన్నవదనుడు, ప్రియంవదుడు, పరాక్రమశాలి, నిరహంకారి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి లక్షణాలున్న పాలకుడు లభిస్తే ప్రజలు ఎంత అదృష్టవంతులో కదా!


అలాగే పాలకుడు అవసరమని భావించినప్పుడు ప్రజాప్రయోజనాల దృష్ట్యా కఠినుడుగా వ్యవహరించాలి. కవి చౌడప్ప తన నీతి శతకంలో "అధికారము మెత్తనైనా, అధికారి మెత్తనైనా ప్రజలు అసహ్యించుకుంటారు" అని చెబుతాడు. అలాగే పాలకుడు, చట్టాలు కఠినంగా వ్యవహరించకపోతే పాలన కట్టు తప్పి దేశంలో అరాచకం తాండవిస్తుందని హెచ్చరిస్తాడు చాణక్యుడు. కాబట్టి మంచి వ్యవస్థలో పాలకుడు ప్రధాన పాత్రధారి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం భగవంతుడే పాలకుడి రూపంలో ఉంటాడు. ఇది ముమ్మాటికీ నిజం.

తల్లి, తండ్రి, గురువుల శిక్షణతో చిన్నతనం నుంచే మంచి ఆలోచన విధానంతో ఎదిగిన మనిషి సమాజంలో ఒక భాగంగా మారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సమాజానికి అతీతంగా మనిషి బతకలేడు. సమాజంలో తానూ ఒక భాగస్వామి కాబట్టి ఎదుటివారి మనోభావాలను గౌరవిస్తూ ప్రాధాన్యతలను గుర్తించి ప్రేమ, శాంతి, కరుణ లాంటి సద్భావాలతో కూడిన ఒక హృదయంతో మనిషిని మనిషిగా గుర్తించాలి. కుల, మత, ప్రాంతాలకతీతంగా ఆప్యాయతానురాగాలను అందిస్తూ.. అందుకుంటూ సహజీవనం చేసిననాడు అంతకంటే సంతోషం, సౌఖ్యం మనిషికి మరొకటి ఉండదు. సంకుచిత భావాలతో ధిక్కార ధోరణి నవలంబించి సామాజిక స్థాయికి ఆర్థిక అసమానతలు, కుల, మత ప్రాంతాలను కొలమానంగా పరిగణించిన నాడు ఆత్మాభిమానం దెబ్బతిని ఎదుటి వర్గం ప్రజలు తిరుగుబాటు చేస్తారు. ప్రజలలో పరస్పర ప్రేమానురాగాలు, విశాల దృక్పథంతో పరిఢవిల్లిన నాడు శాంతి సామరస్యాలు సమాజంలో బలంగా నెలకొని కట్టు తప్పకుండా ఉంటాయి. విశేషమేమంటే సృష్టిలో ఏ జంతువూ కేవలం వినోదం కోసం సాటి జంతువును హింసించదు. ఆకలితో మాత్రమే ఆ పని చేస్తుంది. కడుపు నిండి కూడా మనిషి మాత్రమే ఎదుటి మనిషిని మానసికంగా, శారీరకంగా రకరకాల ఆలోచనలతో, అసమానతలతో హింసించి వినోదిస్తుంటాడు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ ఆధునిక సమాజంలో కూడా కొందరు పాశవిక ప్రవృత్తి కలిగి, ఆటవిక న్యాయాన్ని అవలంబించి సమాజంలో అశాంతికి, అల్లర్లకు కారణమవుతున్నారు. సమాజం పట్ల సరైన అవగాహన కలిగి మానవత్వంతో ఎదుటి మనిషిని గౌరవించిన నాడు ఏ సమస్యా ఉత్పన్నం కాదు.

ప్రజాస్వామ్యరథం గాడి తప్పుతున్న వేళ తిరిగి దాన్ని సరైన బాటలో నడిపించేలా ప్రజల్ని, ప్రభుత్వాధినేతల్ని, కార్యనిర్వాహక సంస్థల్ని జాగృతం చేసి, కార్యోన్ముఖుల్ని చేయడంలో ప్రసార సాధనాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పార్టీలకతీతంగా, నిష్పాక్షికంగా అక్షరాలు పత్రికల్లో కీలకపాత్ర వహించేలా పత్రికాధిపతులు, సంపాదకులు వ్యవహరించాలి. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు, పాలకులకు కనువిప్పు కలిగేలా ఉండాలి తప్ప, తాత్కాలిక స్వప్రయోజనాల కోసం శాశ్వత విలువలకు తిలోదకాలు ఇచ్చి, సంకుచిత ధోరణితో రాజకీయ పార్టీల మైకంలో పడి ఉన్నట్లయితే, వాటి విశ్వసనీయత కోల్పోవడమే కాక ప్రజాస్వామ్యం కూడా ప్రమాదంలో చిక్కుకుంటుంది. చివరికి పాలనావ్యవస్థలో దేశంలో అరాచకశక్తులు పెరిగి సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడి అందరికీ అనర్థకారకమవుతుంది. అన్ని రంగాల్లో విలువలు అన్న పదానికే తావు లేకుండా పోతుంది. కనుక దేశం, ప్రజల శ్రేయస్సు దృష్ట్యా విలువలతో కూడిన సమాజాన్ని చూడాలనుకునే పత్రికలు లేదా ప్రసార సాధనాలు నిజాయితీతో, నిబద్ధతతో వ్యవహరించి తమ బాధ్యతను గుర్తించి ప్రజాస్వామ్యాన్ని పది కాలాలపాటు కాపాడటానికి ప్రయత్నించాలి. ఇలాంటి శుభపరిణామం దేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో రావడానికి ఎంతో దూరంలో లేదని ఆశిద్దాం.

● డాక్టర్ తాళ్లూరి ఆంజనేయులు
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
శుక్రవారం 27 సెప్టెంబరు 2024





ఇంకా నీటిలోనే పడవ



నేలకొరిగిన భారీ వృక్షం

వరద వ్యర్థాలతో మూసుకుపోయిన దారి

దీవిలోకి వెళ్లే దారిలో మేటలు వేసిన ఇసుక

దారుణంగా ద్వీపం

అందవిహీనంగా పర్యాటక ప్రాంతం

కృష్ణానది వరద తాకిడికి భవానీ ద్వీపం దారుణంగా దెబ్బతింది. నదికి వరద తగ్గుముఖం పట్టడంతో ఇప్పటికి బయటపడిన ఈ ద్వీపంలోని పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. ఇసుక మేటలు వేసింది. ఆటపరికరాలు నాశనం కాగా, పచ్చదనమంతా పోయింది. ఇక భారీ వృక్షాలు నెలకొరగడంతో భవానీద్వీపం ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే సూచనలు కనిపించట్లేదు.



జనసేనానితో సామినేని ఉదయభాను

జనసేనలో చేరిన సామినేని

మంగళగిరికి భారీగా తరలిన కార్యకర్తలు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 26 : మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం జనసేనలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయభానుకు జనసేనాని పవన్ కల్యాణ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కాగా, జగ్గయ్యపేట నుంచి భారీగా కార్లలో కార్యకర్తలు మంగళగిరి తరలివెళ్లారు. వందకు పైగా కార్లు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. తొలుత అద్దాలబజార్‌లో ఆయన నివాసం నుంచి తన ఆఫీసుకు వచ్చిన ఉదయ భానుకు భారీగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు, పార్టీ నేతలు ఉన్నారు.

మరో రెండేళ్లు అవకాశమివ్వండి

- కాదంటే చంద్రబాబు నిర్ణయం ఫైనల్
- విజయ డెయిరీ చైర్మన్, డైరెక్టర్ల మాట
- ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేల భేటీ

'విజయ డెయిరీ చైర్మన్‌గా చలసాని అంజనే యులుకు రెండేళ్ల సమయముంది. ఇప్పుడు అర్థంతరంగా ఆయన్ను రాజీనామా చేయమ నడం సమంజసం కాదు. ఆయన గడువు పూర్తయ్యే వరకు అవకాశం ఇవ్వండి. ఆ తర్వాత పార్టీ నిర్ణయించిన వ్యక్తికే మేము మద్దతు తెలిపి చైర్మన్‌గా ఎన్నుకుంటాం. అలా కాదంటారా చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాం.' అని వి జయ డెయిరీ డైరెక్టర్లు స్పష్టం చేశారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీ చైర్మన్‌ను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ అధిష్ఠానం ఆదేశించిందని ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ.. చైర్మన్, డైరెక్టర్లకు తెలియజేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల టీడీపీ నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి కొల్లు రవీంద్ర, రెండు జిల్లాలకు చెందిన టీడీపీ

మిగతా 6వ పేజీలో...

వంగవీటి రాధాకు అస్వస్థత

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ గురువారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు గుండెలో స్టంట్ వేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

వరంలా.. వరద సాయం



- సత్వర సాయంపై హర్షాతిరేకాలు
- జిల్లావ్యాప్తంగా బాధితుల ఖాతాల్లో నగదు జమ
- రూ.200 కోట్ల మేర విడుదల చేసిన ప్రభుత్వం
- గ్రౌండ్‌ఫ్లోర్ నష్టానికి రూ.25 వేలు
- ఆపైన అయితే రూ.10 వేలు జమ
- వాహనాలు, ఇతర నష్టాలకు కూడా..
- పెండింగ్‌లో ఉన్న కేసులకు 30లోగా పరిష్కారం
- వరద బాధితులకు ప్రభుత్వం వరుస సహకారం



ముంపులో పాతరాజరాజేశ్వరిపేట, సీఎం నుంచి సాయం అందుకుంటున్న ఓ రైతు (ఫైల్)

వరద వచ్చి వెళ్లి 15 రోజులు దాటుతున్నా.. ఆ ఆనవాళ్లు, అది చెరిపేసిన గుర్తులను తలచుకుంటూ ఇంకా కన్నీటి వరదలోనే మునిగి ఉన్న బాధితులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. నిండా మునిగిపోయిన వారికి మేమున్నామంటూ ఆర్థిక తోడ్పాటు కల్పించింది. నగరవ్యాప్తంగా బుధ, గురువారాల్లో పరిహారపు సొమ్ము జమ కావడంతో కష్టాల కల్లోలంలో కొట్టుమిట్టాడుతున్న వరద బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఆపత్కాలంలో, తక్కువ సమయంలో తమకు ఆర్థికంగా భరోసా ఇవ్వడంపై చెమర్చిన కళ్లతోనే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద సాయం జమతో బాధితుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. భారీ వర్షాలు, భయానక వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నేనున్నానంటూ ఆపన్నహస్తం అందించడంతో ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వరదలు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక రూపంలో వరద బాధితులకు ప్రభుత్వం సహకరిస్తూనే ఉంది. నిత్యావసరాలు, ఆరోగ్య, పారిశుధ్య సేవలు, వాహనాల రిపేర్లు, బీమా క్లెయింల పరిష్కారానికి చొరవ తీసుకుంటూనే ఉంది. ఫలితంగా బాధితులు ఏదో ఒక రూపంలో ప్రయోజనాలు పొందుతూనే ఉన్నారు. వరదల సమయంలో స్వచ్ఛంద సంస్థల సాయం కూడా బాధితులకు ఊరట కలిగించింది. ఎవరికి వారు వరద బాధితులకు తాము చేయగలిగినంత సాయం చేస్తూనే ఉన్నారు. నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, పండ్లు, బియ్యం.. ఏదో ఒక రూపంలో సాయం అందుతూనే ఉంది. ఈ నేపథ్యంలో గ్రౌండ్‌ఫ్లోర్ మునిగిన వారికి రూ.25 వేలు, పైన ఎన్ని అంతస్తులున్నా రూ.10 వేల చొప్పున వరద సాయం ప్రకటించడంతో పాటు ఖాతాల్లో జమచేయడంపై వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాయం ఇలా

బుడమేరు, కృష్ణా వరదల కారణంగా నగరంలో 78,558 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. పూర్తిగా మునిగిన గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు 64,799 ఉండగా, వీరికి రూ.25 వేల పరిహారం ఖాతాల్లో జమైంది. ఇందుకోసం రూ.161.99 కోట్లు వెచ్చించారు. ఒకటి, ఆపైన అంతస్తులు కలిగిన ఇళ్లు 13,759 ఉండగా, రూ.10 వేల చొప్పున మొత్తం రూ.13.76 కోట్లు ఇచ్చారు. వరదల కారణంగా దెబ్బతిన్న 40 వేలకు పైగా ద్విచక్రవాహనాలకు రూ.3 వేల చొప్పున రూ.13.32 కోట్ల సాయాన్ని అందజేశారు. 4,348 ఆటోలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4.34 కోట్లను ప్రభుత్వం అందించింది. 1,243 తోపుడు బండ్లకు రూ.20 వేల చొప్పున రూ.2.48 కోట్లు అందజేశారు. కిరాణా షాపులు, హోటళ్ల వంటి వాటికి కూడా ప్రభుత్వం సాయమందించింది. ఇలాంటి వాటికి కూడా రూ.25 వేల పరిహారం అందింది. 5,181 కిరాణా షాపులు, హోటళ్లు, వ్యాపార యూనిట్లకు రూ.12.97 కోట్లను సాయంగా ఇచ్చారు. దెబ్బతిన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు కూడా రూ.50 వేల చొప్పున రూ.12.50 కోట్లు సాయం చేశారు. దెబ్బతిన్న పరిశ్రమలకు రూ.లక్షన్నర చొప్పున.. 197 పరిశ్రమలకు రూ.2.95 కోట్లు అందించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, పశు సంపద నష్టానికి కూడా ప్రభుత్వం సాయం చేసింది. వరద వచ్చి వెళ్లిన 15 రోజుల్లోనే ప్రభుత్వం వేగంగా సాయం అందించటంపై బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరో 10,500 కుటుంబాలకు అర్హత

పెండింగ్‌లో ఉన్న 13,800 అర్జీలకు క్షేత్రస్థాయిలో అర్హత పూర్తయిందని, ఇందులో 10,500 కుటుంబాలు ఆర్థిక సహకారానికి అర్హత పొందారని కలెక్టర్ సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచనతో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కొలికపూడిపై అధిష్ఠానం ఆరా

తిరువూరులోని టీడీపీ నాయకులకు ఐవీఆర్ఎస్ కాల్స్

తిరువూరు/ఎ.కొండూరు, సెప్టెంబరు 26 : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనితీరుపై టీడీపీ అధిష్ఠానం ఆరా తీస్తోంది. గురువారం స్థానిక నాయకులకు టీడీపీ కాల్ సెంటర్ నుంచి ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్ వచ్చాయి. 'మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. అందరినీ కలుపుకొని పోతున్నారా.. చిట్యాల సర్పంచ్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా లేదా' వంటి ప్రశ్నలు అడిగారు.

ఆది నుంచి విమర్శలే..

కొద్దిరోజులుగా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపై దురుసుగా వ్యవహరిస్తుండటం, సామాజిక మాధ్యమాల్లో పత్రికలపై విమర్శలు చేయడం వంటి అంశాల నేపథ్యంలో అధిష్ఠానం గురువారం ఫోన్‌కాల్స్ ద్వారా స్థానిక నాయకుల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాలకు చెందిన ముఖ్య నాయకులకు ఈ ఫోన్లు వచ్చాయి. నాయకులను నాలుగు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పనితీరు, ఆయన వ్యవహారశైలి, చిట్యాల సర్పంచ్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యల్ని సమర్థిస్తారా, ఖండిస్తారా, ఇసుక, మట్టి తోలకాల విషయంలో ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై నాయకుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. కాగా, ఎమ్మెల్యే పనితీరు, వ్యవహారశైలి కారణంగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని మనస్తాపం చెందుతున్న కొందరు నాయకులు ఇక్కడ జరిగే వి షయాలను అధిష్ఠానానికి తీసుకెళ్లాలన్న ఆలోచనలో ఉన్నారు. స్థానికంగా జరుగుతున్న అంశాలను టీడీపీ కాల్ సెంటర్‌తో పంచుకున్నారు.

కొండంత జెండా..



స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా వన్‌టౌన్‌లోని గాంధీహిల్‌పై గురువారం 300 అడుగుల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం గాంధీకొండపై శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎందుకిట్లు?

కొత్తూరు తాడేపల్లి చెరువు కట్టపై నిత్యావసర కిట్లు



కె.తాడేపల్లి చెరువు కట్ట వద్ద పడేసిన నిత్యావసరాల కిట్లు

- వరద బాధితుల కిట్లు అస్తవ్యస్తంగా..
- ఉపయోగపడే వస్తువులను సైతం పడేశారు
- పాలప్యాకెట్లను తగలబెట్టారు
- సివిల్ సప్లయిస్‌కు స్థానికుల సమాచారం
- విచారణ చేపట్టిన అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు అందాల్సిన నిత్యావసరాల కిట్లు విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి చెరువు వద్ద కనిపించి కలకలం సృష్టించాయి. కొన్ని కిట్లు రోడ్డుపై పడేయడం, కొన్నింటిని కాల్చేయడాన్ని స్థానికులు సివిల్ సప్లయిస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో గురువారం అధికారులు వి చారణకు ఆదేశించారు. ఘటనాస్థలిని పరిశీలించి రావాలని పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లయిస్ అధికారుల నేతృత్వంలో జిల్లాలో నిత్యావసర కిట్లను నూరుశాతం పంపిణీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే ప్రతి ఇంటికీ అందజేశారు. వరద బాధితులకు ఉపయోగపడే ఈ కిట్లను ఇలా కొత్తూరు తాడేపల్లి చెరువు కట్టపై ఎందుకు పడేశారో అర్థంకాని ప్రశ్నగా మారింది. నిత్యావసరాల కిట్ల పంపిణీ సివిల్ సప్లయిస్ సిబ్బంది, వీఆర్వోల పర్యవేక్షణలో జరగాలి. అధికారులు కాకుండా ప్రైవేటుగా కిట్లను ఎవరైనా తీసుకుని, పంచకుండా ఉద్దేశపూర్వకంగా దాచి ఉంచారా, చివరికి పాడైపోవడంతో ఆలా పడేశారా అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇక్కడ పడేసిన వాటిలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పంచదార, కందిపప్పు, పాల ప్యాకెట్లు కూడా ఉన్నాయి. కొన్ని ప్యాకెట్లను తగలబెట్టారు. బంగాళదుంపలు, ఉల్లిపాయలు పాడైపోతాయి కాబట్టి పడేసినా, టెట్రా ప్యాక్ మిల్క్, పంచదార, కందిపప్పు వంటివి పారేయాల్సిన అవసరం లేదు. ఇవి కొంతకాలం నిల్వ ఉంటాయి. ఉపయోగపడే టెట్రా పాలప్యాకెట్లను కూడా తగలబెట్టడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరో ఉద్దేశపూర్వకంగానే చేసి ఉంటారని తెలుస్తోంది. ఈ ఘటనపై సివిల్ సప్లయిస్ అధికారులు రంగంలోకి దిగి, విచారణ ప్రారంభించారు.

ఉసురు తీసిన నిద్రమత్తు

» గన్నవరంలో రోడ్డు ప్రమాదం » ఇద్దరు బాపట్లజిల్లావాసులు మృతి

కొండ పటిష్టతకు చర్యలు

» ఘాట్‌రోడ్డులో పనులు పరిశీలించిన నిపుణుల బృందం

6లో



కొండ పటిష్టత పనులను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

కొండ పటిష్టతకు చర్యలు

» ఘాట్‌రోడ్డులో పనులను పరిశీలించిన నిపుణుల బృందం

వన్‌టౌన్, సెప్టెంబరు 26 : దుర్గగుడి ఘాట్ రోడ్డు కొండ, దిగువన దుర్గాఘాట్ ఎదురుగా గల కొండ పటిష్టత పనులను గురువారం రాక్ మిటిగేషన్ నిపుణుడు కొండలరావు ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సాంకేతికపరమైన అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సంప్రదించారు. భవిష్యత్తులో రాళ్లు విరిగిపడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక ఉండాలని ఆయన పేర్కొన్నారు. పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదికపై కూచిపూడి నృత్యం

దుర్గగుడి కళావేదికపై గురువారం విజయవాడకు చెందిన కావ్యకౌస్తుభ కూచిపూడి నృత్యాలయం కోట సరిత ఆధ్వర్యంలో బృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ఆహూతులను అలరించారు.



కాణిపాకం వినాయకస్వామికి దుర్గగుడి నుంచి పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాక వినాయకుడికి పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్ : కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. వినాయక చవితి నుంచి 21రోజుల పాటు కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దుర్గగుడి ఏఈవో బి.వెంకటరెడ్డి, వైదిక కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, యజ్ఞనారాయణ, తదితరులు కాణిపాకం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్ తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఆలయాలలో సర్వదోష నివారణ శాంతి హోమాలు నిర్వహించారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈవో కేఎస్ రామారావు దంపతులు అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కొమ్మినేని నరసయ్య విగ్రహావిష్కరణలో సౌమ్య, రఘురామ్

జనం మెచ్చిన నేత నరసయ్య

» కొమ్మినేని విగ్రహావిష్కరణలో నెట్టెం రఘురాం

కంచికచర్ల, సెప్టెంబరు 26 : నిత్యం అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరించే నాయకులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ కొమ్మినేని నరసయ్య కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నరసయ్య లేకపోవటం టీడీపీకి తీరని లోటని ఘనంగా నివాళులర్పించారు. సేవా కార్యక్రమాల్లో ముందుండే నరసయ్య జనబలం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. పలు పోరాటాలు చేసిన ఆయన పార్టీకి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. కుటుంబసభ్యులతో పాటుగా మండల టీడీపీ అధ్యక్షుడు కోగంటి బాబు, సర్పంచ్ షేక్ ఇబ్రహీం, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు మూరకొండ ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాల వెంకటేశ్వరరావు, పొన్నం రవి, ఆంజనేయులు, కోగంటి విష్ణు, గోగినేని అమర్‌నాథ్, తేళ్ల కోటేశ్వరరావు, మందా స్వామి, గంధం రామ్మూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆత్కూరు నరసయ్యగా ప్రసిద్ధి : దేవినేని ఉమా

ఇంటి పేరు కొమ్మినేని కంటే ఊరు పేరు ఆత్కూరు నరసయ్యగా పేరొందారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మినేనికి ఘనంగా నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా, లేకపోయినా అందరినీ కలుపుకుని ఏకతాటిపై నడిపించిన వ్యక్తి నరసయ్య అన్నారు. గ్రామాన్ని టీడీపీకి కంచుకోట చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

మానవ అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక ప్రణాళిక : హోంమంత్రి అనిత



విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మానవ అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. మానవ రవాణాతో జీవితాలు, సమాజం నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన నేషనల్ కన్సల్టేషన్ ఆన్ కౌంటరింగ్ సైబర్ ఎనాబుల్డ్ ట్రాఫికింగ్‌పై గురువారం సదస్సులో ఆమె మాట్లాడారు. సైబర్ హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టడానికి ఎన్జీవోలు, సామాజిక సంస్థలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాలోను సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ట్రాఫికర్లు ఉపయోగించే పద్ధతులు అంతుచిక్కడం లేదన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ సైబర్ స్పేస్‌కు భౌగోళిక పరిధులు లేవన్నారు. సైబర్ నేరాలను నియంత్రించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు జాతీయ స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ అక్రమ రవాణా అనేక రూపాల్లో జరుగుతోందన్నారు. అనంతరం ప్రజ్వల సంస్థ రూపొందించిన నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రజ్వల హోం వ్యవస్థాపకురాలు సునీతకృష్ణన్, యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, ఐటీ కార్యదర్శి సౌరవ్‌గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా ఇసుక రవాణా

» సరఫరా ఏర్పాట్లపై అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సమీక్ష.

కృష్ణలంక, సెప్టెంబరు 26 : ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బుకింగ్ చేసిన వెంటనే ఇసుక సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనదారులతో సమన్వయంతో వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉచిత ఇసుక విధానం అమలుపై గురువారం సృజన, జేసీ నిధి మీనాతో కలిసి గనులు, భూగర్భ, రవాణా, ఇసుక లారీల యజమానుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన రవాణా జరిగేలా వాహనదారులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు.

రీచ్ నుంచి వినియోగదారుల ఇంటి వద్దకే ఇసుకను రవాణా చేసిన వాహనాలకు జాప్యం లేకుండా సంబంధిత రుసుమును నేరుగా ఖాతాలో జమచేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇసుక రవాణాకు ఆసక్తి కలిగిన వాహనాలను ఏపీ శాండ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వాహనాల రిజిస్టర్‌కు ఎటువంటి పరిమితి లేదన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని రాత్రి సమయంలో ఇసుక రవాణా జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇసుక రవాణాలో ఇటీవల తీసుకొన్న నిర్ణయాలు, బుకింగ్ అనంతరం ఇంకనూ సరఫరా చేయాల్సిన ఇసుక రవాణా, ఫెసిలిటేషన్ కేంద్రాలలో గుర్తించిన సమస్యలు, ఐవీఆర్ఎస్ రిపోర్టు స్టేటస్, జీఎస్టీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు వీరాస్వామి, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్న కుమార్, మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్లు కె.వెంకటేశ్వరరావు, పీవీ రమణారావు, శాండ్‌లారీఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉచిత ఇసుక విధానంపై మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, పాల్గొన్న అధికారులు, లారీల యజమానుల సంఘాలు

స్వర్ణాంధ్ర-2047లో భాగస్వాములు కావాలి

వన్‌టౌన్ : స్వర్ణాంధ్ర-2047 దార్శనికత పత్ర రూపకల్పనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీవో వై.శ్రీలత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.సృజన వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టిసారిస్తూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాల దేశంలోనే ఓ కీలక వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దార్శనికత పత్రం రూపొందుతోందన్నారు. ఈ ప్రతిష్టాత్మక విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అక్టోబరు 5 వరకు సంబంధిత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లింకు ద్వారా సూచనలు, అభిప్రాయాలు తెలుపవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్యసంపద, రైతుల క్షేమం, సంక్షేమం కోసం అమలవుతున్న కీలక కార్యక్రమాలు, చట్టాలు, తదితరాలపై సదస్సులో చర్చించారు. రైతు ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.నాగమణమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు



గురునానక్ కాలనీలోని నివాసంలో పంచాయతీ ట్రాక్టర్, తోట పనిచేస్తున్న సిబ్బంది

ఈ సారు.. రూటే వేరు!

» పంచాయతీ సిబ్బందితో ఇంట్లో వెట్టి చాకిరీ

» రెండేళ్లుగా సూరంపల్లి కార్యదర్శి తంతు

» నెట్టింట్లో వీడియోలతో గుట్టు రట్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామంలో పనిచేయాల్సిన పంచాయతీ సిబ్బందితో తన స్వంత పనిచేయించుకుంటున్నాడో గ్రామ కార్యదర్శి. బదిలీ అయినా తీరుమారని ఈ అధికారి గురువారం సిబ్బందిని తన ఇంటికి రప్పించుకుని వారి చేత గార్డెనింగ్ పనులు చేయించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కృష్ణా జిల్లా సూరంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేశ్ బాబు చాలాకాలంగా విజయవాడ గురునానక్ కాలనీలోని తన నివాసంలో పంచాయతీ సిబ్బంది చేత తరచూ పనిచేయించుకుంటున్నాడన్న విమర్శలు ఉన్నాయి. గ్రామంలో పనిచేయించాల్సిన వర్కర్లను ఈ అధికారి తన సొంత పనులు చేయించుకోవటం పట్ల కార్మికుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమౌతోంది. ఇటీవల సురేశ్ కృష్ణాజిల్లాలోనే ఉయ్యూరు వద్ద ఆకునూరు గ్రామానికి బదిలీ అయ్యారు. అయినా ఆయన పద్ధతి మారలేదు. సూరంపల్లి పంచాయతీ సిబ్బందిని పెద్ద సంఖ్యలో తెప్పించి తన ఇంటి వద్ద గార్డెనింగ్ పనులు చేయించారు. పంచాయతీ ట్రాక్టర్‌ను కూడా తెప్పించారు. దీనిని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో ఆయనగారి వ్యవహారం బహిర్గతమైంది.

మాకు సాయం చేయరా

» కంచికచర్లలో ముంపునకు గురైన అనేక గ్రామాలు

» దెబ్బతిన్న వస్తువులు, వాహనాలు

» తడిచి పనికిరాకుండా పోయిన ధాన్యం

» నాడు పడవల్లో వచ్చి సాయం..



ఎన్యూమరేషన్‌లో వైఫల్యం.. అధికారుల తీరుపై ఆగ్రహావేశాలు



కంచికచర్ల : మండలంలో వరద ముంపునకు గురైన ఇళ్లకు ప్రభుత్వ సాయం అందకపోవటంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తీర గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైనప్పటికీ అధికారులు ఎన్యూమరేషన్ చేయకపోవటం వల్లనే సాయం అందలేదని బాధితులు వాపోతున్నారు. ఒక వైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద వల్ల మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు గ్రామాలను వరద ముంచెత్తిన సంగతి విదితమే. వందల సంఖ్యలో ఇళ్లు వరద తాకిడికి గురయ్యాయి. విలువైన ఫ్రిజ్‌లు, టీవీలు, ఇతర సామగ్రి దెబ్బతిన్నాయి. మోటారు సైకిళ్లు మరమ్మతులకు గురయ్యాయి. ధాన్యం మొత్తం పనికిరాకుండ పోయింది. మొలకలు రావటంతో తడిసిన ధాన్యాన్ని పారబోశారు. గనిఆత్కూరు గ్రామంలోనే దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం నదిలో పారబోశారు. ఈ విషయాన్ని అప్పట్లోనే పలువురు గ్రామస్థులు నందిగామ ఆర్డీవో రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. కొత్తపేట ముంపు బాధితులను కంచికచర్లలోని ఓసీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో ఐదు రోజులు పునరావాస శిబిరం నడిచింది. గనిఆత్కూరు బాధితులకు మూడు అంతస్తులున్న గ్రామ సచివాలయానికి తరలించి ఆహారం అందించారు. కునికినపాడు ఎస్టీ కాలనీ పూర్తిగా మునిగిపోయింది. వారిని కోళ్లఫారం షెడ్డుకు తరలించి పునరావాసం కల్పించారు. ప్రతి గ్రామంలో ఎక్కడికక్కడ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండ స్థానికులు ముందుకువచ్చి సాయపడ్డారు. ఆస్తి నష్టం భారీగా జరిగినా ప్రాణ నష్టం నుంచి కాపాడారు. గ్రామాలకు రోడ్డు మార్గాలు మూసుకుపోయాయి. ఏసీపీ రవికిరణ్‌తో పాటు పలువురు అధికారులు పడవల ద్వారా ముంపు గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. తీర గ్రామాల ఇళ్లకు ఒక్కరికి కూడా ప్రభుత్వ సాయం అందలేదు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సాయమందలేదని టీడీపీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట బాధితులు బుధవారం విజయవాడ వెళ్లి ఎంపీ కేశినేని చిన్నిని కలిసి సాయం అందలేదని వివరించారు. గురువారం గనిఆత్కూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుల దృష్టికి పలువురు బాధితులు తీసుకువెళ్లారు. పక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం మండలం దాములూరు, చిలుకూరు బాధితులకు ప్రభుత్వ సాయం అందిందని, తమకేందుకు రాలేదంటూ బాధితులు నిలదీస్తున్నారు. తమకు కూడా సాయమందించి ఆదుకోవాల్సిందిగా వేడుకుంటున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించగా మాట్లాడేందుకు నిరాకరించారు.

ఆరుగురు ఆర్డీవోల బదిలీ

మచిలీపట్నం, విజయవాడ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు రెవెన్యూ డివిజన్ అధికారులను(ఆర్డీవో) బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఉయ్యూరు ఆర్డీవోగా బోడా సంపత్ హేలాషారోన్‌ను నియమించారు. ప్రస్తుతం ఉయ్యూరు ఆర్డీవోగా పనిచేస్తున్న డి రాజును నరసాపురం ఆర్డీవోగా బదిలీచేశారు. మచిలీపట్నం ఆర్డీవోగా కే స్వాతిని నియమించారు. ప్రస్తుతం మచిలీపట్న ఆర్డీవోగా పనిచేస్తున్న ఎం వాణిని నూజివీడు ఆర్డీవోగా బదిలీచేశారు. గుడివాడ మునిసిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్న జి బాలసుబ్రహ్మణ్యంను గుడివాడ ఆర్డీవోగా నియమించారు. ప్రస్తుతం గుడివాడ ఆర్డీవోగా పనిచేస్తున్న పి పద్మావతిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌ల అధికారులను కూటమి ప్రభుత్వం మార్చివేసింది. అలాగే ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ ఆర్డీవోగా భవానీశంకర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కావూరి చైతన్యను ఆర్డీవోగా నియమించారు. తిరువూరు ఆర్డీవోగా కడాల మాధురిని ఆర్డీవోగా నియమించారు. నందిగామ ఆర్డీవోగా కె. బాలకృష్ణను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రరావును ప్రభుత్వం బదిలీ చేసింది.

దుర్గగుడి ఏసీగా సాంబశివరావు

వన్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖలో చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలువురు ఈవోలు బదిలీలయ్యారు. వారి స్థానంలో పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఈవోలు జిల్లాలోని ఆలయాలకు బదిలీలయ్యారు. నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న నూతక్కి సాంబశివరావు దుర్గగుడి సహాయ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వన్‌టౌన్‌లోని పాతశివాలయం ఈవోగా పనిచేస్తున్న కె.సురేష్ వేదాద్రి దేవస్థానానికి బదిలీ అయ్యారు. అక్కడ ఈవోగా పనిచేస్తున్న ఎస్.హేమలతాదేవి నున్న గ్రూప్ టెంపుల్‌కు బదిలీ అయ్యారు. వన్‌టౌన్ బ్రహ్మచారి బావాజీ మఠం ఫిట్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు జి.కొండూరు గ్రూపు టెంపుల్‌కు, మాచవరం దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న భవానీ యనమలకుదురులోని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న గంగాధర్ నందిగామ గ్రూపు టెంపుల్‌కు బదిలీ అయ్యారు. రామవరప్పాడు అంకమ్మ దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న లోకేశ్వరి మాచవరం ఆంజనేయస్వామి దేవస్థానానికి, అంబారుపేట దేవస్థానంలో పనిచేస్తున్న సీతారామయ్య నూజివీడు దేవస్థానానికి బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా సింగరాయపాలెం దేవస్థానం సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న నేల సంధ్య నెమలి దేవస్థానానికి, జి.కొండూరు గ్రూపు టెంపుల్ ఈవోగా పనిచేస్తున్న మోహనరావు దినవహి వారి సత్రానికి బదిలీ అయ్యారు. అంబారుపేట దేవస్థానానికి బలివాడ దేవాలయం ఈవోగా పనిచేస్తున్న గెల్లి హరి గోపినాథ్ బదిలీ అయ్యారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెస్ట్‌గోదావరిలో పనిచేస్తున్న సన్యాసిరావు, వన్‌టౌన్ పాతశివాలయానికి వెస్ట్ గోదావరిలో పనిచేస్తున్న షణ్ముఖం బదిలీపై వచ్చారు.

గాయపడిన ఉక్కు అధికారి మృతి

» స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా

విశాఖపట్నం, సెప్టెంబరు 26 : ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-1లో మంగళవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీనియర్ మేనేజర్ సీహెచ్.మల్లేశ్వరరావు (53) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి కన్నుమూశారు. విభాగంలో కదులుతున్న స్టీల్ ట్రాన్స్‌ఫర్ కార్ (ఎస్‌టీసీ) నుంచి లిక్విడ్ స్టీల్ ఒలికి మల్లేశ్వరరావుపై పడిన విషయం తెలిసిందే. 90 శాతం మేర కాలిన గాయాలతో ఆయన్ను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందారు. మల్లేశ్వరరావు స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో మరో 14 మంది ఇంజనీర్ల బదిలీ

» ఉత్పత్తిలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై యాక్షన్

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ఉత్పత్తిలో నిర్లక్ష్యం వహించిన ఇంజనీరింగ్ సెక్షన్‌లోని 14 మంది అధికారులపై గురువారం బదిలీ వేటు పడింది. మూడు రోజుల క్రితమే 10 మందిని బదిలీ చేసిన జెన్కో యాజమాన్యం ఇప్పుడు మరో 14 మందిని బదిలీ చేయడం గమనార్హం. ఎన్టీటీపీఎస్ ఏర్పడిన తర్వాత ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న అధికారులు ఇంత మందిని బదిలీ చేసిన దాఖలాలు లేవు. దేశానికే తలమానికంగా నిలిచిన ఎన్టీటీపీఎస్ ప్రతిష్ఠ ఇటీవల మసకబారుతూ వస్తుంది. అందుకు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపించడంతో జెన్కో యాజమాన్యం దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. అందులో భాగంగానే ఈస్థాయిలో బదిలీ పరంపర కొనసాగుతుందనే వాదన వినిపిస్తుంది. నేడో రేపో మరి కొంతమందిపై బదిలీ వేటు పడే అవకాశం ఉందని తెలుస్తుంది.

మరో రెండేళ్లు అవకాశమివ్వండి

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, మచిలీపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు. విజయ డెయిరీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లందరూ సమావేశానికి హాజరయ్యారు. తన రాజీనామా గురించి చైర్మన్ ఆంజనేయులు స్పందిస్తూ.. తన వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. ఇందుకు నాయకులు ససేమిరా అన్నారు. ముందు రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేయడంతో చైర్మన్ మౌనంగా ఉండిపోయారు. డైరెక్టర్లు మాత్రం చైర్మన్ పదవీకాలం మరో రెండేళ్లు ఉందని, ఇప్పుడే రాజీనామా చేయిస్తే అది పార్టీకే చెడ్డపేరు తెస్తుందని, ఎలాంటి ఆరోపణలు లేని చైర్మన్‌ను తొలగించడం సరికాదన్నారు. మిల్క్ యూనియన్ అభివృద్ధిలో ఆంజనేయులు ముద్ర ఉందని, ఒక ఫ్యాక్టరీని రెండు ఫ్యాక్టరీలుగా చేశారని, టర్నోవర్‌ను రూ.800 కోట్ల నుంచి రూ.1,200 కోట్లకు తీసుకొచ్చిన ఘనత ఆయనేదనన్నారు. ప్రస్తుతం వీరవల్లి ఫ్యాక్టరీ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఆ ఆలయం పూర్తయ్యే వరకైనా చైర్మన్‌ను కొనసాగించాలని వారు కోరారు. చైర్మన్, డైరెక్టర్ల అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలియజేస్తామని ఎంపీ, మంత్రి స్పష్టం చేశారు.

న్యూస్ బాక్స్



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న బొండాడ రాఘవేంద్రరావు

వరద బాధితులకు రూ. 25 లక్షల విరాళం

అవనిగడ్డ, సెప్టెంబరు 26 : కృష్ణా నది వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత బొండాడ రాఘవేంద్రరావు రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. నాగాయలంక మండలం పర్రచివర గ్రామానికి చెందిన రాఘవేంద్రరావు దివి ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. రాష్ట్రంలో వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు గురువారం రూ.25 లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు.



అవార్డును అందుకున్న రవీంద్ర భారతి చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి

రవీంద్ర భారతికి డైనమిక్ స్కూల్ అవార్డు

ఆటోనగర్, సెప్టెంబరు 26 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి సంపూర్ణ విద్యను అందించడంలో నిబద్ధతను ప్రదర్శించినందుకు రవీంద్ర భారతి గ్రీన్‌స్కూల్ ప్రతిష్ఠాత్మక డైనమిక్ స్కూల్ అవార్డు కైవసం చేసుకుందని పాఠశాల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ తెలిపారు. ఎడ్యుకేషన్ టుడే సంస్థ నుంచి అవార్డు అందుకున్నట్టు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరంతరం మారుతున్న ప్రపంచంలో డైనమిక్ లెర్నింగ్ వాతావరణాన్ని పెంపొందించే సంస్థల్లో గ్రీన్ స్కూల్ ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుందని ఎడ్యుకేషన్ టుడే కొనియాడిందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శాంతిని అభినందించినట్టు తెలిపారు.

క్రైం కార్నర్



లారీని ఢీ కొని నుజ్జయిన కారు

ఉసురు తీసిన నిద్రమత్తు!

» ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

» ఇద్దరు మృతి.. ముగ్గురికి గాయాలు



మార్క్(ఫైల్)



మేరీ(ఫైల్)

గన్నవరం, సెప్టెంబరు 26 : అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఆ కుటుంబంలో ప్రమాదం మరింత విషాదాన్ని నింపింది. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వారిలో ఒకరికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఐదుగురు కలిసి కారులో ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృత్యువు ఇద్దరిని కబళించింది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కృష్ణా జిల్లా గన్నవరంలో గురువారం తెల్లవారు ఝామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ఆదాం భార్య ప్రేమమ్మ కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విశాఖలోని హోమిబాబా కేన్సర్ హాస్పిటల్‌కు ఈ నెల 24న కారులో దంపతులతో పాటు అల్లుడు మార్క్, చెల్లి మేరీ, సోదరుడు మురారీలతో కలిసి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బుధవారం సాయంత్రం 6గంటలకు బయలుదేరారు. ఆదాం కారు డ్రైవ్ చేస్తుండగా తెల్లవారుఝామున 2.35 గంటలకు గన్నవరం పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి నిద్ర మత్తులో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఘటనలో డ్రైవర్ పక్క సీటులో ఉన్న మార్క్(25), వెనుక సీటులో కూర్చున్న మేరీ అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ ఆదాంకు భుజం దగ్గర, ప్రేమమ్మకు కాలికి మురారీకి చేతికి గాయాలు కావటంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్క్‌కు భార్య ఏడాది కొడుకు ఉన్నారు. మేరీకి భర్త ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మురారీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. గన్నవరం ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుల స్వగ్రామం కోటపాడు నుంచి అధిక సంఖ్యలో బంధువులు వచ్చారు. మృతులను చూసి బోరున విలపించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

నిత్యావసర సరుకుల పంపిణీ



పాయకాపురం, సెప్టెంబరు 26 : వరద బాధిత ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఏపీపీడబ్ల్యూఏ(అజిత్‌సింగ్‌నగర్ ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్) ఆధ్వర్యంలో నున్న పీవీఎస్ ఫిల్మ్‌సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు అగస్త్య రవికుమార్ 130 మంది ఫొటో, వీడియోగ్రాఫర్ల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరం కొటిరెడ్డి, మాదాల రమేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

చక్కటి ప్రణాళికతో చంద్రబాబు పాలన

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేక్ కట్ చేస్తున్న బుద్దా వెంకన్న, పానుగుపాటి చినసుబ్బయ్య

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 26: ముఖ్యమంత్రి చంద్రబాబు చక్కటి ప్రణాళిక ద్వారా ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 16వ డివిజన్ స్క్యూ బ్రిడ్జి కే హోటల్ సమీపంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడిగానే వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రజలు ఓట్లు వేశారని, ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉండాలే కాని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేయాలనే ఆలోచన లో జగన్‌మోహనరెడ్డి ఉన్నాడని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనను చూసి గత 5సంవత్సరాలుగా ఆయన పాలనను ఎందుకు మిస్ చేసుకున్నామా అని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి లడ్డూలో సైతం జంతువుల కొవ్వులను కలిపి లడ్డూను సైతం వైఎస్ జగన్‌మోహనరెడ్డి కల్తీ చేశాడని అన్నారు. ఈ ఘనట దురదృష్టకరమని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాణిగారితోట: వంద రోజుల కూటమి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని 17వ డివిజన్ టీడీపీ నాయకులు అన్నారు. డివిజన్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయి రంగమ్మ, మొకర వెంకటరమణ, ముని పోలిపల్లి, బాలయ్య, అప్పారావు, ఆదిబాబు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో ..

విద్యాధరపురం: భవానీపురం 40వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో గురువారం కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పానుగుపాటి చిన సుబ్బయ్యతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పత్తి నాగేశ్వరరావు, జి. కొండయ్య, ముదిరాజ్ శివాజీ, సురభి బాలు, పితాని పద్మ, మువ్వ విజయశ్రీ, ఈగల సాంబ, జి. వెంకటరెడ్డి, ఎం. నారాయణ, జి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య వేడుకలు

భవానీపురంలోని 40వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ అలుగుండ్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ 100 రోజుల వేడుకలు ఘనంగా జరిగాయి. స్వీట్స్ పంచి, బాణాసంచా పేల్చారు. ఆనందోత్సాహాల మధ్య ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకటేష్, వి.పిచ్చయ్య, ఎం. వెంకట రెడ్డి, బి.శ్రీనివాస్ యాదవ్, ఎం.ఆవులయ్య, బి.కాశి, కమ్మ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి గుడిలో జనసేన ప్రాయశ్చిత్త దీక్ష



పటమట వేంకటేశ్వరస్వామి గుడిలో

పటమట, సెప్టెంబరు 26: జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా గురువారం పటమట నల్లూరివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 14వ డివిజన్ జనసేన అధ్యక్షుడు యడ్లపల్లి శివనాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ జనసేన పార్లమెంట్ సమన్వయ కర్త అమ్మిశెట్టివాసు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు వీర్ల సూరిబాబు, పానెం ప్రసాద్, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి బండ్రెడ్డి రవి, అధికార ప్రతినిధి నజీబ్, రామాయణపు కోటి, పార్థ శ్రీనివాస్, జనసేన రాష్ట్ర కమిటీ సభ్యులు, ముఖ్యనాయకులు,ధార్మికమండలి సభ్యులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వన్‌టౌన్: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా దేవుడా జగన్‌కు బుద్ధినివ్వు అంటూ జనసేన నాయకురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో గురువారం గొల్లపూడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. గొల్లపూడి పప్పులమార్కెట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరచి, మెట్లకు పసుపు, కుంకుమలను అద్దారు. ధ్వజస్తంభం దగ్గర పూజలు చేశారు. అనంతరం తిరుపతి అనూష మాట్లాడుతూ గొడవలు సృష్టించటానికే జగన్ తిరుమల వెళుతున్నాడని విమర్శించారు. జనసేన పార్టీ ప్రచార కమిటీ విజయవాడ ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్, తులసి, మురళి, ముద్రబోయిన దేవకి, ఎస్.రాజేష్, కూరాకుల సురేష్, దాసి రామ్మోహన్, పసుపులేటి నాగకృష్ణ, సాయి, దుర్గ, స్రవంతి, పర్వీన్, ప్రకాష్, అనిల్, భాగ్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.



గొల్లపూడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో

చిట్టినగర్: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి తిరుమల లడ్డూ ప్రసాదానికి జరిగిన అపవిత్రాన్ని ఖండిస్తూ దళిత సేన ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ జంక్షన్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ పలువురు దళిత సేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

● పలుచోట్ల విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులను పంపిణీ చేస్తున్న వల్లూరు మధు

కృష్ణలంక, సెప్టెంబరు 26 : వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ పోరాట స్ఫూర్తి పలువురికి ఆదర్శప్రాయమని రజక అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మధు అన్నారు. కృష్ణలంకలోని హరినాథపురంలో బర్మా సీతా రామయ్య నగర పాలక సంస్థ ఎలిమెంటరీ పాఠశాలలో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రజక అభ్యుదయ సంఘం నాయకులు నీలాపు సురేంద్ర, గణపవరపు వేణు, వి.ఈశ్వరరావు, ఎస్.సాంబయ్య, మల్లేశ్వరరావు, అల్లూరి శేషగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గుణదల, పటమటలంక, మొగల్రాజపురం, గాంధీనగర్, అయోధ్యనగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లో ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముస్లింల పక్షపాతి చంద్రబాబు

● సీఎం చంద్రబాబు, ఫారూక్ చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం చంద్రబాబు, మంత్రి ఫారూక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ముస్లిం నాయకులు

వన్‌టౌన్, సెప్టెంబరు 26: ముస్లింల పక్షపాతి చంద్రబాబు అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ పతావుల్లా అన్నారు. గురువారం గణపతిరావు రోడ్డులోని ఖిద్మత్ ఘర్ కార్యాలయం వద్ద విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు తమీమ్ అన్సర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఫారూక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫతావుల్లా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తున్నారని, హజ్‌హౌస్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తామని ప్రకటించటం రాష్ట్ర ముస్లిం సోదరులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జహెద్ రజావుల్లా, సయ్యద్ కరీముల్లా, తాజుద్దీన్, నహిద్, వాజీద్‌ఖాన్, ప్రభాకర్, మెభీన్, షబ్బీర్, రియాజ్, శంకర్, ఇబ్రహీం, ఫెరోజ్, కరీముల్లాహ్, మల్లేశ్వరి, ముంతాజ్, నసీమా, హసీనా పాల్గొన్నారు.

కంప్యూటర్, మొబైల్ వీక్షణలతో కంటి సమస్యలు

నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ ఇండ్ల స్వప్న



మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల స్వప్న

పటమట, సెప్టెంబరు 26 : ప్రస్తుత కాలంలో ప్రజలు అధిక సమయం కంప్యూటర్, మొబైల్ వీక్షణలతో పొడబారే కళ్ల సమస్యల పెరిగిపోతున్నాయని ప్రముఖనేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల స్వప్న పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన గురువారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె 'పొడబారిన కళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. స్వప్న మాట్లాడుతూ కంప్యూటర్, ల్యాప్‌టాప్ ముందు పనిచేసే వాళ్లు ప్రతి ఇరవై నిమిషాలకు ఒకసారి 20 సెకన్లు పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వాటిపై దృష్టి మళ్లించి చూడాలన్నారు. పొడిబారిన కళ్లు ఉండే వాళ్లు మంచినీళ్లు ఎక్కువగా తాగాలని, పళ్లు, ఇతర శాఖాహారం ఎక్కువ తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి గురించి నిర్లక్ష్యం తగదన్నారు. డాక్టర్ మారు వందన సమర్పణ చేశారు.

కాశీ విశ్వేశ్వర దేవస్థానం దసరా ఉత్సవాల ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, సెప్టెంబరు 26: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు నిర్వహించే దసరా ఉత్సవాల ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఆలయ ఈవో యడ్లవల్లి సీతారామయ్య సమక్షంలో గురువారం సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ ఎస్. బాలస్వామి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు అప్పన సాయిబాబు, ఆలయ అర్చకులు, భక్తులు ఎస్ చంద్రశేఖర్, నాగబాబు పాల్గొన్నారు. అక్టోబరు 3 నుంచి ప్రతి రోజు అమ్మవారికి చండీ హోమం, రుద్రహోమాలు, కుంకుమ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

పాయకాపురం, సెప్టెంబరు 26 : 64వ డివిజన్ కండ్రిక కాలనీలోని బీవీ సుబ్బారెడ్డి నగరపాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ప్రశాంతినగర్‌లోని స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ పాల్గొని రూ. 12 వేలు విలువ గల నోట్‌బుక్స్‌ను వరద బాధిత విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహామూర్తి, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మార్క్‌ఫెడ్ బంగార్రాజుకు సన్మానం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 26: ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా ఏపీ ప్రభుత్వంచే నియమించబడిన కర్రోతి బంగార్రాజును సీతారామపురంకు చెందిన మహంతి అప్పల నర్సయ్య, మహాలక్ష్మీ (ఎంఎఎం) చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. గురువారం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసుదేవరావు (వాసు) నేతృత్వంలో మార్క్‌ఫెడ్ కార్యాలయంలో కర్రోతి బంగార్రాజును కలిసిన ట్రస్ట్ సభ్యులు ఆయన్ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ నందిమింటి రమణ, సభ్యులు గోర్లి కోటేశ్వరరావు, పిన్నంటి శ్రీనివాసరావు, పోతూరు కనకారావు, పిన్నంటి కనకారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహంతి వాసు మాట్లాడుతూ టీడీపీలో ఉన్నత స్థానానికి ఎదిగిన బంగార్రాజు ప్రభుత్వానికి మంచి గుర్తింపు తేవడానికి కృషి చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వరద బాధితుల నమోదులో గందరగోళం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 26 : వరద బాధితులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం అనేక మందికి గందరగోళంగా నెలకొందని సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున బాధితులు అధికారులను నిలదీస్తున్నా వారి వద్ద నుంచి సరైన సమాధానం రావడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లోని వరద బాధితులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వరద బాధితులు అనేక సమస్యలను బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద నగరాన్ని ముంచెత్తి 25 రోజులు అయినా పేర్ల నమోదులో పలు చోట్ల లోపాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. తక్షణమే సర్వేలో లోపాలను సరిదిద్ది, అర్హులైన వారి అందరి పేర్లు నమోదు చేసి ప్రతి వరద బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్, సెప్టెంబరు 26: వన్‌టౌన్‌లోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నివాసానికి గురువారం ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందు సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబులు విచ్చేశారు. మర్యాదపూర్వకంగా వారు వెంకన్నను కలిశారు. వారిద్దరినీ సాదరంగా ఆహ్వానించిన వెంకన్న దుశ్శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు.మల్లా సురేంద్ర, కాండ్రేగుల రవీంద్రలు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

వన్‌టౌన్, సెప్టెంబరు 26: త్రిదండి చినజీయర్ స్వామివారి ఆశీస్సులతో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్తంగా గురువారం వించిపేట దాసాంజనేయ దేవస్థానం పరిసర ప్రాంతాల్లోని 400 మంది వరద బాధితులకు దుప్పట్లు, బియ్యం, వస్త్రాలు అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవనోపాధి నిమిత్తం మహిళకు ఆర్థిక సహాయం

పటమట, సెప్టెంబరు 26 : తూర్పు పరిధి 5వ డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడి గాయపడడంతో పాటు జీవనోపాధి కోల్పోయిన అలజంగి శాంతికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన సొంత నిధుల నుంచి రూ.10వేల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు.ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ క్రీస్తురాజుపురంలోని కొండ చరియలు విరిగిపడిన వెంటనే స్పందించి సహాయక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

ముగిసిన వినాయక చవితి ఉత్సవాలు

రాణిగారితోట, సెప్టెంబరు 26: రాణిగారితోట బాలస్వామి వీధిలో జరిగిన వినాయక చవితి ముగింపు ఉత్సవాల్లో గద్దె క్రాంతి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొప్పన భవకుమార్, కొక్కెర తిరుపతయ్య, గండ్రరాజు, సైదులు, రాజేష్, బాలు పాల్గొన్నారు

వార్డు సమస్యలను పరిష్కరించాలి


చిట్టినగర్, సెప్టెంబరు 26: వివిధ వార్డుల్లో ఉన్న సమస్యలను త్వరితిగతిన పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీలో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో ఉన్న 64 డివిజన్లకు 64 మంది ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని సిబ్బందితో సమీక్షించి అక్కడున్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

హ్యాండ్‌బాల్, చెస్ క్రీడాకారుల ఎంపికలు

వన్‌టౌన్, సెప్టెంబరు 26: కేబీఎన్ కళాశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాల బాలికల హ్యాండ్ బాల్, చెస్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యా సంస్థల పరిపాలనా అధికారి డాక్టర్ వి. నారాయణరావు హాజరయ్యారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కె. నారాయణరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ మాట్లాడారు. చెస్ అంతర్జాతీయ ర్యాంకర్ జ్యోతికిరణ్ ఆర్బిట్రేటర్‌గా వ్యవహరించారు. క్రీడా విభాగాధిపతి హేమచంద్రరావు ఆధ్వర్యంలో సెలక్షన్లు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, కేబీఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. విజయబాబు, ఫైన్ కళాశాల డైరెక్టర్ టి. నరేంద్ర, పీవీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మార్కండేయులు పాల్గొన్నారు.

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో'.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. 'గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా... పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్స్ తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్


మా మనవడినీ ఆదరించండి

\- పరుచూరి బ్రదర్స్



సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు

ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన



అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5
- వెబ్‌సైట్: www.iift.ac.in

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 27 సెప్టెంబరు 2024

రోజుకొక్క తీరున...

- అక్టోబర్ 2: బుధవారం - ఎంగిలి పూల బతుకమ్మ
- అక్టోబర్ 3: గురువారం - అటుకుల బతుకమ్మ
- అక్టోబర్ 4: శుక్రవారం - ముద్దపప్పు బతుకమ్మ
- అక్టోబర్ 5: శనివారం - నానే బియ్యం బతుకమ్మ
- అక్టోబర్ 6: ఆదివారం - అట్ల బతుకమ్మ
- అక్టోబర్ 7: సోమవారం - అలిగిన బతుకమ్మ
- అక్టోబర్ 8: మంగళవారం - వేపకాయల బతుకమ్మ
- అక్టోబర్ 9: బుధవారం - వెన్నముద్దల బతుకమ్మ
- అక్టోబర్ 10: గురువారం - సద్దుల బతుకమ్మ



విశేషం



శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో...

విశ్వం అంతా శక్తిమయం. ప్రకృతే పరాశక్తి. ఆ మాత అనేక రూపాల్లో అభివ్యక్తమవుతుంది. దుర్గగా, గౌరిగా... ఇలా ఎన్నో విధాలుగా పూజలందుకుంటుంది. గౌరిగా ఆరాధించే రూపానికి ప్రతిరూపమే బతుకమ్మ. ఇది తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వేడుక.

ఆశ్వయుజ మాసం శరదృతువులో తొలి మాసం. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దుర్గా నవరాత్రులు ప్రారంభమవుతాయి. అంతకు ఒక రోజు ముందుగానే... అంటే భాద్రపద అమావాస్య నాటి నుంచే బతుకమ్మ సంబరాలు మొదలవుతాయి. ఇది ప్రకృతిని ఆరాధించడానికి అనువైన మాసం. పరిసరాలన్నీ శోభాయమానంగా ఉంటాయి. చంద్రుడు షోడశ కళలతో చల్లని వెన్నెల కురిపిస్తాడు. రంగురంగుల పూలతో చెట్లు కనువిందు చేస్తాయి. వాటి సువాసనలతో గాలి గుబాళిస్తూ ఉంటుంది. అర్చనలో పూలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ పూలనే బతుకమ్మగా ఆరాధించడం విలక్షణమైన సంస్కృతి.



కైలాసంలో మెట్టినింట ఉన్న గౌరిని (పార్వతిని) మహాలయ అమావాస్యకు ముందుగానే పుట్టినింటికి ఆహ్వానిస్తారు. మహాలయ అమావాస్యనాడు గౌరిని యథావిధిగా అలంకరించినా... ఆ రోజు పితృ అమావాస్య కాబట్టి... పితృదేవతలకు నివేదనలు ప్రధానం కనుక ఆ రోజు ప్రత్యేక పూజలు ఉండవు. వరిపిండిలో నువ్వులు, బెల్లం కలిపిన పదార్థాన్ని బతుకమ్మకు నైవేద్యం పెడతారు. ముందురోజు సేకరించిన పువ్వులతో బతుకమ్మను పేరుస్తారు కాబట్టి... తొలి రోజున గౌరీదేవిని 'ఎంగిలి పూల బతుకమ్మ' అని వ్యవహరిస్తారు. బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాల గురించి ఎన్నో కథలు పాటల రూపంలో ఉన్నాయి. పూర్వం ధర్మాంగదుడనే రాజు ఉండేవాడనీ, అతను, అతని భార్య సత్యవతి శివ భక్తులని, ఆ దేవదేవుడి అనుగ్రహంతో జన్మించిన కుమార్తెకు 'బతుకమ్మ' అని పేరు పెట్టుకున్నారనీ ఒక కథ ఉంది.



ఈ సంబరాల్లో ప్రతి రోజూ మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేస్తారు. రోజుకో విధమైన నివేదనలు సమర్పిస్తారు. చెరువులు, కుంటల దగ్గర బతుకమ్మలతో చేరుకుంటారు. వాటిని పేర్చి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. ఆఖరి రోజున బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. బతుకమ్మను పేర్చడానికి పూల సేకరణను తెల్లవారుజామునే ప్రారంభిస్తారు. బంతి, చామంతి, గునుగు, గుమ్మడి, తంగేడు... ఇలా ఎన్ని పూలు ఉన్నా తంగేడుకే ప్రాధాన్యం. ఇది పసుపు వర్ణంలో ఉంటుంది. పసుపు అయిదవతనానికి సంకేతం. అలాగే పసుపును ముద్దగా చేసి, గోపురం రూపంలో నిర్మించి, దాని మధ్యలో నొక్కి రెండు శిఖరాలుగా చేస్తారు. అది అర్ధనారీశ్వరులకు సంకేతం. ఆ గోపురం చుట్టూ పూల దండలను అలంకరిస్తారు. రోజుకో నైవేద్యాన్ని పెడతారు. 'తీరొక్క పువ్వేసి, తీరొక్క కూర్పుగా ఉయ్యాలో' అంటూ బతుకమ్మల కూర్పును, పేర్పును ప్రస్తావిస్తారు. 'చిక్కుడూ ఆకులో ఉయ్యాలో... సద్దులు పెట్టేము ఉయ్యాలో' అంటూ నైవేద్యాల విశేషాలను వివరిస్తారు. వేడుకల్లో చివరి రోజైన ఆశ్వయుజ శుద్ధ అష్టమి నాడు గౌరిని మెట్టినింటికి పంపే సంరంభం వైభవంగా జరుగుతుంది. ఇంటి ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి, చీరసారెలతో మెట్టినింటికి పంపినట్టు... బతుకమ్మను సాగనంపుతారు.

శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో - చిత్రములో తలతుమమ్మ ఉయ్యాలో

మా లక్ష్మి మా గౌరి ఉయ్యాలో - పోయి రావమ్మ ఉయ్యాలో

కైలాసగిరివాని ఉయ్యాలో - శంకరీ పార్వతీ ఉయ్యాలో

... అంటూ బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు చెబుతారు. అష్టమినాటి చంద్రకళలు ప్రసరిస్తూ ఉండగా... బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. అంతటితో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి. ఇది పూల పండుగ. ఆడపిల్లల పండుగ, అక్కచెల్లెళ్ళ పండుగ, అమ్మ అమ్మమ్మల పండుగ. అందరికీ ఆటా పాటా నేర్పే పండుగ. సంగీత, సాహిత్య, నాట్యాల మేళవింపుగా... వర్ణ, వర్గ విచక్షణ లేకుండా సమైక్యతను చాటి చెప్పే పండుగ.

• ఆయపిళ్ళ రాజపాప

(అక్టోబర్ 2 నుంచి బతుకమ్మ పండుగ)

సద్బోధ

సన్యాసి హితవు

ఒక ఊరిలో ఒక వ్యక్తి తన భార్యతో కలిసి చిన్న గుడిసెలో నివసించేవాడు. చిన్న చిన్న పనులు చేసేవాడు. వచ్చిన దానితోనే ఆ భార్యాభర్తలు సంతోషంగా జీవించేవారు. వారికి ప్రాపంచికమైన వేరే ఆశయాలు కానీ, కోరికలు కానీ, ఎవరి మీదా అసూయ కానీ, ద్వేషం కానీ ఉండేవి కావు.

వారికి పొరుగున చాలా ధనవంతుడు ఉండేవాడు. అతను ఎప్పుడూ ఆందోళనతో ఉండేవాడు. తన సంపదను కాపాడుకోవడం మీదే దృష్టి ఉండడంతో... అతనిలో సంతోషం కనిపించేది కాదు.

ఒకసారి ఆ ఊరికి ఒక సన్యాసి వచ్చాడు. గ్రామస్తులందరూ ఆయనను తమ ఇళ్ళకు ఆహ్వానించారు. పేదా, గొప్పా అనే తారతమ్యం లేకుండా అందరి ఇళ్ళనూ ఆయన సందర్శించాడు. అలాగే ఆ ధనవంతుడి భవనానికి కూడా వచ్చాడు. ధనవంతుడు ఆయనను సాదరంగా ఆహ్వానించాడు. మంచి ఆతిథ్యం ఇచ్చాడు. సన్యాసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఆయనను సమీపించి "స్వామీ! నాకు ఎప్పుడూ ఆందోళనగా ఉంటుంది. భయం వేస్తూ ఉంటుంది. మనసులో స్థిమితం ఉండదు. దీన్ని ఎలా తగ్గించుకోవాలి?" అని అడిగాడు.

"నువ్వు నీ ఆధీనంలో లేవు. నీ సంపద ఆధీనంలో ఉన్నావు. నీకు మనశ్శాంతి లేకపోవడానికి కారణం అదే" అన్నాడు సన్యాసి.

"అదేమిటి స్వామీ? సంపదకూ, మనశ్శాంతి లేకపోవడానికి సంబంధం ఏమిటి?" అని ప్రశ్నించాడు ధనికుడు.

అప్పుడు అతని పొరుగున ఉన్న పేదవాణ్ణి ఆ సన్యాసి చూపిస్తూ "అతణ్ణి చూడు. అతనికి ఆస్తిపాస్తులేవీ లేవు. అతని ముఖంలో సంతోషాన్ని గమనించు. అతను ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటాడు. కనుక దృఢంగా ఉన్నాడు. శారీరకంగా కష్టపడతాడు కాబట్టి ఆరోగ్యంగా ఉన్నాడు. ఇంకా ఏదో కావాలని ఆశించడు కాబట్టి మానసిక ప్రశాంతతతో ఉన్నాడు" అన్నాడు.

"అతను ఎప్పుడూ అలాగే ఉన్నాడు. డబ్బు వల్ల మనిషిలో మార్పు వస్తుందంటే నేను నమ్మను. అలాగే డబ్బు కారణంగానే మనశ్శాంతి ఉండదనే మాటలో కూడా నాకు విశ్వాసం లేదు" అన్నాడు ధనవంతుడు.

"సరే! ఆ సంగతి ప్రత్యక్షంగానే తెలుసుకుందాం" అన్నాడు సన్యాసి.

సన్యాసి ఇచ్చిన సలహా ప్రకారం... ఆ రోజు రాత్రి పేదవాడి ఇంట్లో 99 వెండి నాణేలను ధనవంతుడు దొంగతనంగా పడేశాడు.

మర్నాడు తెల్లవారింది. ధనవంతుడు, సన్యాసి ఆ పొరుగింట్లో ఏం జరుగుతోందో గమనిస్తున్నారు. రోజూ ఆ సమయానికి ఆ ఇంటి ఇల్లాలు వంట పనుల్లో నిమగ్నమై ఉండేది. కానీ పగటిపూట అలాంటి ఛాయలేమీ కనిపించలేదు. ఆ పేద వ్యక్తి ఎప్పటిలాగే పనిలోకి వెళ్ళాడు. రాత్రికి తిరిగి వచ్చాడు. అప్పుడు కూడా ఆ ఇంట్లో వంట జరిగిన సూచనలేవీ లేవు. ఆ మరుసటి రోజు పొద్దున్న కూడా అదే పరిస్థితి. మరికాసేపట్లో ఆ పేదవాడు ఇంటినుంచి బయలుదేరుతాడనగా... సన్యాసి, ధనవంతుడు అతని ఇంటికి వెళ్ళారు.



"నిన్నటి నుంచి గమనిస్తున్నాను. మీ ఇంట్లో వంట చేస్తున్నట్టు కానీ, మీరు భోజనం చేస్తున్నట్టు కానీ కనిపించడం లేదు. ఏం జరిగింది?" అని సన్యాసి ప్రశ్నించాడు.

అప్పుడు ఆ పేదవాడు "స్వామీ! నిన్న తెల్లవారుజామున మా ఇంటి గుమ్మం ముందు ఏ దేవతో 99 వెండి నాణేల మూటను పడేసింది. వాటిని చూడగానే... వంద నాణేలు చేస్తే బాగుంటుందని నేను, నా భార్య అనుకున్నాం. దానికోసం డబ్బు దాచాలనుకున్నాం. రోజు విడిచి రోజు భోజనం చేస్తే... రెండు వారాల్లో మరో వెండి నాణేనికి సరిపడే డబ్బు పోగవుతుందని నిర్ణయించుకున్నాం. అందుకే నిన్న సరుకులు తేలేదు, వండుకోలేదు. ఇవాళ రాత్రి మళ్ళీ వండుకుంటాం" అని వివరించాడు.

అప్పుడు సన్యాసి "మనకు ఉన్నదానితో సంతృప్తి చెందితే ఈ సమస్యా ఉండదు. సంపద ఎక్కువయిన కొద్దీ ఇంకా సంపాదించాలనే అత్యాశ పెరుగుతుంది. దానివల్ల సంతోషం దూరమవుతుంది. కూడబెట్టుకోవలసింది ఆనందాన్నే తప్ప సంపదను కాదు. 99 నాణేలు కంటికి కనబడగానే ఆ పేద దంపతులకు వాటిని వంద చెయ్యాలనే ఆశ కలిగింది. అది వాళ్ళను తిండికి, మనశ్శాంతికి దూరం చేసింది. అలాంటిది ఇంత సంపద ఉన్న నువ్వు మనశ్శాంతిగా ఎలా ఉండగలవు? ఉన్నది చాలు... ఇంకా ఇంకా కావాలని వెంపర్లాడడం మానుకో. ఆ తరువాత నీలో కలిగే మార్పు నీకే స్పష్టంగా తెలుస్తుంది" అని ధనవంతుడికి హితవు చెప్పాడు.

• స్వామి రామతీర్థ

చింతన

ఆచరణాత్మకతే ప్రమాణం

జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భం ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనే అవగాహనను మనలో అభివృద్ధి చేసుకోవాలి. మనం నేర్చుకున్నవాటిని బాగా గుర్తుంచుకోవాలి. మనకు ఎదురయ్యే పరీక్షలో నెగ్గడానికి సాధనాలుగా వాటిని ఉపయోగించుకోవాలి.

సముద్రపు లోతును ఒక చేప ఎప్పటికీ కొలవలేదు. అదే విధంగా అనంతుడైన భగవంతుణ్ణి పరిమితమైన మేధస్సుతో మనం ఎన్నటికీ కొలవలేం. కాబట్టి మనకు ఉన్న పరిమితులలోనే దైవాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. మన అందరి లోపలా దైవికమైన స్పృహ ఉంటుంది. దానిని మనం గుర్తించం. ఎందుకంటే... అంతరంగంకన్నా మనకు శరీరం ప్రధానం. శరీరం ద్వారానే ఇతరులను గుర్తిస్తాం, మనల్ని గుర్తించాలని కోరుకుంటాం. అందంగా కనిపించాలనుకుంటాం. దానికోసం ఎన్నో సౌందర్య సాధనాలను ఉపయోగిస్తాం. మన శరీరం నుంచి చెమట వాసన రాకుండా ఉండడానికి అత్తరులు పూసుకుంటాం. కానీ అంతర్గత శుద్ధి కోసం మనం ఏం చేస్తున్నాం? ఈ స్పృహ మనలో కలగాలంటే... జ్ఞానాన్ని పొందడం అవసరం. అది పొందినప్పుడు... జీవితం ఒక మహా గ్రంథం అవుతుంది. ఇతరులు దాని నుంచి మంచి విషయాలు నేర్చుకోగలుగుతారు.

గొప్ప గ్రంథాలు చదివితే గొప్ప జ్ఞానం వస్తుందని మనం అనుకుంటాం. అది సత్యమే కానీ... మన చుట్టూ ఉన్నవాళ్ళను పరిశీలిస్తే అంతకన్నా గొప్ప విషయాలు తెలుస్తాయి. గ్రంథాలలోని విశేషాలను ఆశ్రమాల్లో బోధిస్తూ ఉంటారు. అక్కడికి వెళ్ళిన ప్రతి ఒక్కరూ వాటి గురించి తెలుసుకుంటారు. కానీ ఏ గ్రంథం సారాంశమైనా క్రియారూపంలోకి వచ్చినప్పుడే రాణిస్తుంది. ఆచరణాత్మకతే దేనికైనా ప్రమాణం. మనం చదివిన, విన్న గ్రంథాల సారాన్ని ఇతరులతో మనం వ్యవహరించేటప్పుడు ఆచరణలోకి తీసుకురావాలి. ఆ బోధలను జీవితంలో అనుసరించినప్పుడే వాటికి సార్థకత.



జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భం ఆ భగవంతుడు మనకు పెడుతున్న పరీక్ష అనే అవగాహనను మనలో అభివృద్ధి చేసుకోవాలి. మనం నేర్చుకున్నవాటిని బాగా గుర్తుంచుకోవాలి. మనకు ఎదురయ్యే పరీక్షలో నెగ్గడానికి సాధనాలుగా వాటిని ఉపయోగించుకోవాలి. ఇతరులతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రశాంతంగా, సహనంతో, సామరస్యంతో ఉండగలుగుతున్నామా? యాంత్రికంగా ప్రవర్తిస్తున్నామా? గ్రంథాల్లో చదివిన మంచి విషయాలను ఇతరుల ముందు వల్లె వెయ్యడానికి మాత్రమే పరిమితం చేస్తున్నామా? అలాంటప్పుడు మనకూ, టేప్ రికార్డర్‌కూ మధ్య తేడా ఏముటుంది?

మంచి విషయాలను ఆచరించి ఎదుటివారికి చూపించాలి. వారిలో ప్రేరణ కలిగించాలి. 'తేనె' అనే పదాన్ని కాగితం మీద రాసి, దాన్ని నాకినంతమాత్రాన... తేనె తియ్యదనాన్ని రుచి చూడగలమా? ప్రతి ఒక్కరి ముందూ 'మేము మంచి వాళ్ళం' అని చెప్పుకోగలమేమో... కానీ మన మంచితనం రుచి మన ప్రవర్తన ద్వారానే వాళ్ళకు కనిపిస్తుంది.

• మాతా అమృతానందమయి

(నేడు మాతా అమృతానందమయి 71వ జన్మదినం)

గీతాసారం

కర్మాచరణ తప్పనిసరి

"నీవు శాస్త్రవిహితమైన కర్తవ్య కర్మలను ఆచరించు. ఎందుకంటే కర్మలను చెయ్యకుండా ఉండడం కన్నా చెయ్యడం ఉత్తమం. కర్మలను ఆచరించకపోతే... నీ శరీర నిర్వహణ కూడా సాధ్యం కాదు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. ఆహారాన్ని సేకరించడం, భోజనం చేయడం లాంటి చర్యలు మానవ శరీరం మనుగడకు అవసరం. మానవ శరీరం అనేక అవయవాలను, వ్యవస్థలను, రసాయనాలను కలిగి ఉంటుంది. ఇవి క్రమం తప్పకుండా వేలాది అంతర్గత చర్యలను సాగిస్తూ ఉంటాయి. వాటిలో ఒక్కటి క్రమం తప్పినా... శరీరం తన అంతర్గత సామరస్యాన్ని కోల్పోతుంది, రోగగ్రస్తం అవుతుంది, లేదా నశిస్తుంది. అంటే శరీర నిర్వహణ... నిష్క్రియాత్మకంగా సాధ్యం కాదు.



శ్రీకృష్ణుడు నియత కార్యాలు లేదా నియత చర్యల గురించి మాట్లాడాడు. అది ఒక క్లిష్టమైన తత్త్వజ్ఞానం. సమాజం మనమీద విధించిన కట్టుబాట్లు, పవిత్ర గ్రంథాలు ప్రశంసించిన ఆచారాలు లేదా విధులు సాధారణంగా నియత కార్యాలుగా పరిగణన పొందుతాయి. కానీ శ్రీకృష్ణుడు ఏది చెబుతున్నాడో దాన్ని ప్రతిఫలించడంలో ఈ రెండూ విఫలమవుతాయి. చిన్న విత్తనం విశాలమైన చెట్టుగా మారినట్టు, చిన్న కణం జన్యువులలో (జీన్స్ లో) ఉన్న సూచనలను అమలు చేయడం ద్వారా సంక్లిష్టమైన మానవ శరీరంగా అభివృద్ధి చెందినట్టు ఈ భౌతిక ప్రపంచంలో అత్యున్నత సామర్థ్యాన్ని సాధించడమే మన బాధ్యత. కణాల కోసం జన్యువులలోని సూచనల మాదిరిగా... ప్రతి ఒక్కరి కర్మ వారి గుణాల ద్వారా ఎంపిక అవుతుందని అర్థం చేసుకోవాలి.



ఇది మన పూర్తి సామర్థ్యాలతో సర్వోత్తమమైన కృషిని చేయడం. ఇదంతా 'మనం ఏం చేస్తున్నాం?' అనే దాని గురించి కాదు. 'ఏ పనినైనా ఎంత బాగా చేస్తున్నాం?' అనే దాని గురించి. మన భౌతిక శక్తి, అనుభవం, సమయం తదితరాల మీద ఆధారపడి మనలోని ప్రతి ఒక్కరికీ సర్వశ్రేష్ఠం అనే నిర్వచనం వేర్వేరుగా ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. అది కొన్నిసార్లు కేవలం ఉనికి, నిశ్శబ్దం లేదా సానుభూతితో వినడం కూడా కావచ్చు. ఇది మనల్ని ఆ శాశ్వతమైన స్థితి అయిన మోక్షానికి (గుణాలను అధిగమించడం) తీసుకువెళ్తుంది. ఇదే మన నియత కార్యం. దాన్ని మనం చెయ్యాల్సిందే తప్ప ఎంచుకోలేం. ఎందుకంటే మన జీవితంలో అతి పెద్ద సంఘటన అయిన పుట్టుకే మనం చేసుకున్న ఎంపిక కాదు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సద్గురువాణి

జ్ఞానోదయం అంటే...

ఆధ్యాత్మిక చింతనకు సంబంధించి అనేక పదాలను మనం వింటూ ఉంటాం. వాటిలో 'జ్ఞానోదయం' అనే మాట ఒకటి. ఇది చాలా దుర్వినియోగం అవుతున్న మాట. నిజంగా జ్ఞానోదయం పొందడానికి, కేవలం మాటలతో మభ్యపెట్టడానికి చాలా తేడా ఉంది.

యమవోకా టెన్షు ఒక జెన్ విద్యార్థి. అతను అనేక మంది జెన్ గురువుల దగ్గర విద్యాభ్యాసం చేస్తూ... జపాన్ అంతటా తిరుగుతూ ఉండేవాడు. ఒక రోజు అతను షోకోకు దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ డొకువాన్ అనే సన్యాసిని కలుసుకున్నాడు. తన జ్ఞానాన్ని ఆయన ముందు ప్రదర్శించాలనుకున్నాడు.



"మనసు, బుద్ధుడు, ఇంకా అన్ని జీవులు శూన్యమే. అన్నిటి వాస్తవ స్వభావం శూన్యమే. జ్ఞానోదయం లేదు, మాయ లేదు, సన్యాసులు లేరు, సామాన్యులు లేరు, శ్రమ లేదు, ప్రతిఫలం లేదు... అంతా శూన్యం" అన్నాడు డొకువాన్‌తో.

ఆ మాటలు విన్న డొకువాన్ కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. తరువాత టెన్షు తల మీద గట్టిగా కొట్టాడు.

"ఎందుకిలా చేశారు?" అని అడిగాడు టెన్షు కోపంగా.

అప్పుడు డొకువాన్ "అంతా శూన్యమే అయితే... ఈ కోపం ఎక్కడినుంచి వచ్చింది?" అని ప్రశ్నించాడు.

టెన్షు ఎక్కడో చదివినదాన్ని పట్టుకొని వేలాడుతూ... తాను శూన్యమనీ, ప్రతిదీ శూన్యమనీ చెబుతూ వస్తున్నాడు. ఒక్కసారి తల మీద దెబ్బ తగలగానే అతనికి కోపం వచ్చింది. అంతా శూన్యమే అయి ఉంటే... మీలో ఎటువంటి నిర్బంధం లేకపోతే... ఆ కోపం ఎలా వస్తుంది? ఇది ఏదైనా లక్ష్యంకోసం ఎరుకతో ప్రదర్శించిన కోపం కాదు. ఎవరో తలమీద కొట్టగానే ఒక్కసారిగా ముంచుకొచ్చిన కోపం.

ఇలాంటి తీవ్రమైన ప్రతిస్పందనలను, అహంకారాన్ని విడిచిపెడితేనే జ్ఞానోదయం అవుతుంది. జ్ఞానోదయం అంటే అది ప్రత్యేకంగా సాధించే విషయం కాదు. అది తిరిగి ఇంటికి రావడం లాంటిది. అందులోని విశేషం ఏమిటంటే... మీరు పరమ సాధారణంగా మారిపోతారు. ఆ తరువాత మీ సొంత విషయాలంటూ ఏవీ ఉండవు. మీదంటూ ఏదీ ఉండదు. అంతా మీదే అయినట్టు లేదా ఏదీ మీది కానట్టు... ఈ స్థితికి చేరుకుంటారు. అటువంటి స్థితిలో ఎలాంటి నిర్బంధత్వం ఉండదు.

ఈ సంగతి గ్రహించకుండా.. జ్ఞానోదయం గురించి మాట్లాడడం బాధ్యతారాహితం. ఎందుకంటే మూర్ఖులందరూ ఈ పదాలను పట్టుకొని... ఇతరులను మోసం చేయడానికో, మరీ ముఖ్యంగా తమను తాము భ్రమింపజేసుకోవడానికో ఉపయోగిస్తారు. ఇలా ప్రతిచోటా జరుగుతూనే ఉంటుంది. పాతికవేల రూపాయలు పుచ్చుకొని... మీకు జ్ఞానోదయం అయిందని ప్రకటించే చిత్తశుద్ధిలేని గురువులు కూడా నేటి సమాజంలో ఉన్నారు. అలాంటి జ్ఞానోదయమే మీకు కావాలంటే... మీ డబ్బు వృథా చేసుకోకండి. "నాకు జ్ఞానోదయం అయింది" అని మీకు మీరే ప్రకటించుకోండి. ఎందుకంటే... ఈ రెండిటికీ పెద్ద తేడా ఏమీ లేదు.

• సద్గురు జగ్గీవాసుదేవ్

సుభాషితం

తొందరపాటు కూడదు

గుణవ దగుణవ ద్వా కుర్వతా కార్య మాదౌ
పరిణతి రవధార్యా యత్నతః పండితేన
అతిరభస కృతానాం కర్మణా మావిపత్తే
ర్భవతి హృదయదాహీ శల్యతుల్యో విపాకః

ఏదైనా పని చేయడానికి ముందు ఆలోచించాల్సిన అవసరం గురించి నీతి శతకంలో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దాన్ని...

సగుణ నిర్గుణ కార్యముల్ సలుపు సుమతి
చేత పరిణతి గడు ప్రతీక్షింపదగును
బరుష కర్మ విపాకంబు ఫలముదనుక
హృదయము దహించు శల్యంబు రీతి జగత్...



అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి సమర్పించారు.

భావం: పండితుడు, బుద్ధిమంతుడు అయిన వ్యక్తి తను ఏదైనా పని చెయ్యాలని అనుకున్నప్పుడు... 'ఈ పని మంచిదా? చెడ్డదా? దాని పర్యవసానం ఏమిటి? దానివల్ల ఎలాంటి ఫలితం కలుగుతుంది?' అని బాగా ఆలోచించాలి. ఆ తరువాతే ఆ పని చెయ్యాలి. అలాకాకుండా తొందరపాటుతో ఏదైనా పని చేసి, దాని వల్ల దుష్ఫలితం కలిగినప్పుడు కలిగే వేదన... మరణించే వరకూ గుండెల్లో బాణం గుచ్చుకున్నట్టు మరణించేవరకూ మనిషిని బాధపెడుతూనే ఉంటుంది, నిరంతరం దహిస్తూనే ఉంటుంది.

హురున్ యువ పారిశ్రామికవేత్తల జాబితాలో

ఇషా, ఆకాశ్ అంబానీకి చోటు

తెలుగు రాష్ట్రాల నుంచి 10 మంది..



న్యూఢిల్లీ: దేశంలో 35 ఏళ్ల లోపు వయసున్న అత్యుత్తమ యువ పారిశ్రామికవేత్తల్లో భారత కుబేరుడు, ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ, కుమార్తె ఇషా అంబానీకి చోటు దక్కింది. హురున్ ఇండియా ఈ ఏడాదికి గాను మొత్తం 150 మంది యువ పారిశ్రామికవేత్తల వివరాలతో కూడిన జాబితాను గురువారం విడుదల చేసింది. హురున్ ఈ లిస్టును విడుదల చేయడం ఇదే తొలిసారి. కాగా, తెలుగు రాష్ట్రాల నుంచి 10 మందికి ఇందులో స్థానం లభించింది. నగరాల విషయానికొస్తే, 29 మంది యువ పారిశ్రామికవేత్తలతో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ముంబై (26 మంది), ఢిల్లీ (21 మంది),హైదరాబాద్ (9 మంది) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. జాబితాలోని 123 మంది తొలితరం పారిశ్రామికవేత్తలే కావడం గమనార్హం. మిగతావారు తమ కుటుంబ వ్యాపారాలను మరింత విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని హురున్ పేర్కొంది.


'హురున్ అండర్ 35'లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు

పేరు	కంపెనీ	ప్రాంతం
అక్షిత్ జైన్	గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్	విజయవాడ
కేశవ్ రెడ్డి	అరాజెన్ లైఫ్‌సైన్సెస్	హైదరాబాద్
వెంకట సంజీవ్ అల్లూరి	అవంతి ఫీడ్స్	హైదరాబాద్
నవీశ్ రెడ్డి	ఫైనాన్స్‌పీర్	హైదరాబాద్
రాహుల్ అత్తులూరి	నెక్స్ట్‌వేవ్	హైదరాబాద్
పవన్ గుంటుపల్లి	ర్యాపిడో	హైదరాబాద్
పవన్ కుమార్ చందన	స్కైరూట్ ఏరోస్పేస్	హైదరాబాద్
ఆశిష్ గోయెంకా	3ఎఫ్ ఆయిల్ పామ్	హైదరాబాద్
డీ నాగ భరత్	స్కైరూట్ ఏరోస్పేస్	హైదరాబాద్
సంజయ్ జగన్నాథ్	ఎక్స్‌పోనెంట్ ఎనర్జీ	హైదరాబాద్

86,000 దిశగా సెన్సెక్స్

సూచీ మరో 666 పాయింట్లు అప్ .. ఇంట్రాడేలో 26,250 స్థాయికి నిఫ్టీ

దలాల్‌స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత



ముంబై: భారత స్టాక్ మార్కెట్లో బుల్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ప్రామాణిక సూచీలు గురువారం సరికొత్త శిఖరాలకు ఎగబాకాయి. ఆసియా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఆటో, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒక దశలో 760.56 పాయింట్ల వృద్ధితో 85,930.43 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 666.25 పాయింట్ల లాభంతో 85,836.12 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. అంతేకాదు, 86,000 మైలురాయిని చేరుకునేందుకు సూచీ కేవలం 69.57 పాయింట్ల దూరంలో ఉంది. కాగా, నిఫ్టీ వరుసగా ఆరో రోజూ బలపడింది. ఒక దశలో సూచీ 246.75 పాయింట్లు ఎగబాకి 25,250.90 సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో 211.90 పాయింట్ల లాభంతో 26,216.05 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును సైతం నమోదు చేసుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 లాభపడ్డాయి. మారుతి సుజుకీ షేరు 4.76 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. టాటా మోటార్స్ 3.08 శాతం, ఎం అండ్ ఎం 2.97 శాతం పుంజుకున్నాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే, అల్ట్రాటెక్ షేర్లు సైతం రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎ‌స్‌ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.39 శాతం వరకు నష్టపోయాయి.

రంగాలవారీ సూచీల్లో ఆటో, మెటల్ 2 శాతానికి పైగా వృద్ధి చెందగా.. కమోడిటీస్ ఇండెక్స్ 1.32 శాతం పెరిగింది. ఫారెక్స్ ట్రేడింగ్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు క్షీణించి 83.66 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు ధర ఒకదశలో 3.20 శాతం తగ్గి 71.11 డాలర్లకు దిగివచ్చింది.

మారీ టెక్ రూ.1,500 కోట్ల ఐపీఓ

హైదరాబాద్‌కు చెందిన ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ కంపెనీ మారీ టెక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి కంపెనీ ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా రూ.440 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన రూ.1,060 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. ఐపీఓ ద్వారా కంపెనీ ప్రమోటర్లైన సుజయ్ పాటూరు రూ.615 కోట్లు, అనిల్ రెడ్డి యెర్రంరెడ్డి రూ.316 కోట్లు, నాన్-ప్రమోటర్ వాటాదారు ఎస్ శ్రీనివాస రావు రూ.129 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు.

3 రోజుల్లో డెట్ సెక్యూరిటీల లిస్టింగ్

డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలు, నాన్ కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్షియల్ షేర్ల (ఎన్‌సీఆర్‌పీఎస్) లిస్టింగ్ సమయాన్ని ప్రస్తుత ఆరు రోజుల (టీ+6) నుంచి మూడు రోజుల(టీ+3)కు తగ్గించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గురువారం నిర్ణయించింది. ఈ నవంబరు 1న, ఆ తర్వాత ప్రారంభమయ్యే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు కొత్త గడువు ఐచ్ఛికమే అయినప్పటికీ, 2025 నవంబరు 1, ఆ తర్వాత నుంచి ఇష్యూలు తప్పనిసరిగా మూడు పనిదినాల్లో మార్కెట్లో లిస్ట్ కావాల్సి ఉంటుందని సెబీ తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

డీలిస్టింగ్‌కు స్థిర ధర విధానం: ఫిక్స్‌డ్ ప్రైస్ మెకానిజం (స్థిర ధర విధానం) ద్వారా కంపెనీలు తమ షేర్లను స్టాక్ మార్కెట్ నుంచి డీలిస్ట్ చేసేందుకు అనుమతించే కొత్త నియమావళిని సెబీ గురువారం ప్రకటించింది. తద్వారా కంపెనీలకు డీలిస్టింగ్ మరింత సులువు కానుంది.

మహారాష్ట్రలో రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు

రూ.21,100 కోట్ల పెట్టుబడి: మేఘా ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్).. మహారాష్ట్రలో రెండు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టులు చేపడుతోంది. దీనికి సంబంధించి గురువారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో ఆ రాష్ట్ర జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ ప్రతినిధుల మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఈ రెండు ప్రాజెక్టుల కోసం కంపెనీ రూ.21,100 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను ఐదేళ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపింది.

స్పాన్ ఎక్రాస్, మొబైల్‌వేర్‌లో జాగిల్ ప్రీపెయిడ్‌కు వాటాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫిన్‌టెక్ సంస్థ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. స్పాన్ ఎక్రాస్ ఐటీ సొల్యూషన్స్, మొబైల్‌వేర్ కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందుకోసం మొత్తం రూ.48 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించింది. స్పాన్ ఎక్రాస్‌లో రూ.32.07 కోట్లతో 98.32 శాతం వాటాను దక్కించుకోగా, మొబైల్‌వేర్‌లో రూ.15.60 కోట్లతో 26 శాతం వాటాను చేజిక్కించుకున్నట్లు జాగిల్ తెలిపింది. టాక్స్‌స్పానర్ పేరుతో స్పాన్ ఎక్రాస్.. ఆదాయ పన్ను సన్నాహకాలు, ఈ-ఫైలింగ్ కంపెనీలకు సేవలందిస్తుండగా మొబైల్‌వేర్.. డిజిటల్ చెల్లింపులకు అవసరమైన సొల్యూషన్స్‌ను అందిస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,000 ▼	70,050 ▼	1,00,000 ▼
ముంబై	75,750 ▲	69,387 ▲	92,522 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	530
వరంగల్	507	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		

కార్యాలయ స్థలాలకు భారీ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాలకు డిమాండ్ జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 31 శాతం పెరిగినట్టు కోలియెర్స్ ఇండియా తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కార్యాలయ స్థలాల లీజింగ్ 1.32 కోట్ల చదరపు అడుగుల నుంచి 1.73 కోట్ల చదరపు అడుగులకు పెరిగినట్టు తెలియచేసింది.

హైదరాబాద్ జోరు: కార్యాలయ స్థలాల డిమాండ్‌లో బెంగళూరు, హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచాయి. మూడో త్రైమాసికంలో లీజుకి తీసుకున్న కార్యాలయ స్థలాల్లో సగం పైగా వాటా ఈ రెండు నగరాలదే. బెంగళూరులో చారిత్రక గరిష్ఠ స్థాయిలో 63 లక్షల చదరపు అడుగుల స్థలం అమ్ముడుపోయింది. 29 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదే కాలంలో లీజుకి తీసుకున్న 25 లక్షల చదరపు అడుగులతో పోల్చితే డిమాండ్ 16 శాతం పెరిగింది. అయితే ఇళ్ల డిమాండ్ మాత్రం 22%క్షీణించి 16,735 యూనిట్ల నుంచి 12,735 యూనిట్లకు తగ్గింది. కాగా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 11 శాతం క్షీణించాయి. ఇళ్ల ధర మాత్రం 23 శాతం పెరిగింది. కొత్త ప్రాజెక్టులేవీ ప్రారంభం కాకపోవడమే ఇళ్ల అమ్మకాలు క్షీణించడానికి కారణమని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ తాజా నివేదికలో తెలిపింది.

- ఆర్గానిక్ నిత్యావసరాలు అందించే ది ఆర్గానిక్ వరల్డ్ తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించింది. ఇందులో భాగంగా ప్రగతి నగర్‌లో ఒక స్టోర్ ప్రారంభించింది. ముందు ముందు హైదరాబాద్‌లో మరిన్ని స్టోర్స్ ప్రారంభిస్తామని ది ఆర్గానిక్ వరల్డ్ మాతృసంస్థ నిమిడా అధినేత గౌరవ్ మన్‌చందా తెలిపారు.

6.7 శాతం వృద్ధి ఖాయం

ఆర్థిక శాఖ అంచనా

న్యూఢిల్లీ: ఆగస్టు వరకు ప్రధాన ఆర్థిక సూచీల కదలికలను పరిగణనలోకి తీసుకున్నట్టయితే ఈ ఏడాది మన దేశం 6.5 శాతం నుంచి 7 శాతం వృద్ధి సాధించగలదనిపిస్తోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా నివేదికలో తెలిపింది. దేశంలో వృద్ధి రేటు, పెట్టుబడులు, ఉపాధి, ద్రవ్యోల్బణ ధోరణులన్నీ నిలకడగా ఉన్నాయని పేర్కొంది. ఆర్థిక రంగం కూడా స్థిరంగా ఉండడంతో పాటు విదేశీ మారక నిల్వల పరిస్థితి పటిష్ఠంగా ఉన్నదని ఆ నివేదికలో తెలిపారు. అయితే ప్రపంచ ఆర్థిక రంగంలో నెలకొన్న అస్థిరతలను ఎదుర్కొనడం ఒక సవాలుగా పేర్కొన్నారు. ప్రపంచంలో తిరోగమన భయాల నేపథ్యంలో వరుసగా వడ్డీరేట్ల తగ్గింపును సమర్థవంతంగా ఎదుర్కొనవలసి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రభుత్వ వ్యయాలు పెరిగి వృద్ధిని, పెట్టుబడులను ఉత్తేజితం చేస్తాయని అంచనా వేశారు. వాతావరణపరంగా కూడా చెప్పుకోదగ్గ భారీ ప్రతికూలతలేవీ లేని కారణంగా గ్రామీణాదాయాలు పెరిగి వస్తూత్పత్తుల డిమాండ్ కూడా బలంగా ఉంటుందని తెలిపింది కాగా ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు జోరులో ఉన్నాయని, ఈ నేపథ్యంలో మార్కెట్లకు కరెక్షన్ ముప్పు పెరిగిందని ఆర్థిక శాఖ అంగీకరించింది.

ఢిల్లీలో 'డబ్ల్యూటీఎస్ఏ-2024' సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఢిల్లీ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. వచ్చే నెల 14-24 తేదీల మధ్య 'వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యూటీఎస్ఏ-2024) సదస్సు ఢిల్లీలో జరగనుంది. దీనికి సంబంధించి టెలికాం శాఖ (డీఓటీ) గురువారం ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (హైదరాబాద్)లతో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించింది. ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ చరిత్రలో ఈ సదస్సు మన దేశంలో జరగడం ఇదే మొదటిసారి.

జెన్ టెక్నాలజీస్ నుంచి 4 కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సైనిక దళాల కోసం మరో నాలుగు సరికొత్త రిమోట్ కంట్రోల్డ్ వెపన్ అండ్ సర్వైలెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేసిది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ఈ ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్టు తెలిపింది. పరశు, ఫనీష్, షరూర్, దుర్గం పేరుతో అభివృద్ధి చేసిన ఈ సరికొత్త ఆయుధ వ్యవస్థలతో దేశ రక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొంది.

రూ.78,000 దాటిన పసిడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ బులియన్ ధరలు సరికొత్త రికార్డు గరిష్ఠాలకు ఎగబాకాయి. పసిడి తొలిసారిగా రూ.78,000 మైలురాయిని దాటేసింది. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర గురువారం మరో రూ.400 పెరుగుదలతో రూ.78,250కి చేరుకుంది. కిలో వెండి సైతం రూ.1,000 పెరిగి రూ.94,000 ధర పలికింది. కాగా, అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 0.61 శాతం వృద్ధితో తొలిసారిగా 2,700 డాలర్లకు చేరుకుంది. సిల్వర్ 32.86 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

క్లీన్‌స్వీప్‌పై గురి



గంభీర్ రోహిత్ అశ్విన్



బంగ్లా కెప్టెన్ షంటో

ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..

- జోరు మీదున్న భారత్
- సమం కోసం బంగ్లాదేశ్
- నేటి నుంచి తుది టెస్టు

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టును నాలుగు రోజుల్లోనే ఘనంగా ముగించిన టీమిండియా మరో విజయంపై కన్నేసింది. తాజాగా ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి సిరీస్‌లో ఆఖరిదైన రెండో టెస్టు జరుగనుంది. మూడేళ్ల తర్వాత కాన్పూర్ వేదిక ఈ సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. 1-0తో సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్న భారత్ నేటి మ్యాచ్‌లో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. అదే జరిగితే వరుసగా 18వ సిరీస్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నట్టవుతుంది. మరోవైపు ఈ సిరీస్ ఆరంభానికి ముందు బంగ్లాపై భారీ అంచనాలే నెలకొన్నాయి. కానీ భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు బ్యాటర్లు ఎలాంటి ప్రభావమూ చూపలేదు. దీంతో పాక్‌ను వైట్‌వాష్ చేసి ఊపు మీదున్న బంగ్లాను రోహిత్ సేన నేలకు దించింది. కానీ కాన్పూర్ టెస్టులో మాత్రం ఆతిథ్య జట్టుకు దీటుగా బదులివ్వాలనే కసితో ఉంది. తద్వారా భారత్‌పై తొలి విజయంతో పాటు సిరీస్‌ను సమం చేయాలనుకుంటోంది.

విరాట్, రోహిత్‌పైనే దృష్టి: చెన్నై టెస్టులో అశ్విన్, జడేజా, పంత్, గిల్ విశేషంగా రాణించినా టాపార్డర్ కలిసికట్టుగా ఆడలేకపోయింది. ఓపెనర్‌గా జైస్వాల్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. కానీ స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, కెప్టెన్ రోహిత్ మాత్రం దారుణంగా విఫలం కావడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనపరుస్తోంది. సుదీర్ఘ సీజన్ ముందుండడంతో ఈ ఇద్దరు వెటరన్స్ తమ బ్యాట్లను ఝుళిపించాల్సిన అవసరం ఎంతో ఉంది. అలాగే కేఎల్ రాహుల్ తనకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడు. ఇక గ్రీన్‌పార్క్ వికెట్ సహజంగానే స్పిన్‌కు అనుకూలిస్తుంటుంది. దీంతో భారత జట్టు తుది కూర్పులో మార్పులు తప్పవు. చెన్నై మ్యాచ్‌కు ముగ్గురు పేసర్లు అవసరమైనా.. ఇక్కడ మాత్రం ఇద్దరితోనే వెళ్లాలనుకుంటోంది. అందుకే పేసర్ ఆకాశ్ దీప్‌నకు విశ్రాంతినిచ్చి కుల్దీప్ లేక అక్షర్‌లలో ఒకరిని ఆడించనున్నారు. అలాగే మరో ఎనిమిది టెస్టులుండడంతో బుమ్రాకు విశ్రాంతినిచ్చే విషయాన్నీ తోసిపుచ్చలేం. ఏడాదిన్నర కాలంగా కుల్దీప్ అద్భుతంగా రాణిస్తుండడంతో కెప్టెన్, కోచ్ గంభీర్ అతడివైపే మొగ్గు చూపవచ్చు. 2021లో ఇక్కడ జరిగిన చివరి టెస్టులో భారత్ అశ్విన్, జడేజా, అక్షర్‌లతో బరిలోకి దిగింది.



కోహ్లీ

షకీబ్ సందేహమే: తొలి టెస్టులో బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బందిపడిన బంగ్లాకు తాజా టెస్టు ఆరంభానికి ముందే తడబాటు తప్పేట్టు లేదు. షకీబ్ అల్ హసన్ వేలి గాయంతో బాధపడుతున్నాడు. అయితే కోచ్ మాత్రం అతను బరిలోకి దిగుతాడని చెబుతున్నాడు. బ్యాటింగ్‌లో కెప్టెన్ షంటోపైనే భారం పడుతోంది. మోమినుల్, ముష్ఫికర్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యారు. ఇక బంగ్లా కూడా మూడో స్పిన్నర్‌గా తైజుల్ ఇస్లాంను బరిలోకి దింపాలనుకుంటోంది. టెస్టుల్లో బంగ్లా బలం వారి స్పిన్నర్లే. ఇప్పుడు అదే బలంతో భారత్‌పై గెలుపు రుచి చూడాలనుకుంటోంది.

2 టెస్టుల్లో 300 వికెట్ల క్లబ్‌లో చేరేందుకు జడేజా మరో వికెట్ దూరంలో ఉన్నాడు. అదే జరిగితే సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో అత్యంత వేగంగా (74 టెస్టుల్లో) 300 వికెట్లు, 3000+ పరుగులు సాధించిన రెండో ప్లేయర్ అవుతాడు. ఇయాన్ బోథమ్ (72 టెస్టులు) టాప్‌లో ఉన్నాడు.

జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, పంత్, రాహుల్, జడేజా, అశ్విన్, కుల్దీప్, ఆకాశ్/బుమ్రా, సిరాజ్.

బంగ్లాదేశ్: షాద్‌మన్, జకీర్ హసన్, షంటో (కెప్టెన్), మోమినుల్ హక్, ముష్ఫికర్, షకీబ్, లిట్టన్ దాస్, మెహిదీ హసన్, హసన్ మహమూద్, టస్కిన్/నహీద్, తైజుల్.

పిచ్

కాన్పూర్ వికెట్ సమతూకంతో ఉంటుందని క్యూరేటర్ చెబుతున్నాడు. తొలి రోజు బౌన్స్‌తో పేసర్లు లాభపడనున్నారు. అయితే మ్యాచ్ సాగుతున్నకొద్దీ స్పిన్నర్లదే ఆధిక్యం కనిపించనుంది. ఇక బ్యాటర్లకు కూడా అనుకూలం కావడంతో భారీ స్కోర్లను ఆశించవచ్చు. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 370.

వరుణుడితో ఇబ్బందే

భారత్-బంగ్లా రెండో టెస్టుకు తొలి మూడు రోజులు ఉరుములతో కూడిన వర్షం ఆటంకం కలిగించే అవకాశాలున్నాయి. గురువారం ఇక్కడ కురిసిన భారీ వర్షానికి బంగ్లా ప్రాక్టీస్ కూడా చేయలేకపోయింది. అయితే ఆధునిక డ్రైనేజి వ్యవస్థ ఉన్నందున త్వరగానే పరిస్థితులను చక్కదిద్దగలమని స్టేడియం మేనేజర్ సంజయ్ కపూర్ చెబుతున్నాడు. చివరి మూడు రోజులు మాత్రం వరుణుడి నుంచి ఎలాంటి ముప్పు లేదట.

టీ20లకు గుడ్‌బై

స్వదేశంలో చివరి టెస్ట్ ఆడాలని ఉంది..

- కుదరకపోతే కాన్పూర్ టెస్టే ఆఖరిది
- చాంపియన్స్ ట్రోఫీతో వన్డేలకూ వీడ్కోలు
- బంగ్లాదేశ్ స్టార్ షకీబ్ సంచలన నిర్ణయం



షకీబ్ అల్ హసన్

కాన్పూర్: బంగ్లాదేశ్ దిగ్గజ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ సంచలన నిర్ణయాలు తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ నుంచి తక్షణమే రిటైర వుతున్నట్టు ప్రకటించాడు. అలాగే స్వదేశంలో టెస్ట్ ద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలన్నది తన ఆకాంక్షని తెలిపాడు. కానీ పరిస్థితులు అనుకూలించకపోతే టీమిండియాతో కాన్పూర్‌లో జరిగే రెండో టెస్టే తనకు ఆఖరిదని వెల్లడించాడు. స్వదేశంలో తన భద్రతపై షకీబ్ ఆందోళనగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆ సిరీస్‌లో అతడు ఆడే అవకాశాలు లేవన్న వాదన వినిపిస్తోంది. ఇక..చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలనుంచీ వైదొలగనున్నట్టు తెలిపాడు.

అప్పుడే ఆఖరాట ఆడేశా..: 'గత జూన్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లోనే నా చివరి పొట్టి క్రికెట్ మ్యాచ్ ఆడేశా. 2026 ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయమే తీసుకున్నా' అని షకీబ్ అన్నాడు. అయితే ఫ్రాంచైజీ క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టంజేశాడు. 129 టీ20లలో 2551 పరుగులు సాధించిన హసన్ 149 వికెట్లు తీశాడు. మరోవైపు..70 టెస్టుల్లో 4600 రన్స్, 242 వికెట్లు సాధించాడు. కాగా గత జనవరిలో జరిగిన ఎన్నికల్లో పాలక అవామీ లీగ్ పార్టీ నుంచి షకీబ్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. కానీ షేక్ హసీనాకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో షకీబ్‌పై హత్య కేసు నమోదైంది. అయితే హత్య జరిగిన సమయంలో బంగ్లా మాజీ కెప్టెన్ స్వదేశంలో లేకపోవడం గమనార్హం. ఇక..వచ్చే నెలలో రెండు టెస్టుల సిరీస్‌కోసం దక్షిణాఫ్రికా జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఇందులో మీర్పూర్‌లో జరిగే టెస్ట్ ద్వారా ఈ ఫార్మాట్‌కు షకీబ్ గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాడు.

కమిందు ప్రపంచ రికార్డు

దినేశ్ శతకం — శ్రీలంక 306/3

గాలె: కీపర్ దినేశ్ చాందిమల్ (116) శతక మోత మోగించిన వేళ..న్యూజిలాండ్‌తో గురువారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో శ్రీలంక భారీ స్కోరు దిశగా సాగుతోంది. కమిందు (51 నాటౌట్), దినేశ్‌తోపాటు మాథ్యూస్ (78 బ్యాటింగ్) సత్తా చాటడంతో మొదటి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆఖరికి ఆతిథ్య జట్టు 306/3 స్కోరు చేసింది. ఇక..132 ఏళ్ల సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో అరంగేట్రం తర్వాత వరుసగా ఎనిమిది టెస్ట్‌ల్లోనూ అర్ధ శతకాలు సాధించిన మొదటి బ్యాటర్‌గా కమిందు మెండిస్ చరిత్రపుటలకెక్కాడు. కమిందు 2022లో ఆస్ట్రేలియాపై గాలెలోనే టెస్ట్ అరంగేట్రం చేశాడు.

పంత్ ఆస్ట్రేలియన్ అయితే బాగుండేది: మార్ష్



న్యూఢిల్లీ: వికెట్ కీపింగ్ బ్యాటర్ రిషభ్ పంత్ ఆస్ట్రేలియా ఆటగాడైతే బాగుండేదని ఆ దేశానికి చెందిన ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ అన్నాడు. నవంబరు చివర్లో ఆస్ట్రేలియా టూర్‌కు భారత జట్టు వెళ్లనుంది. 'అతడు చీల్చి చెండాడుతాడు. పంత్ ఆస్ట్రేలియన్ అయితే బాగుంటుందని నేను కోరుకొంటున్నా. గత కొన్నేళ్లుగా అతడు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. వాటి నుంచి బలంగా తిరిగి వచ్చాడు. ఎంతో సానుకూల మనస్తత్వం. ఎప్పుడూ గెలవడానికే పోరాడతాడు. సరదాగా నవ్వుతూ ఉంటాడని మార్ష్ అన్నాడు.

యువ భారత్‌దే సిరీస్

మూడో వన్డేలోనూ విజయం

పోరాడిన ఆసీస్ అండర్-19

పుదుచ్చేరి: ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత కుర్రాళ్లు 3-0తో క్లీన్‌స్వీప్ చేశారు. గురువారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ 7 పరుగులతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 324/8 స్కోరు సాధించింది. రుద్ర పటేల్ (77), అమాన్ (71) అర్ధసెంచరీలతో చెలరేగారు. ఐడన్ ఓ కానర్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఒల్లీ పీక్ (111), స్టీవెన్ హోగన్ (104) శతకాలు సాధించారు. అయితే ఆఖర్లో తడబడి 50 ఓవర్లలో 317/7 స్కోరు మాత్రమే చేయడంతో ఓటమి తప్పలేదు. హార్దిక్ రాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

ఐపీఎల్‌కు ధోనీ దూరమైనట్టేనా?



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ధోనీ ఆడతాడా? లేదా? అనే దానిపై సందిగ్ధం కొనసాగుతోంది. 2025 ఐపీఎల్‌కు ధోనీ (43) అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై ఎటువంటి స్పష్టతా లేదు. 'మాకు అతడి నుంచి సమాచారం అందాల్సి ఉంది. రిటెన్షన్ పాలసీని బీసీసీఐ ప్రకటిస్తే కానీ స్పష్టత రాదు' అని సీఎస్‌కే వర్గాలు తెలిపాయి. నవంబరు చివర్లో లేదా డిసెంబరు ఆరంభంలో మెగా వేలం జరిగే అవకాశాలున్నాయి. కాగా, ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకొనేందుకు బోర్డు అవకాశం కల్పిస్తుందన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. ఈ క్రమంలో రైట్ టు మ్యాచ్‌ను రద్దు చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో విధివిధానాలు వెలువడవచ్చని బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

హీరోయిన్‌తో డేటింగ్ చేశా!

బయటపెట్టిన యువరాజ్



న్యూఢిల్లీ: ఓ హీరోయిన్‌తో డేటింగ్ చేసినట్టు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్‌సింగ్ సంచలన విషయం బయటపెట్టాడు. 2007-08 ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించిన విషయాలను ఓ పాడ్‌కాస్ట్‌లో గుర్తు చేసుకొన్నాడు. మంకీ గేట్ వివాదం రాజుకొన్న సమయంలో యువీ డేటింగ్‌లో బిజీగా ఉన్నాడు. 'గతంలో నేను ఓ సినీ నటితో డేటింగ్ చేశా. ఆమె షూటింగ్ కోసం అడిలైడ్‌లో వచ్చింది. మేం కాన్‌బెర్రాలో ఉన్నాం. 'ఆటపై దృష్టి పెట్టాలి. నువ్వు ఇక్కడకు రావద్దు'అని చెప్పా. నేను చెప్పినా వినకుండా ఆమె కాన్‌బెర్రాకు వచ్చేసింది. 'ఆమెను చూసి ఇక్కడేం చేస్తున్నావు?' అని అడిగా. 'నీతో సమయం గడుపుదామని వచ్చాన'ని చెప్పింది. దీంతో ఆ రోజు ఆమెతోనే ఉండిపోయాన'ని యువీ తెలిపాడు. ఆ తర్వాత కాన్‌బెర్రా నుంచి అడిలైడ్ వెళ్లేందుకు సిద్ధం కాగా.. తన సూట్‌కేస్‌ను ఆమే ప్యాక్ చేసిందని తెలిపాడు. అయితే, తన బూట్లను కూడా సర్దేయడంతో.. బయల్దేరే సమయానికి ఏం చేయాలో అర్థం కాలేదన్నాడు. అప్పుడు తను తన పింక్ షూస్‌ను వేసుకొని వెళ్లమనడంతో.. తప్పలేదని యువీ చెప్పాడు. అమ్మాయిలు వేసుకొనే షూతోనే టీమ్ బస్సు దగ్గరకు వచ్చా. సహచరులకు కనిపించకుండా సూట్‌కేస్‌ను అడ్డుపెట్టుకొన్నా. కానీ, ఎలాగో వారి కంట పడడంతో.. చప్పట్లు కొడుతూ ఆటపట్టించారు. అయితే, ఆ హీరోయిన్ ఎవరనేది మాత్రం యువీ బయటపెట్టలేదు. 2007లో దీపిక పదుకోన్‌తో యువరాజ్ కథ నడిపినట్టు గాసిప్‌లు వచ్చాయి.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్, గాయత్రి జోడీ

మకావు: ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, గాయత్రి జోడీ మకావు ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకొన్నారు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో సహచరుడు ఆయుష్ షెట్టిపై శ్రీకాంత్ 21-13, 21-18తో వరుస గేముల్లో నెగ్గాడు. రౌండ్-8లో ఎన్‌జి క లాంగ్ అంగస్ (హాంకాంగ్)తో కిడాంబి తలపడనున్నాడు. మహిళల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి జంట 22-20, 21-11తో లిన్ చి చున్-టింగ్ చు సన్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. కాగా, మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో సిక్కిరెడ్డి-సుమిత్ జంట 17-21, 14-21తో మలేసియాకు చెందిన వాంగ్ టి సి-లిమ్ చ్యు సియన్ చేతిలో చిత్తయ్యింది.

జగన్‌కు భక్తి విశ్వాసాలుంటే తలనీలాలు ఇవ్వాలి

- డిక్లరేషన్ ఇచ్చాకే దర్శనానికి అనుమతినివ్వాలి
- భక్తులను రెచ్చగొట్టేందుకే తిరుమలకు: సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జగన్ తన స్వార్థం కోసం శ్రీవారి భక్తులను రెచ్చగొట్టి నీచ రాజకీయం చేసేందుకే తిరుమల వెళ్తున్నారని సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ నాయకులు తీవ్రంగా ఆక్షేపించారు. దీనిని హిందూ ధర్మంపై జగన్ చేస్తున్న దాడిగానే భావించాలన్నారు. తిరుమల లడ్డూ పేరుతో రెచ్చగొడుతున్న జగన్‌ను తిరుమలలో భక్త బృందాలు, హిందూ సంఘాలు, స్వామీజీలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. గుంటూరు బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో 13 జిల్లాల సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ నాయకులు సిరిపురపు శ్రీధర్‌శర్మ, దాసరి రాము, వనమా నరేంద్ర, కోనేరు శ్రీవిద్య, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, వావిలాల కుమార్ మీడియాతో మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్ తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకుని తీరుతానని చెప్పటం హిందూ మత, ధర్మ విశ్వాసాలను, భక్తుల మనోభావాలను రెచ్చగొట్టటమే. తద్వారా శాంతిభద్రలకు విఘాతం కలిగించే కుట్ర చేస్తున్నారు. జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తిరుమలకు వచ్చిన అనేక సందర్భాల్లో డిక్లరేషన్ రిజిస్టర్‌లో ఏనాడూ సంతకాలు చేయలేదు. జగన్ ముఖ్యమంత్రిగా ఏనాడూ తన భార్యతో కలిసి బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించలేదు. ఇటువంటి వ్యక్తి గత ఐదేళ్లలో తన బంధువులైన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలను ఛైర్మన్‌లుగా, ఈవోగా ధర్మారెడ్డిలను నియమించి తిరుమలను అపవిత్రం చేశారు' అని అన్నారు. జగన్‌కు వేంకటేశ్వర స్వామిపై నమ్మకం, విశ్వాసం, భక్తి, భయం ఉంటే ఆయన సతీమణి భారతితో సహా కొండపైకి కాలినడకన వచ్చి స్వామివారికి తలనీలాలు సమర్పించాలని కోరారు. ఈ విషయం మీడియా ముఖంగా ప్రకటిస్తే కనుక అడ్డుకోబోమని' అని వారు స్పష్టం చేశారు.

లడ్డూకు తగ్గని డిమాండ్



- వారంలో 23 లక్షల మేర విక్రయం
- రోజుకు 3 లక్షలకు తగ్గకుండా అమ్మకం
- ఫలితమిస్తున్న దిద్దుబాటు చర్యలు

తిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూప్రసాదాలు అపవిత్రం అయినట్టు తేలగానే..రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి తీసుకున్న దిద్దుబాటు చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఫలితంగా తిరుమలలో లడ్డూల విక్రయాల జోరు ఎక్కడా తగ్గలేదు. గడిచిన వారంరోజుల వ్యవధిలో ఏకంగా 23 లక్షల లడ్డూల విక్రయాలు జరగడం గమనార్హం. ఈనెల 19వ తేదీన 3,59,660 లడ్డూలు, 20న 3,17,954, 21న 3,67,607, 22న 3,46,640, 23న 3,08,744, 24న 3,02,174, 25న 3,10,423 లడ్డూల విక్రయాలు జరిగాయి.

టీటీడీ ఈవోతో 'నందిని' ప్రతినిధుల భేటీ

- నెయ్యి నాణ్యతలో తప్పులు జరగడానికి వీల్లేదు
- భక్తుల మనోభావాలతో కూడిన అంశమిది : ఈవో

తిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (నందిని డెయిరీ) ప్రతినిధులు గురువారం టీటీడీ ఈవో శ్యామలరావును కలిశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో వీరు నందిని డెయిరీ ఉత్పత్తుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు. నాణ్యత విషయంలో పాటిస్తున్న జాగ్రత్తలు, దేశంలో ఎక్కడెక్కడకు పాలు, నెయ్యి సరఫరా చేస్తున్నారనే వివరాలు తెలియజేశారు. అలాగే, మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పాలను సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. కాగా, శ్రీవారి లడ్డూ, ప్రసాదాలు కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయమని, నెయ్యి నాణ్యతలో ఎలాంటి తప్పులు జరగకూడదని వారికి ఈవో స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం టెండర్ల ప్రక్రియలో పాల్గొంటూ టీటీడీకి అవసరమైన నెయ్యిని సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో గౌతమి, కేఎంఎఫ్ ఎండీ జగదీష్, డైరెక్టర్లు రఘునందన్, రాజశేఖర్‌మూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.



బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, కిలారు రోశయ్యలకు జనసేన కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జనసేనలో చేరిన బాలినేని

- ఉదయభాను, కిలారి రోశయ్య కూడా..

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పార్టీలోకి వచ్చేవారంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పల్లెపల్లెకూ జనసేన సిద్ధాంతాలను తీసుకెళ్లాలని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం జనసేనలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పవన్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. వారితోపాటు విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ యువజన విభాగం విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అవనపు భావన కూడా పార్టీలో చేరారు. చేరికల అనంతరం పార్టీ కార్యాలయం వెలుపలకు వచ్చిన పవన్‌ను కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఇస్తే తప్పేంటి?

- జగన్‌పై పెరుగుతున్న ఒత్తిడి!
- ఆలయ నిబంధనలపైనా భేషజాలేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తిరుమల వెళ్తున్నారు! లడ్డూ వివాదం నేపథ్యంలో... కేవలం రాజకీయ పంతం కోసం కొండపై కాలు పెడుతున్నారు! వెంకన్న సన్నిధిలో మరో వివాదం సృష్టించేందుకే ఈ పర్యటన పెట్టుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్ కుటుంబం క్రైస్తవ మత సంప్రదాయాలనే అనుసరిస్తుంది. నిబంధనల ప్రకారం అన్యమతస్థులు తిరుమల దర్శనానికి వస్తే... వెంకటేశ్వరుడిపై తమకు విశ్వాసముందంటూ డిక్లరేషన్‌పై సంతకం చేయాలి. ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లూ జగన్ బేఖాతరు చేశారు. ఆలయ సంప్రదాయాన్ని తన 'అధికారం'తో తోసిరాజన్నారు. ఇప్పుడు మళ్లీ 'డిక్లరేషన్' అంశం తెరపైకి వచ్చింది. జగన్ సంతకం చేయాల్సిందేనని హిందూ ధార్మిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

పోటీ కోసమే పర్యటన...

లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి సరఫరా చేశారని.. జగన్ హయాంలో ఆ కాంట్రాక్టు ఇచ్చారని వెల్లడవడంతో ఇప్పటికే భక్త కోటి తీవ్ర ఆగ్రహంతో ఉంది. అసలీ అంశాన్ని తెరపైకి తెచ్చి సీఎం చంద్రబాబే పాపం చేశారని ఎదురుదాడికి దిగిన జగన్.. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపిచ్చారు. తాను కూడా తిరుమల పర్యటన తలపెట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టేందుకు హిందూసంఘాలు, స్వామీజీలు సమాయత్తమవుతున్నారు. సహజంగా సమాజంలోని ఏదైనా వర్గం నుంచి, మరీ ముఖ్యంగా ఆలయ సంప్రదాయాలకు సంబంధించి ఏవైనా డిమాండ్లు వస్తే రాజకీయ నేతలు సానుకూలంగా స్పందిస్తుంటారు. 2009లో జగన్ తిరుమల వెళ్లినప్పుడు వేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలు ఉన్నాయంటూ సంతకం చేశారు. అధికారంలో కొనసాగిన ఐదేళ్లలో అలాంటి డిక్లరేషన్ ఇవ్వలేదు. పైగా తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామికి పట్టువస్త్రాలు సమర్పించేందుకూ సతీసమేతంగా వెళ్లలేదు. ఎన్నికల ముందు తాడేపల్లి ప్యాలెస్‌లోనే 'ఆలయం సెట్టింగ్' వేసి, భక్తి రసం ప్రదర్శించారు. ఇప్పుడు.. లడ్డూ వివాదం నేపథ్యంలో తిరుమలకు వెళ్తున్నారు. ఆలయ నిబంధనల ప్రకారం ఆయన డిక్లరేషన్ ఇస్తే తప్పేంటని ఆయా సంఘాలతో పాటు పార్టీలు ప్రశ్నిస్తున్నాయి.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీతో పాటు పలువురు ఇతర దేశాల నేతలు కూడా డిక్లరేషన్‌పై సంతకం చేసిన తర్వాతే వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ విషయంలో వారెవరూ భేషజాలకు పోలేదు.

సీఎం హోదాలో జగన్ తిరుమల వచ్చినప్పుడు డిక్లరేషన్‌పై సంతకం చేయాలనే డిమాండ్లు వచ్చాయి. కానీ... ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన హిందువుల మత విశ్వాసాలను జగన్ ఏమాత్రం లెక్కచేయలేదనే విమర్శలున్నాయి.

బ్రహ్మోత్సవాల సమయంలో సీఎంగా ఉన్న నేత సతీసమేతంగా తిరుమలకు వెళ్లి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. సీఎంగా ఉన్న ఐదేళ్లలో జగన్ ఎన్నడూ ఈ సంప్రదాయాన్ని పాటించలేదు. ఆయన ఒక్కరే తిరుమలకు వెళ్లారు!

ఇవ్వడమే సమంజసం...

జగన్ తల్లి విజయలక్ష్మి గతంలో ఎన్నికల ప్రచారంలోను, విడిగా బైబిల్ పట్టుకుని తిరిగేవారు. జగన్, ఆయన భార్య భారతీరెడ్డి సహా కుటుంబం వైఎస్ జయంతి, వర్ధంతి సందర్భంగా వైఎస్ సమాధి వద్ద క్రైస్తవ మతానుసారం ప్రార్థనలు చేస్తారు. పులివెందుల చర్చికీ వెళ్తారు. పాస్టర్ల నుంచి ఆశీర్వాదాలు తీసుకుంటారు. వైఎస్ కుటుంబం క్రైస్తవాన్నే పాటిస్తోంది. అంటే... తిరుమల నిబంధనల ప్రకారం, వెంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లేముందు జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సిందే. సున్నితమైన అంశంపై జగన్ సానుకూలంగా స్పందిస్తే సమస్యే ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

జగన్ నుంచి డిక్లరేషన్ తీసుకోవడం టీటీడీ అధికారుల బాధ్యత

- ఇస్తారో లేదో ఆయన విచక్షణకు వదిలేయాలి
- దీనిపై కూటమి పార్టీలు మాట్లాడక్కర్లేదు: పవన్

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'తిరుమల యాత్రకు వెళ్తున్న వైఎస్ జగన్ నుంచి డిక్లరేషన్ తీసుకోవడం అనేది టీటీడీ అధికారుల బాధ్యత. ఈ విషయంపై కూటమి పక్షాలు ప్రత్యేకంగా మాట్లాడాల్సిన అవసరం లేదు. డిక్లరేషన్ ఇస్తారా.. లేదా? ఆలయ సంప్రదాయాలు, మర్యాదలు, నిబంధనలు పాటిస్తారా అనేది వెళ్లే వ్యక్తి విచక్షణకు వదిలేయాలి' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. తిరుమల ప్రసాదం అపవిత్రం కావడం, ఆలయ ఆచారాలకు భంగం వాటిల్లేలా టీటీడీ పాలక మండలి నిర్ణయాలు తీసుకోవడం అనేది హిందువుల అంతర్గత వ్యవహారమన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడతామని బాధ్యత తీసుకున్నవారే అందుకు విరుద్ధంగా వెళ్లినందున వారిని ప్రశ్నించాలని సూచించారు. తిరుమల మహాప్రసాదం లడ్డూ తయారీలో జంతు అవశేషాలు కలిపిన నెయ్యి సరఫరాకు అనుమతులు మంజూరు చేసిన టీటీడీ బోర్డు సభ్యులు బాధ్యత వహించాలని, వారిని నియమించిన వాళ్లు కూడా ఇందుకు బాధ్యులేనని ఓ ప్రకటనలో తెలిపారు. 'తిరుమల దర్శనానికి వెళ్లాలని నిర్ణయించుకున్న జగన్ మతాన్ని, ఆయన పర్యటనను లక్ష్యంగా చేసుకుని మాట్లాడాల్సిన సమయం ఇది కాదు. వ్యక్తులను, అన్య మతాలను లక్ష్యంగా చేసుకోవద్దు. తిరుమలలో ధర్మాన్ని కాపాడతామని బాధ్యత తీసుకున్నది నాటి ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డే. ఆ సమయంలో అక్కడ ఉన్నతాధికారిగా ఉన్న ధర్మారెడ్డి కూడా బాధ్యత వహించాలి. తిరుమల అపవిత్రంపై తొలుత ఈ ముగ్గురూ సమాధానం చెప్పాలి. ఆపై శిక్ష అనేది స్వామి చూసుకుంటాడు. వైసీపీ కోరుకుంటున్న గొడవలు మనం ఇవ్వవద్దు. మతాల మధ్య గొడవలు సృష్టించాలనే ఆలోచనల్లో ఉన్న వైసీపీ వ్యవహార శైలి పట్ల పోలీసు శాఖ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి' అని పవన్ విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్లలో అద్భుతాలు చేయొచ్చు!

- కాంగ్రెస్ మనుగడ రాష్ట్రానికెంతో అవసరం: షర్మిల



అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఐదేళ్ల కాలంలో అద్భుతాలు చేయొచ్చని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలో ఏపీసీసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రాజకీయంగా నిలబడటం, పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. అన్ని పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు ఉండేలా చూసుకోవాలని నేతలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మనుగడ రాష్ట్రానికెంతో అవసరమని చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణం జరగాలని వ్యాఖ్యానించారు. పార్టీలో పాత, కొత్త నాయకులందరినీ కలుపుకొని పోవాల్సి ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌పై ఉన్న వ్యతిరేకత వల్లే చంద్రబాబుకు ఓట్లుపడ్డాయని, కూటమిపై ప్రేమతో ప్రజలు ఓట్లు వేయలేదని చెప్పారు. చంద్రబాబు వద్దనుకున్నవాళ్ల ఓట్లు 38శాతంగా నమోదైందన్నారు. స్థానిక ఎన్నికలను కార్యకర్తలు సవాల్‌గా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పార్టీ విజయంపై అధిష్ఠానం ఫోకస్ పెట్టిందని, జాతీయ స్థాయిలో నేతలు రాష్ట్రానికి వస్తారని, వారినుంచి కూడా సపోర్టు ఉంటుందని, రాష్ట్ర సమస్యలపై ఢిల్లీ స్థాయిలో ఉద్యమాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయం అన్నారు. బీజేపీపై చంద్రబాబు, జగన్ మాట్లాడరని, ఒకరు అధికారికంగానూ, మరొకరు లాలూచీతోనూ బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. బీజేపీ చేసిన అన్యాయంపై అక్టోబరు 2న నిరసన చేపడదామన్నారు.

తిరుమలకే రానీయొద్దు!

- జగన్ ఉద్దేశించి తెలంగాణ బీజేపీ నేత మాధవీలత

తిరుపతి, సెప్టెంబరు 26: 'అసలా యప్పను తిరుమలకే రానీయొద్దు... పాప ప్రక్షాళన చేస్తారట.. చర్చిలోకి పోయి పాప ప్రక్షాళన చేసుకోమనండి' అని తెలంగాణ బీజేపీ నేత మాధవీలత ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి విషయంలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా గురువారం ఆమె కాలినడకన శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇతర మతస్థులు తాము హైందవ మతాన్ని నమ్ముతామని, వేంకటేశ్వరస్వామిని ఆరాధిస్తామని డిక్లరేషన్ ఇచ్చిన తర్వాతే తిరుమల ఆలయంలో ప్రవేశించాల్సి ఉందని, ఈ నిబంధనను జగన్ చిన్నాన్న, అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొలగించారని, అలా ఎలా రద్దు చేస్తారని ఆమె ప్రశ్నించారు. 18 సార్లు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేశామని జగన్ చెప్తున్నారు కదా... మరి చంద్రబాబు లాగా జగన్ అప్పుడే కల్తీ గురించి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా నిబంధనల మేరకే జగన్.. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, భక్తినిబట్టి గానీ, హిందూత్వాన్ని నమ్మి గానీ ఆయన శ్రీవారి వద్దకు వెళ్లలేదని చెప్పారు.

జగన్ గో బ్యాక్

(మొదటి పేజీ తరువాయి)

30 పోలీసు యాక్ట్‌ను విధించింది. ఆయన విమానం దిగే రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరి వరకు భారీఎత్తున బలగాలను మోహరించింది. శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం అప్పటి టీటీడీ పాలకవర్గం, జగన్‌ను పూర్తిగా ఆత్మరక్షణలో పడేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు శుక్రవారం రాత్రి తిరుపతి చేరుకోనున్నారు. అక్కడినుంచి తిరుమల వెళతారు. మరునాడు ఉదయం శ్రీవారిని దర్శించుకుని, మధ్యాహ్నం నుంచి బయలుదేరి బెంగళూరుకు వెళతారు. అయితే, తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ కొండకు రాకూడదంటూ బీజేపీ, హిందూ సంఘాలు హెచ్చరికలు జారీ చేశాయి. డిక్లరేషన్ ఇచ్చిన తర్వాతే తిరుమలలో స్వామిని దర్శించుకోవాలని కూటమి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనను అడ్డుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. 'జగన్.. మీరు మా తిరుమలకు రావొద్దు. వస్తే అడ్డుకుని తీరుతాం. మీ వాహనాలు మా సాధుసంతులు, హిందువుల శరీరాల పైనుంచి వెళ్లాల్సిందేతప్ప మిమ్మల్నైతే ఒక్క అడుగుకూడా ముందుకు వెళ్లనివ్వం' అని శ్రీనివాసానంద స్వామి స్పష్టం చేశారు. హిందూస్థాన్ పార్టీ వ్యవస్థాపకుడు తుమ్మ ఓంకార్ ఆధ్వర్యంలో పలువురు స్వామీజీలు తిరుపతిలోని గరుడ సర్కిల్‌వద్ద గురువారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'గో బ్యాక్ జగన్.. సేవ్ తిరుమల' నినాదాలతో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ.. 'క్రైస్తవుడైన జగన్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ తిరుమలకు అనుమతించం. ఐనప్పటికీ జగన్ తిరుమలకు వెళ్లాలని ప్రయత్నిస్తే మేముకూడా ఏ పరిస్థితులకైనా సిద్ధంగా ఉన్నాం. అడ్డుకుని తీరుతాం. శాంతి భద్రతల సమస్య తలెత్తితే జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏం జరిగినా మేము సిద్ధమే. మా హిందూ ధర్మానికి, వేంకటేశ్వర స్వామికి కళంకం తెచ్చిన, ప్రసాదాన్ని పాడుచేసిన, మా తిరుమల క్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా చేసిన జగన్మోహన్ రెడ్డిని ఒక్క అడుగుకూడా వెయ్యనివ్వం. మీ నిర్వాకంతో హిందువులందరం తీవ్రంగా గాయపడ్డాం. తిరుమలకు వస్తానంటూ మీరు మళ్లీ మమ్మల్ని రెచ్చగొట్టొద్దు. మా గాయాలపై కారం చల్లొద్దు' అని హితవుపలికారు. రాష్ట్రంలో 250కిపైగా ఆలయాలపై దాడులు జరిగినపుడు నాడు సీఎంగా జగన్ ఒక్క ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నించలేదని గుర్తుచేశారు. హిందువులకు ఊరట కలిగించేలా ఒక్కమాటన్నా మాట్లాడారా? అని ప్రశ్నించారు. మీరు కాకపోయినా కనీసం అప్పటి మీ మంత్రులు, ఇతర నేతలైనా మాట్లాడారా అంటూ మండిపడ్డారు. 'హిందువులను మోసం చేయడానికి మొన్న ప్రెస్‌మీట్ పెట్టారు. నెయ్యి కల్తీ తమకు తెలియకుండా జరిగిపోయిందన్నారు. ఇదంతా రాద్ధాంతం అన్నారు. హిందువుల గుండెలు మండుతున్నాయి. ఇంకా రెచ్చగొట్టొద్దు... బాధపెట్టొద్దు... మా తిరుమలకు రావొద్దు... ఐనా వస్తే ఖబడ్దార్' అని శ్రీనివాసానంద స్వామి హెచ్చరించారు. ఈ నిరసనలో గణేష్ స్వామి, జ్యోతి స్వామి, సనాతన పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కిరణ్, మాసుమయ్య తదితరులు పాల్గొన్నారు. ఇంకోవైపు జగన్ పర్యటన కోసం జిల్లా వైసీపీ నేతలు భారీ ఎత్తున జనసమీకరణకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఉద్రిక్త వాతావరణం నెలకుంది. జగన్ విమానం దిగే రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరి వరకు పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. జిల్లాలో గురు, శుక్రవారాల్లో పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తున్నట్టు ఎస్పీ ప్రకటించారు.

జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందే: పురందేశ్వరి

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళుతున్న మాజీ సీఎం జగన్.. టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇచ్చిన తర్వాతే ఆలయ ప్రవేశం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలో గురువారం ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఆలయ సంప్రదాయాలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మండిపడ్డారు.

డిక్లరేషన్ సంప్రదాయాన్ని పాటించాలి: లోకేశ్

శ్రీకాకుళం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'మనం ఏ మతానికి చెందిన వారమైనా అన్ని మతాలనూ గౌరవించాలి. మేం చర్చి, మసీదులకు వెళ్లినప్పుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటాం. తిరుమల వెళ్తానంటున్న జగన్.. డిక్లరేషన్ ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుంది. అలా కాదని దేవుడి జోలికి వెళ్తే ఏమైందో గత ఎన్నికల్లో ఏం జరిగిందో తెలుసు కదా' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'తిరుమల లడ్డూ నాణ్యతా లోపంతో పాటు పలు సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో నా దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చాక టీటీడీని ప్రక్షాళన చేయాలని ఈవోకు చెప్పాం. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవీ సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు?. తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి' అన్నారు.

నష్టనివారణకే యాత్ర నాటకం: విజయ్‌కుమార్

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంలో తనకు చెడ్డపేరు రావడంతో నష్టనివారణలో భాగంగా జగన్ కొత్తగా కాలినడకన తిరుమలకు అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. జగన్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఈ 15 ఏళ్లలో ఎప్పుడూ తిరుమల ఆలయ నిబంధనలకు అనుగుణంగా డిక్లరేషన్ ఫారంలో సంతకం చేయలేదని ఒక ప్రకటనలో తెలిపారు. 'తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై ఏ విచారణకైనా సిద్ధమని చెబుతున్న జగన్... ఆయన బృందం విజిలెన్స్ విచారణ ఆపాలని కోర్టుకు ఎందుకు వెళ్తున్నారు?' అని కడప టీడీపీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టుకు వెళ్లి లడ్డూ కల్తీపై ఎవరూ మాట్లాడకుండా ఆర్డర్ తెచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారు. సిట్‌ను వ్యతిరేకించడంలోనే ఆయన అపరాధ భావన కనిపిస్తోంది. లడ్డూ కల్తీపై దేశ ప్రజలంతా బాధపడుతుంటే వైసీపీ నేతల్లో అటువంటి పశ్చాత్తాపమే లేదు, రోజుకో నాటకానికి తెరదీస్తున్నారు' అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెడ్ బుక్ అమలు మొదలైంది!

- ఐపీఎస్‌లు సస్పెండయ్యారు కూడా: లోకేశ్
- శ్రీకాకుళంలో పర్యటన.. విశాఖలో ప్రజాదర్బార్



శ్రీకాకుళంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం/శ్రీకాకుళం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెడ్‌బుక్ అమలు ఇప్పటికే ప్రారంభమైందని ఐటీ, మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినవారికి శిక్ష తప్పదంటూ తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిని వదిలేది లేదని.. ఇందులో భాగంగా ఐపీఎస్‌లు కూడా సస్పెండ్ అయ్యారని గుర్తుచేశారు. గురువారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 వరకు ప్రజల వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే కారణంతో జగన్ సర్కారు ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా నిలిపివేసిందని, ఆ బకాయిలను విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల వేదిక ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, వైసీపీ హయాంలో జరిగిన దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని అభ్యర్థించారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులకు 4సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు రిటైరైన వారికి రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కరోనాతో మృతిచెందిన వారికి పరిహారం అందించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ-2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వారందరికీ హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, నేతలతో లోకేశ్ వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, కోండ్రు మురళీ మోహన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

కల్లు తీసుకురాలేదా?

పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను కల్లు గీత కార్మికులు కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వారితో ఫొటోలు దిగారు. కల్లు తీసుకురాలేదా అని సరదాగా అడిగారు. గీత కార్మికులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి లోకేశ్

సింహాచలం, సెప్టెంబరు 26: మంత్రి లోకేశ్ గురువారం ఉదయం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు వైదికులతో కలిసి పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం బేడా మండపానికి లోకేశ్ ప్రదక్షిణ చేశారు. ఆయన గోత్రనామాలతో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తర్వాత ఆలయ పండితులు లోకేశ్‌ను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ బేడా మండపంలోని స్తంభాలపై ఉన్న 32 నారసింహ రూపాలతో ఉన్న పుస్తకాన్ని, చిత్రపటాన్ని లోకేశ్‌కు ఈవో అందజేసి శాలువాతో సత్కరించారు.



గురువారం అమరావతి సచివాలయంలో రూ.10 లక్షల విరాళం చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న సత్య ఏజెన్సీ ప్రతినిధులు

సీఎంఆర్‌ఎఫ్‌కు దాతల విరాళాలు

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు ఎందరో దాతలు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇస్తున్నారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును పలువురు దాతలు కలిసి, విరాళాల చెక్కులు అందజేశారు. నందమూరి సంధ్యారాణి రూ.5.25లక్షలు, హైదరాబాద్ ఎయిమ్స్ హాస్పటల్స్ డైరెక్టర్ వి.నాగమల్లేశ్వరరావు రూ.5లక్షలు, బొల్లినేని కీర్తి రూ.3.50లక్షలు, పాండురంగారావు రూ.2.50లక్షలు, డి.శ్రీనివాసరావు రూ.లక్షా66వేలు, డాక్టర్ బుచ్చిరామయ్య రూ.లక్ష, ఆర్.కొండలరావు రూ.లక్ష, ఎస్.హరినాథరెడ్డి రూ.50వేలు అందజేశారు.

మరో 7 ఎస్సీ ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు!

- రాష్ట్రంలో ఏర్పాటుకు కూటమి సర్కారు నిర్ణయం
- ఇప్పటికే ఉన్న మూడు సెంటర్లతో సత్ఫలితాలు
- గతేడాది నీట్ రాసిన 173 మందిలో 134 మంది అర్హత
- బుక్‌బ్యాంక్ పథకాన్నీ పునరుద్ధరించే యోచన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు సత్ఫలితాలిస్తుండటంతో ప్రభుత్వం మరో ఏడు కేంద్రాలను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే చిన్నటేకూరు, ఈడ్పుగల్లు, అడవితక్కెళ్లపాడుల్లోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఐఐటీ-నీట్ శిక్షణ అందిస్తున్నారు. వైసీపీ హయాంలో గురుకులాలను గాలికొదిలేసినా.. ఈ గురుకులాల్లోని ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లను ప్రిన్సిపాళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తుండటంతో కొంత మేర సత్ఫలితాలిస్తున్నాయంటున్నారు. అందుకే మరో 7 ఉమ్మడి జిల్లాల్లో ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పోటీగా దళిత విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లను సాధించేలా సామర్థ్యం పెంచాలని కూటమి సర్కార్ యోచిస్తోంది. ఆ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కార్యదర్శి కన్నబాబు, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ ఇప్పటికే ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపారు. సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత ఏడు కేంద్రాల్లో శిక్షణ ప్రారంభిస్తారు. సింగరాయకొండలో మొదట పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మొదట 80 మంది విద్యార్థులకు ఈ ఏడాదిలో శిక్షణ ఇచ్చి, అనంతరం 160 మందికి కోచింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఉన్న మూడు శిక్షణ కేంద్రాల్లో గతేడాది 173 మంది ఎస్సీ విద్యార్థులు శిక్షణ పొంది నీట్ పరీక్షలు రాస్తే అందులో 134 మంది అర్హత సాధించారు. వారిలో 40 మంది మొదటి ఫేజ్‌లోనే ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ స్ఫూర్తితోనే మరో 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోని దళిత విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలను కల్పించాలని నిర్ణయించారు. దీంతోపాటు గతంలో ఉన్న బుక్‌బ్యాంక్ పథకాన్ని కూడా కూటమి సర్కార్ పునః ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఎంబీబీఎస్ చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బుక్‌బ్యాంక్ పథకం ద్వారా పుస్తకాలు కొనుగోలు చేసి ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకానికీ స్వస్తి పలికారు. ఆ పథకాన్ని పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

జాతీయ క్రీడలకు బీ రెడీ

- 2027లో రాష్ట్రంలో నిర్వహణకు సిద్ధం కావాలి
- తదనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన
- అమరావతిలో అతిపెద్ద స్టేడియం నిర్మాణం
- స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల పూర్తికి చర్యలు
- శాప్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62కు పెంపు
- త్వరలోనే రాష్ట్రంలో క్రీడలకు నూతన పాలసీ
- స్పోర్ట్స్ హబ్‌గా తిరుపతి, అమరావతి, విశాఖ
- క్రీడాశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు


యువజన, క్రీడా వ్యవహారాల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి తదితరులు

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడా రంగానికి తిరిగి ప్రోత్సాహం అందించాలని, 2027లో జరిగే జాతీయ క్రీడలను మన రాష్ట్రంలో నిర్వహించే లక్ష్యంతో సిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు పిలుపునిచ్చారు. యువజన సర్వీసులు, క్రీడల శాఖపై సచివాలయంలో సీఎం చంద్రబాబు గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిలో క్రీడలకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుందని అన్నారు. అమరావతిలో అతిపెద్ద క్రీడా స్టేడియం నిర్మాణం చేపడతామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు ఆయన అంగీకరించారు. అందరికీ అందుబాటులో ఉండేలా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామ స్థాయిలో ఆటల మైదానాలు, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, జిల్లా స్థాయిలో క్రీడాభివృద్ధి సంస్థలు, రాష్ట్ర స్థాయిలో హై పెర్ఫామెన్స్ సెంటర్లు, అకాడమీలు ఏర్పాటు చేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చామని చెప్పారు. తాము స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడితే.. వైసీపీ సర్కారు అన్ని పనులూ నిలిపివేసిందని అన్నారు. నాడు ప్రారంభమై కొంతమేర పూర్తయిన వాటి నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన 35 క్రీడా వికాస కేంద్రాల పూర్తికి రూ.23 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ముందుకొస్తే, వాటికి వారి పేర్లు పెట్టుకునే అవకాశం కల్పించాలన్నారు. 2017లో రూపొందించిన క్రీడాపాలసీ 2022లో ముగిసినా వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీ రూపకల్పనపై చొరవ చూపలేదన్నారు. త్వరలోనే నూతన క్రీడా పాలసీని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పతకాల సాధనలో ఏపీ వెనుకబడి ఉందని, ఈ విషయంపై ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. తిరుపతి, అమరావతి, వైజాగ్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన ప్రాజెక్ట్ గాండీవ, పాంచజన్య, విజయ, స్పోర్ట్స్ నర్సరీస్ కార్యక్రమాలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని స్టేడియాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో క్రీడా అకాడమీల ఏర్పాటుకు స్థలాలు పొందిన వారితో సంప్రదింపులు జరిపి వెంటనే వాటి ఏర్పాటు పూర్తి చేసేలా చూడాలన్నారు. వారు ఆసక్తి చూపకపోతే కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర సచివాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా చిన్నపాటి స్పోర్ట్స్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ల కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్పోర్ట్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. పోలీస్, యూనివర్సిటీ, ప్రైవేటు విద్యా సంస్థల గ్రౌండ్స్‌ను సామాన్య ప్రజలకు నిర్దేసిత సమయం వరకూ అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'హైబ్రిడ్' ఉద్యోగాలకు ప్రాధాన్యం

- నైపుణ్యాలు పెంపొందిస్తే ప్రైవేటులో భారీగా ఉపాధి అవకాశాలు: సీఎం

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో నైపుణ్య శిక్షణ, సెర్ప్ ఎంఎస్ఎంఈ, పరిశ్రమల శాఖల అధికారులు, పారిశ్రామిక రంగ నిపుణులతో సమావేశమయ్యారు. హైబ్రిడ్ విధానంలో ఇంటి వద్ద నుంచే పనిచేసే ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. బహుళజాతి కంపెనీలతో నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ కారణాలతో గ్రామాల్లో ఉండిపోయినవారికి తగిన అవకాశాలు కల్పిస్తే మంచి ఫలితాలొస్తాయని.. ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తలు కలిసి ఈ దిశగా పనిచేయాలని కోరారు. విజయవాడ వరదలో సర్వం కోల్పోయిన బాధితులు తమకు ఉపాధి కల్పించాలని కోరారని, వారికి ఎలాంటి ఉపాధి కల్పించవచ్చో పరిశీలనచేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

అమరావతి చల్లచల్లగా..!

- రాజధానిలో పర్యావరణ హిత డిస్ట్రిక్ట్ కూలింగ్ ప్లాంట్లు
- ప్రభుత్వ భవనాలకు 20వేల ఆర్‌టీ శీతలీకరణ వ్యవస్థ
- ఇవి పర్యావరణ హితం.. ఏసీ, విద్యుత్ బిల్లులూ ఆదా
- తబ్రీడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ వెల్లడి


శీతలీకరణ వ్యవస్థ నమూనాతో తబ్రీడ్, గిజ్ సంస్థల ప్రతినిధులు సుధీర్, పీయూష్

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువే..! 2024లో దక్షిణ భారతంలోనే అత్యధికంగా 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత ఇక్కడే నమోదైంది. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఏపీ రాజధాని అమరావతిపైనా ఉంది. ఈ నేపథ్యంలో అమరావతిలో శాశ్వత ప్రాతిపదికన నిర్మించే సచివాలయ టవర్లు, హైకోర్టు, ఇతర ప్రభుత్వ భవనాలను చల్లగా ఉంచడానికి శీతలీకరణ వ్యవస్థ అవసరం. దీనికోసం ప్రభుత్వ భవనాలకు ప్రత్యామ్నాయ శీతలీకరణ వ్యవస్థ ఏర్పాటు, వాటి నిర్వహణ వ్యయం తగ్గించేందుకు తాము రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని తబ్రీడ్ సంస్థ తెలిపింది. ఈ మేరకు 2015-16లోనే 30 ఏళ్ల కాలానికి ఒప్పందం కుదిరిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ పేర్ల వెల్లడించారు. అమరావతిలో పర్యావరణ హితమైన డిస్ట్రిక్ట్ కూలింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకే ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో తబ్రీడ్, గిజ్ సంస్థల నేతృత్వంలో గురువారం రీజనల్ వర్క్‌షాప్ జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సుధీర్ మాట్లాడుతూ... శాశ్వత ప్రాతిపదికన నిర్మించే సచివాలయ టవర్లు, హైకోర్టు ఇతర ప్రభుత్వ భవనాలకు సంబంధించిన శీతలీకరణ వ్యవస్థను తమ సంస్థ నిర్వహిస్తుందని చెప్పారు. ఈ ప్రత్యామ్నాయ శీతలీకరణ వ్యవస్థ వల్ల సెంట్రలైజ్డ్ ఏసీకి అయ్యే వ్యయంలో 20 శాతం, విద్యుత్ బిల్లుల వ్యయంలో 50 నుంచి 60 శాతం వరకు ఆదా చేసుకోవచ్చన్నారు. దీనికోసం తాము డిస్ట్రిక్ట్ కూలింగ్ ప్లాంట్లను ఏర్పాటుచేసి, వాటి ద్వారా ఆయా భవనాలకు చల్లదనాన్ని అందిస్తామని చెప్పారు. అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్సుకు 20 వేల రిఫ్రిజిరేషన్ టన్ను (ఆర్‌టీ)ల శీతలీకరణ వ్యవస్థను అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో గిజ్ సంస్థకు చెందిన పీయూష్ శర్మ పాల్గొన్నారు.

పోలీసు విచారణకు 10 మంది వైసీపీ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంపై గతంలో జరిగిన దాడి కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. దాడికి పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న 10మంది వైసీపీ నేతలను గురువారం విచారణకు పిలిపించారు. మంగళగిరి-తెనాలి రోడ్డులోని గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ కార్యాలయానికి మధ్యాహ్నం 12గంటలకు వైసీపీ నేతలు చేరుకున్నారు. వీరిలో నలుగురు తమ పాస్‌పోర్టులను డీఎస్పీకి సరెండర్ చేశారు. దర్యాప్తు అధికారి డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ఒక్కొక్కరినీ విచారించారు. రాత్రి 9గంటలు దాటిన తరువాత కూడా విచారణ కొనసాగడంతో వైసీపీ నేతల కుటుంబ సభ్యులు, అనుచరులు డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సీసీ కెమెరాలన్నీ ఆర్టీజీఎస్‌తో అనుసంధానం

» హోం శాఖకు సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని సీసీ కెమెరాలను సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీఎస్) వ్యవస్థతో అనుసంధానం చేయాలని హోంశాఖను సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలపై గురువారం ఆయన సమీక్షించారు. పంచాయతీరాజ్, హోం, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక, గిరిజన, బీసీ, మహిళా శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల శాఖతో పాటు గృహ నిర్మాణం, వ్యవసాయం, వైద్యారోగ్య, మత్స్యశాఖలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయా పథకాల అమలు తీరును, ప్రగతిని సమీక్షించారు. 2023-24, 2024-25లో ఇప్పటి వరకూ నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా, కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన నిధులపై చర్చించారు. ఇప్పటి వరకూ నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి సవివరమైన నివేదికను సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

నందిగం సురేశ్ బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై ముూకదాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ విచారణకు సహకరించడం లేదని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. కేసు డైరీ సైతం కోర్టు ముందుంచేందుకు సమయం కావాలన్నారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్ విచారణను అక్టోబరు 1కి వాయిదా వేశారు. గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నందిగం సురేశ్ బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషనర్ పోలీస్ కస్టడీ ముగిసిందన్నారు. ఈ కేసులో కొందరికి బెయిల్ మంజూరు చేశారని తెలిపారు. ఈ పిటిషన్‌ను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ సానుభూతిపరుడు అవుతు శ్రీనివాసరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణను కూడా న్యాయస్థానం 1కి వాయిదా వేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపించారు.

కస్టడీ పిటిషన్‌పై విచారణకు ఒత్తిడి చేయొద్దు

» ట్రయల్ కోర్టు పీపీకి సూచించండి: హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కుక్కల విద్యాసాగర్‌ను కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కోసం సంబంధిత కోర్టును ఒత్తిడి చేయవద్దని పీపీకి సూచించాలని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులకు సమయం ఇస్తూ విచారణను అక్టోబరు 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత పిటిషన్ తేలేవరకు ట్రయల్ కోర్టులో ఉన్న కస్టడీ పిటిషన్‌ను విచారించాలని బలవంతం చేయకుండా సంబంధిత కోర్టు పీపీకి సూచించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు ఇచ్చారు. సినీ నటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో తనకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా విద్యాసాగర్ తరఫున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ.... తాము హైకోర్టులో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించే వరకు పోలీస్ కస్టడీకి పిటిషన్‌పై విచారణను తాత్కాలికంగా వాయిదావేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ... కేసుకి సంబంధించి సవివరంగా కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని, అందుకు సమయం ఇవ్వాలని కోరారు. కాగా, సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసు దర్యాప్తునకు సహకరించాలని విజయవాడ వెస్ట్ జోన్ అప్పటి ఏసీపీ హనుమంతురావును హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుత పిటిషన్‌ను ఇదే వ్యవహారంతో ముడిపడిన ఇతర వ్యాజ్యాలతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది. అప్పటివరకు హనుమంతురావుపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీ.ఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

'పర్యాటకం' వైసీపీ పరం

» ఆస్తులు, ప్రాజెక్టులన్నీ ఆ పార్టీ నేతల చేతుల్లోనే

» విశాఖ, బెజవాడ, తిరుపతిలోనూ స్వాహా

» అస్తవ్యస్త విధానాలతో ఏపీటీడీసీ అప్పులపాలు

» నేడు టూరిజం డే...
కూటమి సర్కార్ గాడిన పెట్టేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పర్యాటకాన్ని సర్వనాశనం చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆస్తులను గత పాలకులు తమ సొంత ఆస్తులుగా మార్చేసుకున్నారు. వందల కోట్ల విలువైన పర్యాటక హోటళ్లు, ఇతర ప్రాజెక్టులను తమ పరం చేసుకున్నారు. కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొట్టడంతో పాటు పర్యాటక శాఖపై కోట్లలో అప్పుల భారం మోపారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. వైసీపీ పాలనలో పర్యాటక శాఖ పదేళ్ల వెనక్కి వెళ్లిపోయింది. పూర్తిగా దెబ్బతిన్న పర్యాటక శాఖకు పూర్వవైభవం తీసుకురావడం ఇప్పుడిప్పుడే సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పర్యాటక శాఖలో జరిగిన అక్రమాలు, అవినీతి, నిబంధనల ఉల్లంఘనలు అన్నీ ఇన్నీ కావు. రుషికొండ మొదలుకుని ప్రతి ప్రాజెక్టును నాశనం చేశారు. రుషికొండ ద్వారా ఏపీటీడీసీ (ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ)కి ప్రతి నెల రెండు కోట్ల ఆదాయం వచ్చేది. ఏడాదికి దాదాపు రూ.20 కోట్లు. నాటి ముఖ్యమంత్రి జగన్ కన్ను రుషికొండపై పడటంతో పర్యాటక ఆదాయానికి గండి పడింది. నిబంధనలు ఉల్లంఘించి తన సొంత అవసరాల కోసం ప్రభుత్వ నిధులు రూ.500 కోట్లు పెట్టి పెద్ద ప్యాలెస్ కట్టించారు. ఇందుకోసం పాత భవనాలను కూలగొట్టడంతో పాటు పర్యాటక ఆదాయానికి దాదాపు రూ.80 కోట్ల వరకూ నష్టం చేకూర్చారు. ప్యాలెస్‌కు విలాసవంతమైన ఫర్నీచర్, ఇతర వస్తువుల కొనుగోలుకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అత్యాధునిక హంగులతో 500 కోట్ల ఖర్చుతో రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించారు. ఇప్పుడు ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో తెలియక ప్రభుత్వం తలలు పట్టుకుంటోంది. పర్యాటక హోటల్‌గా మార్చుదామంటే వైసీపీ ప్రభుత్వం చేసిన ఖర్చుకు, వచ్చే ఆదాయానికి పొంతన ఉండదు. రూ.500 కోట్లు పెట్టి కట్టిన ప్యాలెస్‌కు భారీస్థాయిలో ఆదాయం ప్రభుత్వానికి రావాలి. కానీ ఇప్పుడు రుషికొండలోని రూమ్‌లు ఆ స్థాయిలో అద్దెలకు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో రుషికొండ విషయంలో ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

పర్యాటక ఆస్తుల స్వాహా

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక శాఖకు వందల కోట్ల విలువైన ఆస్తులున్నాయి. హోటళ్లు, బోటింగ్ యూనిట్లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిలో మెజార్టీ వాటా వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయింది. గత ప్రభుత్వంలో పర్యాటక ప్రాజెక్టులు మొత్తం పీపీపీ పద్ధతిలో ప్రైవేటు పరం చేశారు. వీటిపై కన్నేసిన వైసీపీ నేతలు మరొకరికి చాన్స్ ఇవ్వకుండా దౌర్జన్యాలు చేసి మరీ లాక్కున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, విజయవాడ లాంటి చోట్ల ఉన్న ప్రాజెక్టులు వాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

అవినాశ్ బంధువు కోసం...

ప్రభుత్వ భూములను తీసుకుని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే కానీ ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అయితే కొన్ని జిల్లాల్లో వైసీపీ నేతలకు, వారి బంధువులకు మేళ్లు చేయడానికి గత ప్రభుత్వంలో పర్యాటక శాఖ ప్రైవేటు వ్యక్తుల దగ్గర నుంచి భూములు కొనుగోలు చేసింది. పులివెందులలో విజయ హోమ్స్ నుంచి ఏపీటీడీసీ రూ.13 కోట్లకు ఎకరం స్థలం కొనుగోలు చేసింది. విజయ హోమ్స్ యజమాని ఎంపీ అవినాశ్ రెడ్డికి బంధువు. ఈ ఎకరం స్థలంలో ఫోర్ స్టార్ హోటల్ కట్టాలన్న ప్లాన్ కూడా గత ప్రభుత్వం వేసింది. హోటల్ నిర్మాణం కోసం పులివెందుల డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.20 కోట్లను కేటాయించారు. అవినాశ్ బంధువు వెంచర్ విలువ పెంచుకునేందుకు ఏపీటీడీసీ నుంచి భూమి కొనుగోలు చేయించి, అందులో ఫోర్ స్టార్ హోటల్ నిర్మించేలా స్కెచ్ చేశారు. హోటల్ కట్టిన తర్వాత తిరిగి దానిని పీపీపీ ద్వారా ప్రైవేటు వ్యక్తికి ఇవ్వాలని గత ప్రభుత్వం ప్లాన్ వేసింది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. ఇలా చాలా ప్రాజెక్టులను కొట్టేయాలనే ఆలోచన చేశారు.

ఏపీటీడీసీ అప్పులపాలు

గతంలో పర్యాటక శాఖలో ఆదాయం తప్ప, అప్పుల ప్రస్తావన లేదు. ఏటా ఏపీటీడీసీకి ఆదాయం వచ్చినా, నష్టం వచ్చినా ఎలాగోలా నడిపించేశారు. కానీ తొలిసారిగా వైసీపీ ప్రభుత్వం ఏపీటీడీసీని అప్పులపాలు చేసింది. పర్యాటక హోటళ్లను తాకట్టు పెట్టి దాదాపు రూ.150 కోట్ల రుణాలకు బ్యాంక్‌లతో అగ్రిమెంట్ చేసుకుంది. 15 హోటళ్లలో రినోవేషన్ పనుల పేరుతో ఏపీటీడీసీని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవైపు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపాయి. కొన్ని హోటళ్లలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. ఇప్పుడు ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్తుందో లేదో తెలియదు. పైగా హోటళ్లలో రినోవేషన్ పనుల వల్ల ప్రతి నెలా ఏపీటీడీసీకి దాదాపు రూ.5 కోట్లు నష్టం వస్తుంది. ఈ ఏడాది జనవరి నుంచి హోటళ్లలో బుకింగ్స్ మొత్తం నిలిపివేశారు. తొమ్మిది నెలల నుంచి ఏపీటీడీసీకి ఆదాయం పడిపోయింది. నెలకు రూ.5 కోట్లు చొప్పున ఇప్పటి వరకు రూ.50 కోట్ల నష్టం వచ్చింది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పర్యాటక శాఖకు తగిన నిధులు కేటాయిస్తే తప్ప పూర్వవైభవం వచ్చే పరిస్థితి లేదు. శుక్రవారం అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయబోతున్నారన్న దానిపై పర్యాటకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఉపాధి లేబర్ బడ్జెట్‌కు కార్యాచరణ

» 2025-26 ప్రణాళికలకు మార్గదర్శకాలు విడుదల

» నేడు క్షేత్రస్థాయి సిబ్బందితో డైరెక్టర్ వీసీ

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో లేబర్ బడ్జెట్ రూపకల్పనకు గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు రూపొందించింది. అక్టోబరులో ప్రారంభించే లేబర్ బడ్జెట్ రూపకల్పన కోసం డైరెక్టర్ కృష్ణతేజ ఇప్పటికే అధికారులను సమాయత్తం చేశారు. ఈ ప్రక్రియను అక్టోబరు 2న ప్రారంభించి నవంబరు 30లోగా పూర్తి చేయనున్నారు. ఇందులో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో టెక్నికల్ అసిస్టెంట్/బేర్‌ఫుట్ టెక్నీషియన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు గ్రామ సమాఖ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఆయా శాఖల ప్రతినిధులతో బృందాలను ఏర్పాటు చేస్తారు. ఈ బృందాలు రూపొందించే ప్రణాళికలను ఆయా ఏపీడీ లేక ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు పర్యవేక్షిస్తారు. ఎంపీడీఓలు ఈ ప్రణాళికలకు తుదిరూపమిస్తారు. పంచాయతీలో ఉపాధి హామీ కార్మికుల సంఖ్యను బట్టి 3-4 రోజులు పాటు లేబర్ బడ్జెట్ కోసం పని చేస్తారు. ఈ ప్రక్రియ చేపట్టే ముందు ప్రజాప్రతినిధులు, రైతులు, శ్రమశక్తి సంఘాలు, మేట్లు, ఎన్జీఓలకు సమాచారమివ్వాలని మార్గదర్శకాల్లో సూచించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభలో ఉపాధి హామీ పథకంలో గత ఏడాది విజయాలతో పాటు చట్టంలో కూలీలకు ఉన్న హక్కులు, స్కీమ్‌తో ఆస్తుల కల్పనపై వివరిస్తారు. అసంపూర్తి పనులు, షెల్ఫ్‌ప్రాజెక్టులు, జాబ్‌కార్డుల అప్‌డేషన్, సిటిజన్ సమాచార బోర్డు, పంచాయతీల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్ ద్వారా తీసుకున్న చర్యలపై సమీక్షిస్తారు.

వ్యవసాయం, అనుబంధ రంగాలకే మేజర్..

ఉత్పాదక పనులైన వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన 60 శాతం పనులు చేపట్టాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత రైతుల పొలాల పనులు, వ్యవసాయ అనుబంధ రంగాల ఉమ్మడి పనులు, గ్రామ ఉమ్మడి పనులకు సంబంధించి సహజ వనరుల నిర్వహణ, ఉమ్మడి ఆస్తుల అభివృద్ధికి సంబంధించిన పనులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. భూ అభివృద్ధి, గట్లు అభివృద్ధి, లెవలింగ్, బావిలు, ఫారం పాండ్స్, చెక్ డ్యాంలు, నీటి సంరక్షణ పనులు, ఉద్యానవన పంటలు, సెరికల్చర్, వెదురు, రబ్బరు, కొబ్బరి మొక్కల పెంపకం, వర్మి కంపోస్టు తదితర పనులతో పాటు, వ్యవసాయ ఉత్పత్తుల గోడౌన్లు, మట్టి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఎర్త్‌డ్యాం, చెక్‌డ్యాం, కాంటూర్ ట్రెంచ్, కాంటూర్ బండ్స్ రాతికట్టల నిర్మాణాలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, అన్ని రకాల ప్లాంటేషన్లు చేపట్టాలన్నారు. అక్టోబరు 2న గ్రామసభ నిర్వహించి, 20కల్లా ప్రస్తుతమున్న షెల్ఫ్ వర్క్‌ను పరిశీలించాలని, నవంబరు 10 లోపు ఫీల్డ్‌వర్క్, పనుల గుర్తింపు పూర్తి చేయాలని, 18కల్లా గ్రామసభ, గ్రామ పంచాయతీల ఆమోదం పూర్తి చేసుకుని లేబర్ బడ్జెట్‌ను అప్‌లోడ్ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. నవంబరు 30కల్లా మండల ప్రణాళిక పూర్తి చేసి, డిసెంబర్ 15కల్లా జిల్లా పరిషత్‌ల ఆమోదం, డిసెంబర్ 31 కల్లా గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ఆమోదం పూర్తై కలెక్టర్ల నుంచి పనులు మంజూరు కావాలని షెడ్యూల్ ప్రకటించారు. ఈ ఏడాది కూడా 25 కోట్ల పనిదినాల కోసం లేబర్ బడ్జెట్ రూపకల్పన చేయనున్నట్లు సమాచారం.

పురుషులకూ రక్షణ చట్టాలు అవసరం

» సైబర్ నేరాల్లో బందీలవుతున్నారు..
తెలుగు రాష్ట్రాల్లోనూ బాధితులు

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి

» 'ఆంధ్రజ్యోతి'తో ప్రజ్వల హోం
వ్యవస్థాపకురాలు సునీతా కృష్ణన్



విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళలకే కాకుండా పురుషులకూ రక్షణ చట్టాలు రూపొందించాల్సిన అవసరముందని ప్రజ్వల హోం వ్యవస్థాపకురాలు సునీత కృష్ణన్ అభిప్రాయపడ్డారు. యూఎస్ కాన్సులేట్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం 'నేషనల్ కన్సల్టేషన్ ఆన్ కౌంటరింగ్ సైబర్ ఎనాబుల్డ్ హ్యూమన్ ట్రాఫికింగ్' అనే అంశంపై విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన సునీతా కృష్ణన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'సైబర్ నేరాలతో మానవ అక్రమ రవాణా ముఖం మార్చుకుంటోంది. సైబర్ నేరాల్లో పురుషులు బందీలవుతున్నారు. పురుషులను బలవంతంగా ఇక్కడి నుంచి విదేశాలకు తీసుకెళ్లి సైబర్ నేరాల కాల్‌సెంటర్లలో పనిచేయిస్తున్నారు. వాళ్లు అక్కడి నుంచి బయటికి రావడానికి పెద్దమొత్తాల్లో చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు తెలంగాణ, ఏపీలో బయటపడ్డాయి. అందుకే చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరముంది. పురుషుల భద్రతకు పటిష్ట చట్టాలను రూపొందించాల్సిన అవసరముంది. టెక్నాలజీతో జరిగే సైబర్ నేరాలకు చట్టంలో సరైన సెక్షన్లు లేవు. పురుషులను బలవంతంగా దేశాలు దాటిస్తుంటే దాన్ని అక్రమరవాణా దర్యాప్తు సంస్థలు గుర్తించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షలు పడేలా చట్టాలను రూపొందించాల్సిన ఆవశ్యకత ఉంది' అని అన్నారు. అదేవిధంగా ఈ కేసులకు సంబంధించిన శాఖల అధికారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి అందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొనకళ్లకు ఎన్ఎంయూ అభినందనలు



బస్టేషన్, సెప్టెంబరు 26: ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును గురువారం ఎన్ఎంయూ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎంయూకు మచిలీపట్నం డిపో గౌరవాధ్యక్షుడిగా కొనకళ్ల నారాయణ పనిచేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఆర్టీసీ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కృష్ణాజిల్లా ఎన్ఎంయూఏ గౌరవాధ్యక్షుడు మండవ ప్రసాద్, కృష్ణాజిల్లా చైర్మన్ నాంచారయ్య, డిపో కార్యదర్శి మదన్, కిరణ్ సహా జోనల్ జిల్లా డిపో నేతలు నారాయణకు మహాగజమాల సమర్పించి దుశ్శాలువాతో సత్కరించారు.

ఆర్టీసీకి గవర్నెన్స్ 9 పీఎస్‌యూ ఐటీ అవార్డు



ఏపీఎస్‌ఆర్టీసీకి 2024 సంవత్సరానికి గాను గవర్నెన్స్ 9 పీఎస్‌యూ ఐటీ అవార్డు దక్కింది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగితరహిత టిక్కెట్ల జారీ సౌలభ్యాన్ని ప్రవేశపెట్టడం, బస్సుల్లో డిజిటల్ టిక్కెట్ల జారీ, అన్ని బస్సుల్లో ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాట్లకుగాను ఈ అవార్డు లభించింది. గురువారం ఢిల్లీలోని హోటల్ ఆల్‌డే ఇన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో సంస్థ ఎండీ ద్వారకాతిరుమలరావు తరఫున ఐటీ చీఫ్ ఇంజనీర్ వి.సుధాకర్ ఈ అవార్డును అందుకున్నారు.

301 బస్సు సర్వీసును అమరావతి వరకు నడపాలి



వన్‌టౌన్: 301 బస్సు సర్వీసును నగరం నుంచి అమరావతి వరకు పూర్తిగా నడపాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం బస్టేషన్‌లో ఆయన ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు పెద్దమద్దూరు వంతెన వరకు వచ్చి తిరిగి వెళుతున్నాయన్నారు. రెండు రోజుల నుంచి వంతెనకు అవతల వైపు నుంచి ఆర్టీసీ అధికారులు షటిల్ సర్వీసులను నడుపుతున్నారని దీంతో వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందిగా ఉందని ఆయన తెలిపారు. 301 సర్వీసును అమరావతి వరకు పూర్తిగా నడపాలన్నారు. అలాగే పల్నాడు జిల్లా రహదారులు భవనాలు శాఖ ఎస్ఈ బ్రిడ్జిని తక్షణం తనిఖీ చేసి ఫిట్‌మెంట్ సర్టిఫికెట్ ఇస్తే బస్సులు నడిపేందుకు అవకాశం ఉంటుందన్నారు.



స్వర్ణం గెలుచుకున్న రైల్వే డివిజన్ క్రీడాకారులు

ఆర్చరీలో డివిజినల్ రైల్వే జట్టుకు స్వర్ణం

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 26: చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన 14వ ఆలిండియా రైల్వే ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో రైల్వే డివిజన్ జట్టు బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. డివిజన్‌కు చెందిన పర్సనల్ బ్రాంచ్ ఆఫీస్ సూపరింటెండెంట్ వై.చరణ్ రెడ్డి, ఎలక్ట్రికల్ ట్రైన్ లైటింగ్ హెల్పర్ జి.బాజీ నాగుల్ మీరా, బుకింగ్ సూపర్‌వైజర్ ఎస్.తిరుమలయ్య కుమార్, రైలు మేనేజర్ గంగామోహన్ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌కు ప్రాతినిధ్యం వహించి స్వర్ణాన్ని సాధించారు. ఫైనల్‌లో నార్త్ వెస్ట్రన్ రైల్వే జట్టును ఓడించారు. డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీఎస్పీ వల్లేశ్వర బీ తోకల జట్టును అభినందించారు.

సీఎం సహాయనిధికి కేఎంవీ రూ.కోటి విరాళం

వన్‌టౌన్, సెప్టెంబరు 26: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.కోటి విరాళం అందజేసింది. సంస్థ సీఎండీ ఎ.ఎం.వి. ప్రసాదరావు, డైరెక్టర్ పృథ్వీరామ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు. వరద బాధితులు సర్వం కోల్పోవడం తమ హృదయాలను కలిసివేసిందని వారిని ఆదుకోవటం తమ కర్తవ్యంగా భావించి సహాయక చర్యలు చేపట్టామని ప్రసాదరావు తెలిపారు. ఈక్రమంలోనే సీఎం సహాయనిధికి కోటి విరాళం ఇచ్చినట్టు సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.



సీఎంకు చెక్కు అందిస్తున్న ప్రసాదరావు, పృథ్వీరామ్



సీఎంకు చెక్కు అందిస్తున్న బలరామయ్య

చలసాని రూ.54లక్షల విరాళం

లబ్బీపేట: ప్రముఖ పారిశ్రామికవేత్త చలసాని బలరామయ్య వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి 54లక్షల రూపాయల చెక్‌ను రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని గురువారం కలిసి అందజేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్రావు, కొసరాజు వినోద్, రోనాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్ నుంచి ఇద్దరు..
జిల్లా జడ్జిలుగా నియామకం

● న్యాయమూర్తులను సత్కరించిన బార్ కార్యవర్గసభ్యులు



విజయవాడ లీగల్, సెప్టెంబరు 26: బెజవాడ బార్‌లో న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తున్న ఇద్దరు న్యాయవాదులు పందిరి లలిత, కోడూరి కిషోర్‌బాబును గురువారం బార్ కార్యవర్గసభ్యులు, బార్ కౌన్సిల్ మెంబర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ మెంబర్లు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా) మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తుల పరీక్షలకు వెళ్లే న్యాయవాదుల కోసం శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోందని న్యాయమూర్తుల పరీక్షలకు వెళ్లే న్యాయవాదులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బెజవాడ బార్ నుంచి పందిరి లలిత, కోడూరి కిషోర్‌బాబు జిల్లాజడ్జిలుగా నియమితులు కావడం బెజవాడ బార్‌కే గర్వకారణమన్నారు. అనంతరం వారిద్దరినీ న్యాయవాదులు, కార్యవర్గసభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. న్యాయవాదులు కేవీవీ పరమేశ్వరరావు, పందిరి బాబురావు, బొమ్మసాని రవి, కలతోటి క్రాంతికుమార్, రాజ్యలక్ష్మీ, చింతా ఉమామహేశ్వరరెడ్డి, గండూరి రామశర్మ పాల్గొన్నారు.

మహిళా ఫుట్‌బాల్ చాంప్‌గా అనంతపురం

● రన్నరప్‌గా శ్రీ సత్యసాయి జిల్లా



విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీఎఫ్ఏ సహకారంతో కానూరు సమీపంలోని అనుమోలు గ్రౌండ్స్‌లో 3 రోజుల నుంచి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం విజేతగా నిలిచి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. శ్రీ సత్యసాయి, అనంతపురం జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌ను ఏపీఎఫ్ఏ సెక్రటరీ ఎం డానియల్ ప్రదీప్, ట్రెజరర్ వాసుమల్లి విజయ్ క్రీడా జట్లను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఆది నుంచి అదరగొట్టే గోల్స్‌తో శ్రీ సత్యసాయి జిల్లాపై అనంతపురం చెలరేగి ఆడి 4-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించింది. రన్నరప్‌గా సత్యసాయి నిలవగా, కడప మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, కందిమళ్ల బాలకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై శేషగిరిరావు, చక్రవర్తి హాజరై అందించారు. టోర్నీలో సత్తా చాటిన 96 మంది ప్లేయర్స్‌తో ఇదే గ్రౌండ్స్‌లో ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు లీగ్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెలక్షన్ కమిటీ చైర్మన్ పి. ఆలీబాబా, వివిధ జిల్లాల ప్రతినిధులు రాపూరి రాజేష్, జి పవన్, అనిల్, సురేష్, దాదా, కోచ్‌లు రవి, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో జీడీఏఏపీ సంఘం చర్చలు సఫలం.. నేతల హర్షం

ప్రభుత్వ ఆసుపత్రి: మంత్రి సత్యకుమార్ యాదవ్, శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో ఏపీ వీహెచ్‌సీ వైద్యుల సంఘం నేతలు జరిపిన 2వ విడత చర్చలు సఫలవంతమైనందుకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏఏపీ) హర్షం వ్యక్తం చేసినట్టు సంఘం నేతలు డాక్టర్ బాబ్జీ కుమారు, డాక్టర్ భానుకుమార్ గురువారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఇన్ సర్వీస్ కోటా తగ్గింపును నిరసిస్తూ సంఘం నేతలు కృష్ణబాబుకు జూలై 27న వినతిపత్రం ఇచ్చారన్నారు. అనంతరం చర్చించిన ఫలితం లేనందున సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. వైద్యుల కోరిక మేరకు ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ సర్వీసులో ఉన్న వైద్యుల వలే 30 శాతం సర్వీసు కోటా పెంచాలని కోరామని, ప్రభుత్వం 20శాతం కోటాకు అంగీకారం తెలపడం జరిగిందన్నారు. వైద్యుల ఐక్యతతో 30శాతం సర్వీస్ కోటా పొందడానికి పనిచేస్తామన్నారు.

చారిత్రక ప్రదేశాల్లో స్వచ్ఛత ఎంతో అవసరం

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 26: నగర పేరు ప్రఖ్యాతులు ఇనుమడించాలంటే చారిత్రక ప్రదేశాల్లో స్వచ్ఛత ఎంతో ముఖ్యమని, స్వచ్ఛతా హి సేవకు నిజమైన అర్థం అదేనని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వన్‌టౌన్‌లోని గాంధీహిల్‌పై గురువారం స్వచ్ఛతా హి సేవలో శ్రమదానం నిర్వహించారు. కమిషనర్ సైతం చెట్లు, పిచ్చిమొక్కలను, వ్యర్థాల తొలగింపులో పాల్గొన్నారు. అనంతరం మొగల్రాజపురంలోని గుహల్లోనూ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్-3 కార్యాలయ సిబ్బంది పాల్గొని వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించారు. 300 అడుగుల పొడవైన జాతీయ జెండా పట్టుకుని గాంధీహిల్ కింద నుంచి కొండపై వరకు ర్యాలీ నిర్వహించారు. సర్కిల్-1, 2 నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రతిరోజూ వినూత్న తరహాలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, ట్రిబుల్ ఆర్ ప్రోగ్రామ్, స్వచ్ఛభారత్ నినాదాలతో అవగాహన కలిగించారు. అదనపు కమిషనర్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్యకీర్తన, ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, సర్కిల్-1 కార్పొరేషన్ సిబ్బంది, గాంధీజీ మునిసిపల్ హైస్కూల్, పాదర్తి సుందరమ్మ హైస్కూల్, మొహమ్మద్ అలీపురం వించిపేట ఉర్దూ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ముక్కలైన కొత్త జీవితం

● పెళ్లయిన నెల రోజులకే భర్త దుర్మరణం



చిట్టినగర్: ఏడడుగులు వేసి ఏళ్లు గడవలేదు. మూడు ముళ్లు వేసి మూణ్నెళ్లు కాలేదు. ఇప్పుడిప్పుడే ఆ దంపతుల మధ్య అన్యోన్యం మొగ్గలు తొడుగుతున్న తరుణంలో విధి వారి తలరాతను మార్చేసింది. మృత్యువు రోడ్డుప్రమాదం రూపంలో కాటేసింది. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు నాదెండ్ల దినేష్ (32) సెలూన్ నిర్వహిస్తున్నాడు. అతడికి జక్కంపూడి కాలనీకి చెందిన జ్యోష్ణవితో ఆగస్టు 14న వివాహమైంది. ప్రస్తుతం ఈ దంపతులిద్దరూ పుల్లంపేటలో నివసిస్తున్నారు. జ్యోష్ణవి తాను టెన్త్ చదివిన పాఠశాల నుంచి టీసీ తీసుకోవడానికి అక్కడి నుంచి బైక్‌పై ఈనెల 23న జక్కంపూడి కాలనీలోని అత్తవారింటికి వచ్చారు. దినేష్ తల్లి అజిత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. బుధవారం రాత్రి ఆమెను పలకరించడానికి బైక్‌పై దినేష్ వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి జక్కంపూడి కాలనీలోని అత్తవారింటికి వస్తుండగా వైవీ ఎస్టేట్ రింగ్ వెల్‌కం వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. ఇంటికి వెళ్లాడా లేదా అని తెలుసుకోవడానికి తల్లి రాగవేణి దినేష్‌కు ఫోన్ చేసింది. ఫోన్ మోగుతున్నా ఎవరూ ఎత్తలేదు. తర్వాత అక్కడికి చేరుకున్నవారు ఫోన్ చేసి విషయం చెప్పారు. భార్య జ్యోష్ణవి ఫిర్యాదుతో కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



పాయకాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన నూ జివీడు ప్రధాన రహదారిలో గురువా రం చోటు చేసుకుంది. స్థానిక కండ్రిక కాలనీకి చెందిన షేక్ మరియం బీ (38) సూరంపల్లిలోని మహిళా ఇండస్ట్రీలో పని చేస్తోంది. గురువారం సాయంత్రం పని ముగించుకుని తోటి ఉద్యోగినితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తోంది. మార్గమధ్యంలో బోడపాడు వద్ద వీరి వాహనాన్ని గుర్తు తెలియని ఆటో ఢీకొని వెళ్లిపోయింది. దీంతో మరియం బీ, సహచర ఉద్యోగులు రోడ్డుపై పడిపోయారు. వెనుక నుంచి సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ రోడ్డుపై పడిపోయిన మరియం బీ మీదుగా వెళ్లింది. దీంతో తీవ్రగాయాలపాలైన ఆమెను స్థానికులు సున్న గ్రామంలోని ప్రజావైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్వీపీలో ఐఐహెచ్ వ్యాధిపై అవగాహన సదస్సు

పెనమలూరు: తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో గురువారం ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ (ఐఐహెచ్) వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రి పీడియాట్రిక్, న్యూరో అప్తమాలజిస్ట్ డాక్టర్ వీరేందర్ సచ్‌దేవా మాట్లాడుతూ ఐఐహెచ్ వ్యాధి ముఖ్యంగా గర్భధారణ వయసున్న స్త్రీలు, ఊబకాయం, కంటినరాల సమస్యలున్న వ్యక్తుల్లో ఎక్కువ ప్రబలుతుందన్నారు. స్టెరాయిడ్లు, విటమిన్ ఏ సప్లిమెంట్లు, గర్భనిరోధక మాత్రలు, యాంటీబయాటిక్స్ అధికంగా ఉపయోగించడం వల్ల ఈకేసులు ఎక్కువవుతున్నాయన్నారు. ఈ వ్యాధి కళ్లను, మెదడును, దృష్టిని ప్రభావితం చేసి కంటినరం రుగ్మతను కలిగిస్తుందన్నారు. నేత్రనిపుణులు, రేడియాలజిస్టులు, న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్ల సాయంతో చికిత్స చేయవచ్చన్నారు.

29న టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష

ఆటోనగర్: హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటలకు వరకు హిందీ సేవాసదన్ యాప్ నందు రాష్ట్రస్థాయి టెట్ హిందీ ఆన్‌లైన్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 95813 86150, 95536 77119 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కార్మికులకు శుభవార్త..

1 నుంచి కనీస వేతన రేట్ల పెంపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు శుభవార్త చెప్పింది. కార్మికులు ముఖ్యంగా అసంఘటిత రంగంలోని కార్మికుల కనీస వేతన రేట్లను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆమేరకు కార్మికులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో వేతనాలను సవరించినట్టు కార్మిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. వేతన రేట్ల సవరణ వల్ల భవన నిర్మాణం, లోడింగ్-అన్‌లోడింగ్, వాచ్ అండ్ వార్డ్, స్వీపింగ్, క్లీనింగ్, హౌస్‌కీపింగ్, గనులు, వ్యవసాయం వంటి రంగాల్లోని కార్మికులు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. కొత్త వేతన రేట్లు ఈ ఏడాది అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయి.

అమెరికాలో హిందూ ఆలయంపై దాడి

వాషింగ్టన్, సెప్టెంబరు26: కాలిఫోర్నియాలోని ఒక హిందూ ఆలయంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. శాక్రమెంటోలోని బాప్స్ శ్రీ స్వామినారాయణ్ మందిరంపై "హిందువులు వెళ్లిపోవాలి" అంటూ నినాదాలు రాసి అక్కడ విధ్వంసం సృష్టించినట్లు ఆసంస్థ తెలిపింది. పది రోజుల వ్యవధిలోనే హిందువులకు వ్యతిరేకంగా ఇలాంటి దాడులు జరగడం ఇది రెండోసారి అని బాప్స్ ప్రజా వ్యవహారాల విభాగం పేర్కొంది. ఈ నెల 17న న్యూయార్క్‌లోని స్వామి నారాయణ్ మందిర్ వద్ద కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. ఈ ఘటనను తమ సంస్థ తీవ్రంగా ఖండిస్తోందని బాప్స్ పేర్కొంది.

గృహ హింస చట్టం మతాతీతం : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: 'గృహ హింస చట్టం, 2005' దేశంలోని ప్రతి మహిళకు గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తుందని.. మతం, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా స్త్రీలందరికీ ఇది వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కుల రక్షణకు ఈ చట్టం ఇతోధికంగా దోహదపడుతుందని తెలిపింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది.

ఆ తీర్పులో వ్యాఖ్యలు సమీక్షించం

- బిల్కిస్‌బానో కేసులో సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: బిల్కిస్‌బానో కేసులో ముద్దాయిలను ముందస్తుగా విడుదల చేయడాన్ని కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పులో చేసిన వ్యాఖ్యలను సమీక్షించాలని కోరుతూ గుజరాత్ ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో సామూహిక అత్యాచారానికి గురయిన బిల్కిస్‌బానో కేసులో శిక్ష పడ్డ 11 మంది ముద్దాయిలను రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేసింది. ఆ నిర్ణయాన్ని ఈ ఏడాది జనవరిన సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ సందర్భంగా ఇచ్చిన తీర్పులో రాష్ట్ర ప్రభుత్వంపై కొన్ని వ్యాఖ్యలు చేసింది. 'అధికారాన్ని లాక్కోవడం', 'విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేయడం' వంటి పదాలను ఉపయోగించింది. వీటిపై సమీక్ష జరపాలని కోరుతూ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ఓపెన్ కోర్టులో విచారణ జరిగేలా లిస్టు చేయాలని కోరింది. పరిశీలించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఎలాంటి సమీక్ష అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

బిహార్‌లో పవిత్ర స్నానాలకు వెళ్లి 46 మంది మృతి

పట్నా, సెప్టెంబరు 26: బిహార్‌లో 'పవిత్ర స్నానాల' కోసం వెళ్లి కనీసం 46 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 37 మంది చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు. 'జీవిత పుత్రిక' పండుగ సందర్భంగా తమ పిల్లలు దీర్ఘాయువుతో జీవించాలని మహిళలు ఉపవాసం చేసి అనంతరం వారి బిడ్డలతో కలిసి నదులు, చెరువులలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. గురువారం పండుగ నేపథ్యంలో పవిత్ర స్నానాల కోసం ప్రజలు పోటెత్తారు. 15జిల్లాల్లో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మొత్తం 46 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సీఎం నితీశ్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

జమిలి ఎన్నికలపై జేపీసీ!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వందరోజుల కాలంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో జమిలి ఎన్నికలు ఒకటి. శీతకాల సమావేశాల్లో జమిలి ఎన్నికలపై బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ఇప్పటికే ప్రకటించింది.

కర్ణాటకలో సీబీఐకి నో ఎంట్రీ!

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కేసుల విచారణకు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ సీబీఐని అనుమతించరాదని రాష్ట్ర కేబినెట్ తీర్మానించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, ఇకపై రాష్ట్ర కేసులకు సంబంధించి సీబీఐ నేరుగా దర్యాప్తు చేసే అవకాశం ఉన్న గెజిట్‌ను ఉపసంహరిస్తున్నామని తీర్మానం చేశారు. కేబినెట్ భేటీ వివరాలను రాష్ట్ర న్యాయ, శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. ముడా ఇళ్ల స్థలాల వివాదం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోలేదని, తాము సీబీఐకి అప్పగించిన అన్ని కేసులకు వర్తించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

విచ్ఛిన్నకర శక్తులను అణచివేయాలి

- డీజీపీని కలిసిన పురందేశ్వరి, బీజేపీ నేతలు

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆలయాలపై దాడులు చేస్తూ సమాజ విచ్ఛిన్నానికి కుట్ర చేస్తున్న శక్తులను కఠినంగా అణచి వేయాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావుకు ఏపీ బీజేపీ బృందం విజ్ఞప్తి చేసింది. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం డీజీపీ తిరుమలరావుతో భేటీ అయింది. ఇటీవల వినాయకచవితి సందర్భంగా కృష్ణా జిల్లా పెడనలో ఒక వర్గం మరో వర్గంపై చేసిన దాడులను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో అక్కడక్కడ జరిగిన ఉద్రిక్తపరమైన ఘటనలను ప్రస్తావిస్తూ.. దసరా, దీపావళి ఇలా వరుస పండుగల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పాతూరి నాగభూషణం, షేక్ బాజీ, పాటిబండ్ల రామకృష్ణ మట్టా ప్రసాద్ కోరారు.

చేనేత కుటుంబాలకు సర్కారు అండ

- 1,228 మందికి వరద నష్టపరిహారం
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య వెల్లడి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మగ్గం గుంతల్లోకి నీళ్లు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 వేల చొప్పున పరిహారం అందజేసింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని రత్నాలచెరువులో ఉన్న భావనారుషి స్వామి ఆలయంలో టీడీపీ నేతలు స్థానిక చేనేత కార్మికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేనేతలకు పరిహారం అందించిన సీఎం చంద్రబాబు, అందుకోసం కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అబద్ధయ్య మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వరద ముంపు తగ్గిన రెండు వారాల్లోనే నష్టపరిహారం అందించడం గొప్ప విషయమన్నారు. జగన్ రూ.2 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటే, కూటమి ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు నష్ట పరిహారం ఇచ్చిందని తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా ఆరు పీఎస్పీలు

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌తో కలసి రాష్ట్రంలో కొత్తగా ఆరు పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ నిర్ణయించింది. దీనికి సంబంధించిన భాగస్వామ్య ఒప్పందంపై ఎన్‌హెచ్‌పీసీ చైర్మన్, ఎండీ రాజ్‌కుమార్ చౌదరి, ఫైనాన్షియల్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ గోయల్, ఈడీ రజత్ గుప్తా, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సంతకాలు చేయనున్నారు. సీఎం చంద్రబాబు సమక్షంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగే అవకాశం ఉందని సమాచారం.

ఎన్‌హెచ్‌లకు త్వరితగతిన భూసేకరణ: మంత్రి

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన ప్రాజెక్టుల పనులు వెంటనే కాంట్రాక్టు ఏజెన్సీలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఇక్కడి ఈఎన్‌సీ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్‌లకు భూ సేకరణపై ప్రతి బుధవారం జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేనుఆదేశించారు.

'అప్సా' ఉనికికే ఎసరు

- వెంకట్రామిరెడ్డి నిర్వాకంతో మొదటికే మోసం
- ప్రభుత్వ గుర్తింపూ రద్దయ్యే ప్రమాదం!
- వైసీపీ ఉద్యోగనేతగానే నాడు చెలామణి
- చివరకు ఎన్నికల్లోనూ ప్రచారం.. ఈసీ వేటు
- ఇటీవల నోటీసు ఇచ్చిన ప్రభుత్వం
- 'అప్సా' గుర్తింపును ఎందుకు రద్దు చేయరాదో వివరణ ఇవ్వాలని ఆదేశం
- వెంకట్రామిరెడ్డి తప్పులకు అప్సాకు శిక్ష వేయొద్దు
- సీఎస్‌కు ఆ సంఘం నేతల లేఖ



అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో అధికార పార్టీతో అంటకాగి, ఉద్యోగ నేతలా కాక పక్కా రాజకీయ నేతగా వెంకట్రామిరెడ్డి చేసిన పాపాలు.. సచివాలయ ఉద్యోగుల సంఘం (అప్సా)కు శాపాలుగా మారాయి. ఉద్యోగుల ప్రయోజనాల కంటే, వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన ఎక్కువగా పాటుపడ్డారనే ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. మరీ ముఖ్యంగా గత ఎన్నికల సమయంలో ఏకంగా జగన్ పార్టీ తరఫున ఆయన ప్రచారంలోనే పాల్గొన్నారు. అప్పటి వెంకట్రామిరెడ్డి నిర్వాకమే ఆయన అధ్యక్షుడుగా ఉన్న 50 ఏళ్ల చరిత్ర కలిగిన అప్సా ఉనికికి ఇప్పుడు ఎసరు తెచ్చింది. ఆ సంస్థకు ఉన్న ప్రభుత్వ గుర్తింపు రద్దుకు అధికారులు ఫైల్‌ను కదిలించినట్టు తెలిసింది. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో కలకలం మొదలైంది. దానికి తోడు అప్సా ప్రధాన కార్యదర్శి తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించడం మరింతగా చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వైసీపీ పాలించిన ఐదేళ్ల కాలమూ దానికి అనుబంధ సంఘంగా అప్సాను వెంకట్రామిరెడ్డి మార్చేశారు. సాధారణంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దలతో ఉద్యోగ నేతలు మాట్లాడుతుంటారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి కోసం ప్రతిపక్షాలను కలుస్తుంటారు. దీన్ని ఏ ప్రభుత్వంగానీ, ఏ రాజకీయ పార్టీగానీ తప్పుపట్టవు. కానీ, గత ఐదేళ్లకాలంలో దీనికి పూర్తి విరుద్ధంగా వెంకట్రామిరెడ్డి నడుచుకున్నారు. వీటన్నింటికీ పరాకాష్ఠగా గత ఎన్నికల్లో వైసీపీకి వెంకట్రామిరెడ్డి ప్రచారం చేశారు. అదీ ఏ స్థాయికి చేరిందంటే ఎన్నికల సంఘమే జోక్యం చేసుకుని వెంకట్రామిరెడ్డిపై వేటు వేసింది. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు విధుల నుంచి ఆయనను సస్పెండ్ చేసింది. అంత అడ్డగోలుగా ఐదేళ్లపాటు వెంకట్రామిరెడ్డి వ్యవహరించారు. ఆ పాపం అప్సాను కూడా వదలలేదు. నిజానికి, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అప్సా రెండో స్థానంలో ఉంది. అలాంటిది అప్సాకు ప్రభుత్వ గుర్తింపే లేకుండా పోయే పరిస్థితిని వెంకట్రామిరెడ్డి తెచ్చిపెట్టారని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో 'అప్సా'ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నేరుగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఎలా పాల్గొంటారంటూ ఈ నోటీసులో వెంకట్రామిరెడ్డిని తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో సాధారణ పరిపాలనశాఖ ఆదేశించింది. అయితే, ఆ నోటీసు గడువు కూడా ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో అప్సా తరఫున కార్యదర్శి శ్రీకృష్ణ, ఇతర ఆఫీసు బేరర్లు రెండు రోజుల క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌కు లేఖ రాశారు. "వ్యక్తిగత హోదాలోనే వెంకట్రామిరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ వ్యవహారంతో అప్సాకు సంబంధం లేదు. సచివాలయానికి వెలుపల తన కార్యకలాపాలపై ఆయన ఏనాడూ మమ్మల్ని సంప్రదించలేదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్టు తేలితే, ఆయనపై చర్యలు తీసుకోండి. కానీ, అప్సాకు ప్రభుత్వ గుర్తింపును మాత్రం రద్దు చేయవద్దు" అని కోరారు. ఈ వ్యవహారం ఇలా ఉండగానే గురువారం తన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీకృష్ణ తెలిపారు. "ఉద్యోగుల కోసం ఏం చేయాలనుకుని ఈ పదవిలోకి వచ్చానో, వాటిని వేటినీ నెరవేర్చలేకపోయాను" అని ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వెంకట్రామిరెడ్డికి ఇచ్చిన నోటీసు గడువు ముగిసినా. ఇప్పటికీ ప్రభుత్వం ఆయనపై ఎంక్వైరీ అధికారిని వేయలేదు. మరోవైపు అప్సా ప్రభుత్వ గుర్తింపు రద్దుకు మాత్రం అధికారులు చకచకా ఫైల్ కదిలిస్తున్నవైనం సచివాలయ ఉద్యోగులను ఆవేదనకు గురి చేస్తోంది.

రెండేళ్ల పదవీ కాలం ఉంది

- అంతవరకూ కొనసాగించాలి: గజ్జల వెంకటలక్ష్మి
- ఉత్తర్వుల్లో పదవీకాలాన్ని పేర్కొనలేదు: న్యాయస్థానం
- వాసిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీలోనే భర్తీ
- ఆగస్టు 25తో పదవీకాలం ముగిసింది: ఏజీ
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నియామకంపై ముగిసిన వాదనలు.. తీర్పు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి నుంచి తనను తొలగిస్తూ ఈ నెల 23న ప్రభుత్వం జారీచేసిన మెమో అమలును నిలుపుదల చేయాలని కోరుతూ గజ్జల వెంకటలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు ముగియంతో నిర్ణయాన్ని తర్వాత వెల్లడిస్తామని న్యాయస్థానం తెలిపింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. చైర్‌పర్సన్ పదవి నుంచి తనను తొలగిస్తూ ప్రభుత్వం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గజ్జల వెంకటలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... ఈ ఏడాది మార్చి 15న పిటిషనర్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారని, నిబంధనల ప్రకారం నాటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగేందుకు వెసులుబాటు ఉందన్నారు. ఏపీ ఉమెన్స్ కమిషన్ యాక్ట్‌లోని సెక్షన్ 6(1) ప్రకారం నియమితులైనందున పిటిషనర్‌కు రెండేళ్ల పదవీ కాలం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ పదవీకాలం పూర్తి కాకముందే వాసిరెడ్డి పద్మ చైర్‌పర్సన్‌గా రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఈమె స్థానంలో పిటిషనర్‌ను చైర్మన్‌గా నియమిస్తున్నామని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది తప్ప పదవీకాలాన్ని ఎక్కడా పేర్కొనలేదు కదా? అని ప్రశ్నించారు. శ్రవణ్‌కుమార్ బదులిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో టెన్యూర్ గురించి ప్రస్తావించనప్పటికీ, చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం పిటిషనర్‌ను చైర్‌పర్సన్‌గా నియమించినందున పిటిషనర్‌కు రెండేళ్ల పదవీకాలం ఉంటుందన్నారు. దీనిపై అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియామకం జరుగుతుందన్నారు. వాసిరెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీలో వెంకటలక్ష్మిని నియమించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ పదవీకాలం ముగిసిందన్నారు. నియామక ఉత్తర్వుల్లో సైతం తదుపరి ఉత్తర్వుల వరకు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో టెన్యూర్ గురించి ప్రస్తావించలేదన్నారు. వాసిరెడ్డి నియామకం విషయంలో ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 25తో పిటిషనర్ టెన్యూర్ ముగిసిందన్నారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ న్యాయమూర్తి నిర్ణయాన్ని వాయిదా వేశారు.



మంత్రి నారా లోకేశ్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

టీడీపీ తొలి శాశ్వత సభ్యత్వానికి ఎంపీ కలిశెట్టి ముందస్తు బుకింగ్!

- మంత్రి లోకేశ్‌కు రూ.లక్ష చెక్కు అందజేత

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వ నమోదు ప్రక్రియ వచ్చే నెల నుంచి ప్రారంభం కానుంది. శాశ్వత సభ్యత్వం కోసం లక్ష రూపాయలు చెల్లించాలని పార్టీ అధినేత చంద్రబాబ ఇప్పటికే వెల్లడించారు. శాశ్వత సభ్యత్వాల ద్వారా వచ్చే మొత్తాన్ని కార్యకర్తల సంక్షేమానికి వినియోగించనున్నారు. ఈ క్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తొలి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకునేందుకు ముందస్తుగానే మంత్రి లోకేశ్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. నగర పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో లోకేశ్‌ను ఎంపీ కలిశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో చెక్కును అందజేశారు.

భద్రత పునరుద్ధరించాలని హైకోర్టుకు మాజీ మంత్రి బుగ్గన

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రిగా ఉన్న సమయంలో తనకున్న వై ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. విచారణను అక్టోబరు 16కు వాయిదా వేశారు. అంతకుముందు పిటిషనర్ తరఫున న్యాయవాది సి.సుమన్ వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉందని, నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను తొలగించారన్నారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ ప్రసుత్తం రాజ్యాంగబద్ధ పదవిలో లేరని కోర్టుకు తెలిపారు. ఆయనకు ఎలాంటి ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ కూడా నివేదిక ఇచ్చిందని స్పష్టం చేశారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

జగన్ పాలనంతా అవినీతిమయం

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనంతా అవినీతిమయమేనని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ విమర్శించారు. గురువారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ తిరుమలను కూడా అవినీతికి అడ్డాగా మార్చుకుని, లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి, టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం చేసిన ప్రతి తప్పుకి మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకాలపై విచారణ చేసి, బాధ్యులపైన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ అహర్నిశలు కష్టపడుతున్నారని పేర్కొన్నారు.

కూతురి పాలిట కామాంధులు

- మత్తు బిళ్లలు ఇచ్చి తండ్రితోపాటు పెదనాన్న, బాబాయి అత్యాచారం
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో తల్లి ఫిర్యాదు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- పిచ్చిదాన్నంటూ ముద్ర వేస్తున్నారని మొర

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తన కూతురికి మత్తు బిళ్లలు ఇచ్చి కన్న తండ్రితోపాటు పెదనాన్న, చిన్నాన్నలే ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నారని గుంటూరులోని పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధికి చెందిన ఒక మహిళ గురువారం ఫిర్యాదు చేశారు. ఈ దారుణంపై దిశ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని, గట్టిగా నిలదీస్తే తనను పిచ్చిదాన్నంటూ ముద్ర వేసి పిచ్చాసుపత్రిలో చేర్పిస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయింది. భర్త, బావ, మరిది బారి నుంచి తన బిడ్డను రక్షించాలని ఆమె వేడుకుంది. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, జంగా కృష్ణమూర్తి ఆమె వినతిపత్రాన్ని స్వీకరించారు. పోలీసులతో మాట్లాడి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకా పలువురు తమ సమస్యలపై వినతిత్రాలు అందజేశారు. తన కుమారుడికి పుట్టుకతోనే అంధత్వం వచ్చిందని, పింఛను ఇప్పించాలని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం గంగవరానికి చెందిన కేశనపల్లి చిన్నపోలయ్య మొర పెట్టుకున్నారు. తన తండ్రి నుంచి వచ్చిన భూమిని పాండురంగారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని సత్యసాయి జిల్లా రొళ్ల మండలం మజరా అలుపనపల్లికి చెందిన రత్నమ్మ ఫిర్యాదు చేసింది. వరద పరిహారం అందలేదని విజయవాడ 140వ సచివాలయ పరిధిలోని పలువురు ఫిర్యాదు చేశారు. బతుకుదెరువు కోసం సీఎస్ పురం నుంచి గుంటూరుకు వస్తే.. తమ భూములను కబ్జా చేశారంటూ ఎస్.లక్ష్మి వాపోయారు. రూ.1.40 లక్షలు అడ్వాన్సు ఇచ్చి తమ భూమిని రిజిస్టర్ చేయించుకున్న మాదల శ్రీనివాసరావు, అతని బావమరిది ఆలూరి వెంకటేశ్వరరావు మిగిలిన డబ్బు ఇవ్వకుండా మోసం చేశారని గుంటూరు కొరిటెపాడుకు చెందిన మాదల రంగారావు ఫిర్యాదు చేశారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు.. భరోసా ఇచ్చారు.



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఉన్నతస్థాయి కమిటీ చైర్‌పర్సన్ వసుధామిశ్రా, సభ్యులు

ఎసెన్షియాకు హైలెవెల్ కమిటీ

- ఫార్మా కంపెనీల ప్రతినిధులతో భేటీ

అనకాపల్లి/రాంబల్లి/పరవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రాంబిల్లి, పరవాడ మండలాల్లోని ఫార్మా కంపెనీలను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ గురువారం పరిశీలించింది. ప్రమాద వివరాలను కమిటీ తెలుసుకుంది. ఎసెన్షియా ఫార్మా కంపెనీని పరిశీలించిన అనంతరం కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో సమావేశమై సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసుధామిశ్రా మాట్లాడుతూ అందరి సహకారం, భాగస్వామ్యంతోనే పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందన్నారు. అందరి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ-మెయిల్, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని కమిటీ కన్వీనర్‌కు సూచించారు. సూచనలు, సలహాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రీడియంట్స్ పరిశ్రమను ఉన్నతస్థాయి కమిటీ పరిశీలించింది. ప్రమాద వివరాలను తెలుసుకుని, పరిశ్రమల ప్రతినిధులతో వసుధామిశ్రా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉన్నతస్థాయి కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్‌వర్మ, పరిశ్రమల శాఖ అదనపు డైరెక్టర్ ఏవీ పటేల్, పీసీబీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరరావు, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ మెడిసిన్‌లో టెక్నాలజీ పెరగాలి

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: సమాజానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడే ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి రాధికారెడ్డి అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ యాన్యువల్ కాన్ఫరెన్స్-2024 సెమినార్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఆర్ఎంసీ ఫోరెన్సిక్ మెడిసన్ అండ్ టాక్సికాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌కు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) డాక్టర్ జి.రఘునందన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా తదితర రాష్ట్రాల నుంచి వైద్యులు, వైద్యవిద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిపుణులైన వైద్యులు ఫోరెన్సిక్ మెడిసిన్‌లోని వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. ఈ సెమినార్ మరో రెండు రోజులపాటు జరుగుతుందని ఆర్గనైజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): న్యాయవాది మన్నం వెంకట కృష్ణారావును హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) వి.సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏజీ పర్యవేక్షణలో ఆయన జీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్లపాటు పోస్టులో కొనసాగుతారు. అలాగే ఏపీఈసీడీసీఎల్ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు వీవీ సతీష్, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు గంగిశెట్టి రాజేశ్వరరావు, జీఎన్ ఉమారాణి, ఆంధ్ర రీజియన్‌లోని నెల్లూరు, ప్రకాశం జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల మున్సిపాలిటీలకు వల్లభనేని శిరీషరాణి ని స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ సునీత ఉత్తర్వులు ఇచ్చారు. మూడేళ్లపాటు వారు ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఇద్దరు హేమంత్ సోరెన్‌లు..!



మనుషులను పోలిన మనుషులు లోకంలో చాలా మందే ఉంటారు. అయితే.. అలా పోలిక ఉన్న వారిలో ప్రముఖులు ఉంటే.. అది ఆసక్తికర చర్చకు దారి తీస్తుంది. ఇక్కడ కనిపిస్తున్న ఇద్దరూ ఎవరూ గుర్తుపట్టలేనంతగా ఒకే పోలికతో ఉన్నారు. వీరిలో ఎడమ వైపున ఉన్న వ్యక్తి జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్.. మరొకరు రాంచీకి చెందిన థియేటర్ ఆర్టిస్ట్ మున్నా లోహ్రా. సీఎం నివాసంలో సోరెన్‌ను మున్నా తన కుటుంబ సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ సరదాగా సంభాషించుకున్నారు. ఈ ఫోటోను సోరెన్.. తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "హేమంత్ సోరెన్‌ను కలిసిన హేమంత్" అంటూ క్యాప్షన్ పెట్టారు. ఈ ఫొటో వైరల్ కావడంతో పలువురు నెటిజన్లు సరదాగా రకరకాలుగా వ్యాఖ్యలు చేశారు.

బికినీ వేసుకు తిరగడానికి కావాలొక దీవి!

- భార్య సరదా కోసం రూ.418 కోట్లతో ద్వీపాన్నే కొన్న దుబాయ్ వ్యాపారవేత్త

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: భార్య బికినీ వేసుకోవాలి.. బీచ్‌లో హ్యాపీగా, జాలీగా తిరుగుతూ ఎంజాయ్ చేయాలి! అయితే తాను ఎవరి కంటనో పడి ఇబ్బంది పడటం అంటూ జరగొద్దు!! ఎలా సాధ్యం? సౌదీకి చెందిన వ్యాపారవేత్త జమాల్ అల్ నదాక్ అనే బడా వ్యాపారవేత్తకు ఇదే సవాలు ఎదురైతే చిటికెలో సుసాధ్యం చేసుకున్నాడు. భార్య 'సరదా' కోసం ప్రత్యేకంగా ఓ ద్వీపాన్నే కొన్నాడు. ఇందుకు రూ.418 కోట్లు ఖర్చు చేశాడు! తనకు బికినీ ధరించి.. బీచ్‌లో తిరగాలనుందని భార్యామణి సౌదీ అల్ నదాక్ (26) చెప్పడంతోనే అదెంత పని అంటూ ఆమెకు హిందూ మహాసముద్రంలో ఓ దీవినే కొనిచ్చేశాడు. ఈ విషయాన్ని స్వయంగా సౌదీ అల్ నదాక్ ఇన్‌స్టా వేదికగా పంచుకొని.. ఆ ఐలెండ్ వీడియోనూ షేర్ చేసింది. "నేను బికినీ ధరించి.. బీచ్‌లో తిరగాలనుకున్నాను. అయితే బీచ్‌లో నేను సురక్షితంగా సేదతీరాలని నా భర్త అనుకున్నారు. ఆ ఆలోచన నుంచే ఓ ద్వీపాన్ని సొంతం చేసుకోవాలనే ఆలోచన వచ్చింది" అంటూ ఆమె ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. అయితే గోప్యత, భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఆ ద్వీపం వివరాలు వెల్లడించలేదు.

13 వేల మందికి సికిల్‌సెల్ ఎనీమియా స్ర్కీనింగ్

- దసరాలోగా పూర్తి చేయాలి: ఆరోగ్యశాఖ కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా అడ్మిషన్ పొందిన దాదాపు 13 వేల మంది విద్యార్థులకు దసరాలోగా సికిల్ సెల్ ఎనీమియా స్ర్కీనింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారుల్ని ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. జాతీయ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనా మిషన్ అమలుపై చర్చించేందుకు ఆరోగ్యశాఖ జాతీయ ఆరోగ్య మిషన్, గిరిజన సంక్షేమ, పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ రాష్ట్రస్థాయి అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. స్ర్కీనింగ్‌లో 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న వారికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అర్హత గల జంటలు, ఎస్టీ గర్భిణీలందరికీ మొదటి త్రైమాసిక స్ర్కీనింగ్ నిర్వహిస్తామన్నారు.

వినియోగదారుల మండలి ఏర్పాటుకు చట్టసవరణ

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ మండలి ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలో వినియోగదారుల చట్టాన్ని సవరించనుంది. రెండు రోజుల క్రితం పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా టీడీపీ నేత, మాజీ మంత్రి పీతల సుజాతను వినియోగదారుల హక్కుల పరిరక్షణ మండలి చైర్మన్‌గా నియమించారు. ఆ కౌన్సిల్ ప్రస్తుతం ఉనికిలో లేకపోవడంతో వినియోగదారుల రక్షణ చట్టాన్ని సవరించి.. ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయనుంది. ఆ కౌన్సిల్ ఉనికిలోకి వచ్చిన తర్వాత చైర్మన్‌గా పీతల సుజాత బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

వలంటీర్లు గాలిలో కలిసిపోయారు: పితాని

ఆచంట, సెప్టెంబరు 26: 'గత ప్రభుత్వం నియమించిన వలంటీర్లు ప్రజలకు సేవ చేయడం మానేసి, వైసీపీ కార్యక్రమాలు చేపట్టి, ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టారు. ప్రస్తుతం వారు గాలిలో కలిసిపోయారు. అలాగే సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వారు కూటమి పార్టీలకు ఓట్లు వేయలేదు' అని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలిలో గురువారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 27 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఎన్ఎస్ఐసీలో టెక్నికల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్- జాబ్ ఓరియంటెడ్ టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సును అనుసరించి ఎనిమిదోతరగతి/పదోతరగతి /ఇంటర్/ ఐటీఐ/డిప్లొమా /బీటెక్/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు. ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. పూర్తి సమాచారం కోసం సెప్టెంబరు 21 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.



ప్రోగ్రామ్‌లు
- అడ్వాన్స్ ట్రెయినింగ్ ఆన్ ఎలక్ట్రిక్ వెహికిల్(నెల/రెండు నెలలు)
- సోలార్ ఎనర్జీ విత్ పీవీఎస్ఓఎల్(నెల/రెండు నెలలు)
- ఎలక్ట్రికల్ ఆటో క్యాడ్(నెల/ఆరు వారాలు)
- హోమ్ అప్లయన్స్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్(రెండు నెలలు/ఆర్నెల్లు)
- సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్(నెల/రెండు నెలలు)

ముఖ్య సమాచారం
- **చిరునామా:** ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీసెస్ సెంటర్, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఫేజ్-3, గోవింద్‌పురి మెట్రో స్టేషన్, న్యూఢిల్లీ-110020
- **వెబ్‌సైట్:** www.nsic.co.in


తెలంగాణ ఐటీఐల్లో అయిదో విడత ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉపాధి-శిక్షణ కమిషనర్ కార్యాలయం- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐ కళాశాలల్లో అయిదో విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ కళాశాలల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. ఇప్పటి వరకు అప్లయ్ చేసుకోనివారు, దరఖాస్తు చేసుకున్నప్పటికీ సీటు లభించనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు మరల అప్లయ్ చేయనవసరం లేదు. వీరు తాము చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి. అక్కడ సీటు రాని పక్షంలో నిర్దేశిత గడువులోపు మరో కళాశాలలో ప్రయత్నించవచ్చు. ఈ ఏడాది నుంచి ఖమ్మం, నిజామాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఒక్కోదానిలో ఆరు కోర్సులు; మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగు కోర్సులను నూతనంగా ప్రారంభిస్తున్నారు. వీటి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐటీఐ కోర్సులు(ట్రేడ్‌లు): కార్పెంటర్, సీవోపీఏ, డ్రాఫ్ట్స్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫౌండ్రీమన్, మెషినిస్ట్, ప్లంబర్, టర్నర్, వెల్డర్ వైర్‌మన్ తదితరాలు

కొత్త కోర్సులు
- మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్
- ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్)
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్
- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్

అర్హత: ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి లేదా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కొత్త కోర్సులకు మాత్రం పదోతరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. అభ్యర్థుల వయసు ఆగస్టు 1 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. డ్రోన్ టెక్నాలజీ కోర్సుకు మాత్రం 16 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 28
- **వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 28
- **వెబ్‌సైట్:** iti.telangana.gov.in

కొండా లక్ష్మణ్ వర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ

సిద్దిపేట్ జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ ప్రతిభ, నిర్దేశిత ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్, కౌన్సెలింగ్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్రూట్ సైన్స్ 8, వెజిటబుల్ సైన్స్ 11, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ 8, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అండ్ అరోమాటిక్ క్రాప్స్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఐకార్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ ఆనర్స్(హార్టికల్చర్)/బీఎస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 5.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి.

ఎంపిక: బీఎస్సీ మార్కులకు 40 శాతం, ఐకార్ ఏఐఈఈఏ(పీజీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

పీహెచ్‌డీ(హార్టికల్చర్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 6 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్ 1, ప్లాంటేషన్-స్పయిసెస్-మెడిసినల్ అరోమాటిక్ క్రాప్స్ 1, ఫ్రూట్ సైన్స్ 2, వెజిటబుల్ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎమ్మెస్సీ(హార్టికల్చర్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 10 పాయింట్ల స్కేల్ మీద కనీసం 6.5 ఓజీపీఏ ఉండాలి. ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో స్కోర్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 40 ఏళ్లు మించకూడదు.



ఎంపిక: బీఎస్సీ మార్కులకు 20 శాతం, ఎమ్మెస్సీ మార్కులకు 20 శాతం, ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)2024 ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **చిరునామా:** రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, ములుగు, సిద్దిపేట్-502279
- **వెబ్‌సైట్:** skltshu.ac.in

ఐఐసీడీలో కోర్సులు

- బీ డిజైన్
- ఎం డిజైన్
- ఎం ఒకేషనల్



జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్(ఐఐసీడీ)- బీ డిజైన్, ఎం డిజైన్, ఎం ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. నిబంధనల మేరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. డిగ్రీలో మూడేళ్లు, పీజీలో ఏడాది కోర్సు పూర్తయ్యాక ఎనిమిది వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నాన్ రెసిడెంట్ ఇండియన్స్, సార్క్ దేశాల అభ్యర్థులు, ఇతర విదేశీ విద్యార్థులు కూడా ఈ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్, రెసిడెన్షియల్ పర్మిట్ సబ్మిట్ చేయాలి.

డిగ్రీ, పీజీ స్పెషలైజేషన్‌లు
- ☆ హార్డ్ మెటీరియల్ డిజైన్
- ☆ సాఫ్ట్ మెటీరియల్ డిజైన్
- ☆ ఫైర్డ్ మెటీరియల్ డిజైన్
- ☆ ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్
- ☆ జ్యువెలరీ డిజైన్
- ☆ క్రాఫ్ట్స్ కమ్యూనికేషన్

బోధనాంశాలు
- ☆ డిగ్రీ ప్రోగ్రామ్‌లో క్రాఫ్ట్స్ అండ్ డిజైన్, స్కిల్స్ అండ్ అప్లికేషన్స్, హిస్టరీ ఆఫ్ క్రాఫ్ట్స్, మెటీరియల్స్-సైన్స్, టూల్స్-టెక్నిక్స్-ప్రాసెస్, ఫీల్డ్ ఎక్స్‌పోజర్, కస్టమర్-మార్కెట్ నీడ్స్, డిజైన్ ప్రాసెస్ తదితర అంశాలు బోధిస్తారు.
- ☆ పీజీ ప్రోగ్రామ్‌లలో రీసెర్చ్, కాన్సెప్ట్, డిజైన్-సిస్టమ్స్ అండ్ సొల్యూషన్ థింకింగ్, అడ్వాన్స్ ఎక్స్‌ప్లొరేషన్ ఆఫ్ మెటీరియల్స్-డిజైన్ పాజిబిలిటీస్, ఇన్నోవేషన్స్, బిజినెస్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్, సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ లీడర్‌షిప్ అంశాలు వివరిస్తారు.

బీ డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎం డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. బీ డిజైన్/బీఆర్క్/బీఏ డిజైన్/బీఎస్సీ డిజైన్/బీ ఒకేషనల్ డిజైన్/తత్సమాన కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎం ఒకేషనల్: దీనిని నాన్ డిజైన్ డిగ్రీ కోర్సులు చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం ఆరు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది ఐఐసీడీ అందించే పీజీ ఫౌండేషన్ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు దశలు ఉంటాయి. మొదటిది జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్. ఇందులో అభ్యర్థి పరిశీలన శక్తి, ఎస్టిమేషన్ సామర్థ్యం, విజువల్ ఇంటర్‌ప్రిటేషన్‌పై అవగాహన తదితరాలు పరీక్షిస్తారు. రెండోది మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్. ఇందులో పోర్ట్ ఫోలియో సబ్మిషన్ ఉంటుంది. ఇది పూర్తిగా అభ్యర్థి క్రియేటివ్ వర్క్‌కు సంబంధించింది. ఇందులో స్కెచింగ్, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, ఫొటోగ్రఫీ, మోడల్స్, ఎక్స్‌ప్లొరేషన్ విత్ మెటీరియల్స్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలు ఉండేలా చూసుకోవాలి. అభ్యర్థులు పెన్స్, పెన్సిల్స్(హెచ్‌బీ, 2బీ, 4బీ, 6బీ), సిజర్స్, స్కేల్, సెల్లో టేప్, పేపర్ కట్టర్, ఫెవీ స్టిక్, ఎరేజర్, కంపాస్, కలర్ పెన్సిల్స్, వాటర్ కలర్స్, బ్రష్‌లు వెంట తెచ్చుకోవాలి. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో ఆప్టిట్యూడ్ టు క్రాఫ్ట్స్, ఇంటెలిజెన్స్ కోషంట్, కమ్యూనికేషన్ ఎబిలిటీ, క్రాఫ్ట్స్ అండ్ డిజైన్‌కు సంబంధించిన జనరల్ అవేర్‌నెస్, పర్సనల్ అచీవ్‌మెంట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్ ఆధారంగా అభ్యర్థుల ప్రావీణ్యాన్ని పరీక్షిస్తారు. జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్‌కు 35 శాతం, మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్‌కు 45 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఫీజు:** ఇండియా సహా సార్క్ దేశాల అభ్యర్థులకు రూ.1,750; ఎన్ఆర్ఐలు సహా విదేశీ విద్యార్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** అక్టోబరు 7 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 7
- **క్వశ్చన్ పేపర్, అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరి 16 నుంచి
- **క్వశ్చన్ పేపర్‌కు సంబంధించిన రెస్పాన్స్ షీట్లు పంపేందుకు చివరి తేదీ:** 2025 జనవరి 25
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఫిబ్రవరి 3
- **ఫలితాలు విడుదల:** 2025 ఫిబ్రవరి 21
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** 2025 ఫిబ్రవరి 28 నుంచి
- **వెబ్‌సైట్:** iicd.ac.in

జాబ్ కార్నర్

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 128

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్-సి విభాగంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ)(పురుషులు/మహిళలు): **9 పోస్టులు**
2. కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్)(పురుషులు/మహిళలు): **115 పోస్టులు**
3. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్)(పురుషులు మాత్రమే): **4 పోస్టులు**

అర్హత: హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి, వెటర్నరీలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సు; కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 10 నాటికి హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్(కెన్నెల్‌మన్) పోస్టులకు 18-27 ఏళ్లు; కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పే స్కేల్: హెడ్ కానిస్టేబుల్‌కు రూ.25,500. కానిస్టేబుల్‌కు రూ.21,700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ ఖాళీలు

ఖాళీలు 80

అనంతపురం జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అంగన్‌వాడీ వర్కర్/మినీ అంగన్‌వాడీ వర్కర్/అంగన్‌వాడీ హెల్పర్

ప్రాజెక్టుల వారీగా ఖాళీలు: అనంత అర్బన్- 8; శింగనమల-6; నార్పల-9; అనంత రూరల్-10; తాడిపత్రి-14; గుత్తి-5; ఉరవకొండ-12; కళ్యాణదుర్గం-6; కనేకల్లు-5; కంబదూరు-7; రాయదుర్గం-2

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

జీతం: నెలకు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు రూ.11500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.700, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7000.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1

వెబ్‌సైట్: https://ananthapuramu.ap.gov.in/



ఎంటీపీఎఫ్‌లో టెక్నీషియన్లు

ఖాళీలు 81

ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్)కు చెందిన మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌లోని మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ...ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:
1. జూనియర్ మేనేజర్: **26 పోస్టులు**
2. డిప్లొమా టెక్నీషియన్: **34 పోస్టులు**
3. అసిస్టెంట్: **2 పోస్టులు**
4. జూనియర్ టెక్నీషియన్: **19 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, సీఎన్‌సీ ఆపరేటర్, టూల్ డిజైన్, గ్రైండర్, ఎలక్ట్రీషియన్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు జూనియర్ మేనేజర్ పోస్టులకు రూ.47,610; జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.34,227; మిగతా పోస్టులకు రూ.37,201.

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్, మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్, థానే, మహారాష్ట్ర' చిరునామాకు పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 11

వెబ్‌సైట్: https://avnl.co.in/

లిటిల్స్

అంతు లేని కథ


ఒక రోజు అక్బరు, చక్రవర్తి తన కొలువులో కూర్చుని సభికులకు ఒక పోటీ పెట్టాడు. అదేమిటి అంటే చక్రవర్తి తాను ఆపు అనే అంత వరకు కథ చెబుతూనే ఉండాలి. అలా చెప్పగల వారికి బంగారం వజ్రాల వంటి విలువైన బహుమతులు ఎన్నో ఉంటాయని ప్రకటించాడు.

పోటీ మొదలయే రోజు రానే వచ్చింది.అందరూ ఆ పోటీలో ఎప్పటి లాగే బీర్బల్ గెలుస్తాడని ఊహించారు. ఆ రోజు ఒక్కో కథకుడు వచ్చి మంచి మంచి కథలు చెబుతూఉంటే అక్బరు వాటిని కళ్లు మూసుకుని హాయిగా వింటున్నాడు. కానీ ప్రతి కథ అయిపోయిన వెంటనే అయ్యో..అపుడే కథ అయిపోయిందా;?అంటున్నాడు, ఎక్కడా చక్రవర్తి ఎవరినీ ఆపమని అనడంలేదు. ఇదంతా చూసి చివరగా బీర్బల్ కథ చెప్పడానికి వచ్చాడు. తన కథను ఇలా మొదలు పెట్టాడు. 'మహారాజా.. ఒక అడవిలో పెద్ద చెట్టు కింద సింహం నిద్రపోతూఉంది, అందరినీ ఎల్లపుడూ భయపెట్టే ఆ సింహం అంత ప్రశాంతంగా నిద్రపోతూఉంటే మొదట దాన్ని చూడటానికి ఒక ఎలుగుబంటి వచ్చింది. అలా వరుసగా



అడవిలోని జంతువులన్నీ రాసాగాయి. ఆ పక్కనఅడవిలో మరో ఇరవై సింహాలున్నాయి, అందులో మొదటి సింహం వచ్చింది. నిద్రలో ఉన్న సింహాన్ని చూసి వెళ్లింది. ఆ తరువాత రెండవ సింహం వచ్చింది అలాగే చూసి వెళ్లింది ఆ తర్వాత మూడవ సింహం వచ్చింది, ఆ వెంటనే అయిదవ సింహం వచ్చిందిఈని చెబుతూఉండగా అక్బరు బీర్బల్‌ను ఆపి ఇలా అన్నాడు 'ఏమిటి నీకు అసలు లెక్కలే రానట్టు ఉన్నాయి, మూడు తరువాత ఏకంగా ఐదు అని లెక్కపెడుతున్నావు మధ్యలోనాలుగవ సింహం లెక్కఏది? ఆపు'అని చిరాకుగా అరిచాడు. వెంటనే బీర్బల్ 'మహారాజా నాకు ఇస్తాను అన్న విలువైన బహుమతులేవో ఇచ్చేస్తే,నేను ఇక వెళ్లిపోతాను అన్నాడు.

దానికి అక్బరు 'నేనెపుడు నిన్ను కథ ఆపమన్నాను?నేను చాలు అనలేదు కదా అనేసి వెంటనే తన పొరపాటు గ్రహించి, నాలిక కరుచుకున్నాడు, ఆ తర్వాత నీ తెలివికి చమత్కారానికి నీకు ఏమిచ్చినా తక్కువే బీర్బల్ ఇదిగో నువ్వే గెలిచావు' అని నవ్వుతూ బీర్బల్‌కి తాను ముందుగా చెప్పిన దానికంటే ఎక్కువ కానుకలు ఇచ్చి పంపాడు.



10 తేడాలను కనిపెట్టండి

సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 420

	3	6	5	4				7
			7					
7	8	5				6		
		3		7		4	9	
9				2				5
	6	8		9		7		
		1				8	4	9
					9			
8				1	4	5	3	

సుడోకు - 419 సమాధానం

5	2	7	3	9	6	8	1	4
9	3	4	8	2	1	7	6	5
1	6	8	7	5	4	3	2	9
2	4	6	5	1	8	9	3	7
8	9	3	4	6	7	2	5	1
7	1	5	2	3	9	6	4	8
4	7	2	6	8	5	1	9	3
6	5	1	9	7	3	4	8	2
3	8	9	1	4	2	5	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.